శ్రీ

# చింతామణి.

ప మాసమున కొకసారి ప్రకటింపఁబడును

| సంపుటము ౨ | చెన్నపురి<br>హేవిళంబి సంపత్సర చైత్ర, వైశాఖ మాసములు | సంచిక 10,11 |
|---|---|---|


## THE LATE Rt Hon Mr GLADSTONE

శ్రీమహారాజ్ఞిగారి కనేక పర్యాయములు ప్రధానమంత్రిగానుండి, జగత్ప్రసిద్ధులయిన గ్లాడ్‌స్టన్ దొరవారు ఈమెయినెల ౧౯ వ తేదిని లోకాంతర గతులయినారని తెలుపవలసి వచ్చినందున కెంతయుఁ జింతిల్లుచున్నాము ఆమహానుభావుని రూప మీక్రిందిపటమునఁ జూపఁబడి యున్నది—



ఈయన మరణవార్తను విని యింగ్లాండునందు ఖండమునందంతటను కూడ బీదకాపులు మొదలుకొని - జనులును వ్యసనపడిరి రషియాచక్రవర్తి తంత్రీముఖమున నా పుత్రులకు దుఃఖోపశమన వార్తను బంపెను, శ్రీమహారాజ్ఞి యెడలఁగల గౌరవమును మరణమువలనఁ గలిగిన సంతాపమును దెల శమన లేఖను వ్రాసిరి, రాణిగారి జ్యేష్ఠపుత్రులగు యువరాజుగా రీయన గ్రస్తుఁడుగా నుండినప్పుడును మరణవార్తను విన్నప్పుడునుతమ విచారమును దెలుపుచు లేఖలను వ్రాయుటయేకాక శవవహన కార్యమునందును తామగ్రేసరులయిరి రాణిగారి పార్లమెంటు మహాసభలోని జనప్రతినిధిసంఘమువారును ప్రభుసంఘమువారును సభకూడి యన్నిపక్షముల వారును తమ యభిప్రాయ భేదములను మఱచి యా మహానీయుని యోగ్యతను గుఱించి ప్రసంగములుచేసి దొరతనమువారి సొమ్ముతో నుత్తరక్రియలు చేయవలయునని యేకగ్రీవముగా నిశ్చయము చేసిరి ఆసభయందా మహామహుని గూర్చి ప్రసంగములు చేయునప్పుడు ప్రతిపక్షులుగానుండిన మంత్రులకన్నులనుండి సహితము కన్నీరు జోటజోటకారఁజొచ్చెనఁట! ఈయన యపరక్రియలకయి యథమపక్షము ఏడువేలపౌనులనఁగా నిప్పటి బంగారపు వెలనుబట్టి లక్షరూపాయ తక్కువకాకుండ దొరతనమువారు వ్యయముచేయుదురఁట! ఈయన సర్వదా జను క్షేమాభివృద్ధులకొఱకును స్వాతంత్ర్యములకొఱకును పోరాడినవాఁడు అందుచేత నీయనయెడల ప్రజలకుఁగల యనురాగమింతింతయని చెప్పుటకు శక్యముకాదు ఈయన శవమును పెట్టెలోఁబెట్టి బిగించి సమాధిమందిరమున నున్నతస్థలమున నుంచినప్పుడు మొదటిదినము లక్షయు డెబ్బదియైదు వేల జనులును రెండవదినమున లక్షజనులును చూడ వచ్చుటయే యీయనప్రజానురంజకత్వమును వెల్లడి చేయుచున్నది ఈయన మంత్రాంగమునం దసమానసామర్థ్యము కలవాఁడగుటయేకాక వక్తృత్వమునందును సాటిలేనివాఁడయియుండెను ఇటువంటి వక్తయిప్పుడు జీవించియున్నవారిలో నొక్కఁడును లేఁడు ఈతఁడు ప్రసంగములు చేయునప్పుడు కొన్నిసమయములయందు వినువారు చిత్రప్రతిమలవలెనయి చేతనము లచేతనములగు నన్నపూర్వోక్తని గొంతవఱకు నిజము చేయుచువచ్చిరి ఈయనకు మతసిద్ధాంత రహస్యములయం దత్యంతపాండిత్యము కలిగియుండెను, ఈయన బహుభాషలయందు ప్రవేశముగలవాఁడయి గ్రంథకర్తయయి బహుగ్రంథములను రచియించెను, ఈయన దేహపటుత్వముగలవాఁడయి వ్యాయామ విద్యలయందు నిపుణుఁడయియుండెను ఇన్నిసామర్థ్యములున్నను నీతిబలమొక్కటి లేక పోయినపక్షమున సర్వమును వ్యర్థమగునుగదా! ఈయనకుఁగల శక్తి సామర్థ్య

ములకన్నిటికిని నిష్కళంకమయిన సత్ప్రవర్తన మీయన కమూల్యాలంకారముగా నుండెను ఈయననీతిబలమే యెల్లవారిని వశ్యులనుజేసి యీయనను ప్రేమించునట్లు చేసెను. ఇటువంటి మహాత్ముని చరిత్రమును సంక్షేపముగా వ్రాయవలెనన్నను కొన్ని సంపుటములు నిండకమానదు కాబట్టి మేమట్టిపనిని పైబెట్టుకొనక యీతని జన్మాదికథనము గొన్ని పంక్తులలోఁ దెలుపుచున్నాము

సర్ జాన్ గ్లాడ్ స్టనను వతఁడు గొప్పవర్తకుఁడయి ప్రఖ్యాతి చెందియుండెను ఆతనికతఁడు చతుర్థపుత్రుఁడయి ౧౮౦౯ వ సంవత్సరము డిసెంబరు ౨౯ తేదిని జననమొందెను ఇతఁడు ఆక్సుఫర్డు సర్వకలాశాలలో విద్యాభ్యాసము చేసి ౧౮౩౧ వ సంవత్సరమునందు విశేషగౌరవముతో మొదటితరగతిలో పట్టపరీక్షయందుఁ గృతార్థుఁడయ్యెను విద్యాపరిపూర్తికయి యితఁడొక సంవత్సరము యూరపుఖండమునందు దేశసంచారము చేసి వచ్చి ౧౮౩౨ సంవత్సరమున స్వదేశము చేరి, ఆసంవత్సరాంతమున స్థితిపాలనపరుల పక్షమున న్యూయార్కు నగరమునకు ప్రతినిధిగా కోరుకోఁబడి పార్లమెంటు మహాసభలో ప్రవేశించెను వాణిజ్యవిషయములయందలి నైపుణ్యమును, విద్యావిషయములందలి ప్రావీణ్యమును, నిర్దుష్టమయిన ప్రవర్తనమును, వ్యవహారదక్షతయు, కార్యనిర్వహణదీక్షయు, కనిపెట్టి యప్పటి ప్రధానమంత్రియైన సర్ రాబర్టు పీల్ దొరవారు ౧౮౩౪ వ సంవత్సరమునం దీయనను సహాయకోశాధ్యక్షునిగా నియమించి ౧౮౩౫ వ సంవత్సరమునందు అనుగతరాష్ట్రకార్యదర్శిని గాఁ జేసెను స్థితిపాలనపక్షమువారి యధికారము పోయినప్పుడు గ్లాడ్ స్టన్ దొరగారును తనయుద్యోగమును బోఁగొట్టుకొని యప్పుడధికారమునకువచ్చిన వృద్ధికరణపరులకు ప్రతిపక్షమునందుండి పనిచేయుచు, ౧౮౪౧ వ సంవత్సరమునందు స్వపక్షమువారు మరల నధికారమునకు రాఁగానే వాణిజ్యసంఘమున కుపాధ్యక్షుఁడును కోశాధ్యక్షుఁడునయి రాణిగారి యాంతరంగికసభలో నొకమంత్రియయ్యెను ఈప్రకారముగా ౧౮౫౯ వ సంవత్సరము వఱకును స్థితిపాలనపరుల పక్షమునందుండి, ఆసంవత్సరమున వృద్ధికరణపరులపక్షము నవలంబించి ఆక్సుఫర్డు సర్వకలాశాల పక్షమున ప్రతినిధిగావచ్చి యప్పటి యాంతరంగికసభయందు కోశాధ్యక్షుఁడయి మంత్రివర్గములో నొక్కఁడయ్యెను వృద్ధికరణపరులధికారమునకు వచ్చినప్పు డితఁడు నాలుగుపర్యాయములు ప్రధానమంత్రియయి రాజ్యతంత్రములను మహాసామర్థ్యముతో నిర్వహించి మెప్పువడసెను. ఈప్రకారముగా నితఁడు అఱువదిసంవత్సరములకంటె నెక్కువకాలము పార్లమెంటు మహాసభలో జనప్రతినిధిగానుండి దేశమునకు మహోపకారము చేసి ౧౮౯౫ వ సంవత్సరమునందు జనప్రతినిధిత్వమును మానుకొనెను తరువాత నీతఁడప్పుడప్పుడు కొన్ని

యుపన్యాసములును ప్రసంగములును చేయుచువచ్చినను రాజ్యాంగవిషయములయందు పనిచేయలేదు ఇతఁడు ఎనుబదితొమ్మిది సంవత్సరములు జీవించి విశుద్ధచరితుఁడయి తనజీవనమును పరోపకారార్థముగాఁ గడపి సర్వజనుల సమాదరమునకును పాత్రుఁడయి సార్థకజన్ముఁడయి కీర్తిశేషుఁడయ్యెను లోకములో మనుగడయన్న నిట్లుగదా యుండవలెను'

# Science Paper Series No. 10.

## The Movements of the Sea—(సముద్ర చలనములు)

## WIND WAVES, CURRENTS AND TIDES

సముద్ర జలమందుఁ గల్గు చలనములు ముప్విధములుగా నున్నవి —(1)వాయు ప్రసారముచేఁ గలుగు చలనములు (Wind waves), (2) సముద్రముయొక్క ఉపరి భాగమున నుద్భవిల్లు ప్రవాహ భేదములు (Oceanic currents), (౩) పోటుపాటులు (Tides)

### WIND WAVES

ఒక పాత్రలోనున్న నీటిపై మనము బలముగ నూదినచో నాజల మేవిధమున కదలి స్వల్ప తరంగములఁ బుట్టించునో యట్లే సముద్ర జలము మాహావాయు ప్రసారముచేఁ గదల్పఁబడి పెద్దపెద్ద తరంగముల నేర్పరుచు చుండును ఉన్నతమైన పర్వత శిఖరముననుండి గాని, ఓడయొక్క మధ్యకొయ్య చివర మీదినుండిగాని మన మా తరంగములఁ జూచితిమేని యవి వరుసలుతీరి ఒకదాని వెంట నొకటి అతిక్రమముగను, రమ్యముగను కదలిపోవు చుండును తరంగములు ముందు ముందునకుఁ గదలి పోవుచున్నట్లు కన్పించినను ఎక్కడనున్న జల మక్కడనే యుండునుగాని, స్థలమును మార్చుటలేదు నీరు ఉన్నచోటనుండియే పైకెగసి తత్క్షణంబ క్రిందికి పడుచుండును. అయినను వాయు వతిబలముగ వీచినపుడు నీరు కొద్దిదూరము వరకును గొనిపోఁబడుటయుఁ గూడ కలదు కాని యట్లు సాధారణముగ జరుగదు.

బాగుగ పెరిగిన వరివెన్నులపై వాయువు పోయినపుడా వెన్నులెట్లు దిలలువంచి తిరుగ వెంటనే వానిని లేవనెత్తుచున్నవో అట్లే సముద్రజలము గూడ వాయువు ప్రసరించినపుడు కదలి క్రిందికివంగి తత్క్షణమే పైకెగయుచుండునుగాని మరియొకటి కానేరదు.

గొప్ప తుపాను (Storm) సంభవించిన సమయమున సముద్రజల మతి భయంకరముగఁ గదల్పఁబడి భీకరమగు తరంగముల పుట్టించును ఈయలలు తుపాను పుట్టిన స్థలముననే నిలువఁబడి యుండక తుపానుయొక్క ఆనవాలైనను లేనట్టి యితర స్థలములకుఁ గూడఁ బోవును. ఇవి తుపాను చల్లారిన వెంటకూడ ప్రబలుచుండుట కలదు జలమతిమృదువయిన పదార్థమగుటంజేసి యది చలనము నతిశీఘ్రముగ గ్రహించి యీ చలనమును దూరదూరములకుఁగూడ తీసికొని పోవుచుండును ఇందువలననే తుపాను పోయినవెనుక భయంకరమగు తరంగము లుండుటకు కారణ మగుచున్నది ఇట్టి తరంగ చలనమునే యాంగ్లేయభాషలో (Ground swell) అని వాడుచున్నారు

నీరు లోతుగ నుండినపుడు తరంగ చలనము స్పష్టముగ దృశ్య మయినను, లోతుతగ్గి భూభాగము సమీపించిన కొలఁది, నీరు పైకిని క్రిందికిని కదలక ముందు ముందునకు ద్రోసికొని పోఁబడుచుండును అట్లు తీసికొని పోఁబడిన వెంటనే వెనుకకు మళ్ళి రెట్టింపు బలముతో భూభాగముపైఁ దిరుగ పడి ఆనీరు ఫేనమగుచుండును (Foam)

తరంగము లింత భయంకరముగఁ గన్పట్టినను, మిక్కిలి లోతుగల నీటి యడుగునకు పోఁజాలవు ఇంతియగాక సాధారణముగ నిట్టి తరంగ చలనము నీటి యుపరి భాగమునకు ఇన్నూరు మున్నూరు అడుగుల లోతుకన్న ఎక్కువుగ నెన్నడును పోనేరదు ఉప్పెన మొదలగు ఉపద్రవములు సంభవించినపుడు గూడ ఉపరిభాగమునఁ గలుగు అల్ల కల్లోలము నీటి యడుగునకు పోఁగలిగియుండదు ఇందువలన ననేకలాభములు గలవు తరంగములు నూరడుగుల ఎత్తు వరకును లేచినట్లు శాస్త్రిజ్ఞులు వక్కాణించియున్నవారు ఇంకను అట్లాంటిక్కు (The Atlantic Ocean) మహాసముద్రమున నీరు కొన్ని సమయముల నూటమూడు నూటనాలుగు అడుగుల ఎత్తు వరకును లేచినట్లు తెలియవచ్చుచున్నది

సముద్ర మధ్యముననున్న తరంగముల వలన నాశనమంతగఁ గలుగదుగాని వడ్డునకు పోయిన కొలఁది నీ తరంగములు నాశన కరము లగుచుండును భూభాగము సమీపించిన కొలఁది నిరాతంకపడి యత్యున్నతముగ లేచుచుండును అట్టి తరంగములయొక్క బలిమిని జ్ఞాను లతిజాగరూకతతోఁ గన్పట్టి యున్నవారు సముద్రపుటొడ్డున నిరువది యడుగుల ఎత్తువరకును లేచి పైఁబడు తరంగము ఒక చదరపుటడుగు (One Square foot) విరివిగల స్థలమున టన్నున్నర (1½ Tons) బలిమిచే భూమిని నొక్కుచుండును వేసవికాలమున బ్రిటిష్ దీవులకు పశ్చిమ తీరమందలి తరంగములు అంత విరివిగల ప్రదేశముననే 611 పౌనుల బరువుతో పైఁబడుచుండును.

శీతకాలమున వీని బలిమి యింతకు మూడురెట్లెక్కువుగ నుండును కొన్నికొన్ని స్థలముల మూడున్నర టన్నుల బరువుతోఁ గూడ భూమిపై తరంగములు పడుచున్న సంగతి కనిపెట్టఁ బడినది

## CURRENTS

సముద్రజలము వాయు ప్రసారమును బట్టి చలించుట చూచితిమిగదా వాయువునం దెప్పుడును ప్రవాహము (Atmospheric currents) లనేకము లుండును వాయువునకును సముద్రజలమునకును గల యత్యంత మైత్రివలన నట్టి ప్రవాహభేదములు నీటియందుఁ గూడఁ గనుఁగొనుచున్నాము సముద్రమున నిట్టి ప్రవాహములు ఉపరి భాగమునకు నైదువందలయడుగులలోతుకన్న నెక్కుడు లోతునకుపోఁచాలవు వాయు ప్రవాహ బలముచే (by the influence of the Atmospheric currents) జలము కదలి సముద్ర భాగమున పరుగులిడి వాయు ప్రవాహము వెంటనే పోవుచుండును ఇందులకు నిదర్శనముగ నొక యుదాహరణము నిక్కడ పొందుపరచుచున్నారము ప్రేడు వాయువుల విషయమై (Trade winds) వెనుకటి విషయములనుగురించి చెప్పినప్పుడు కొంచెము ముచ్చటించితిమిగదా ఈవాయు ప్రవాహముల వలన జలభాగమున ప్రవాహ ముద్భవిల్లి, నిరక్షరేఖ (The Equator)కు చేరువను పోవుచుండును ఈనిరక్ష రేఖకు నీ ప్రవాహము ఒక వైపున ఉత్తర పూర్వముగను (North East) రెండవ వైపున దక్షిణ పూర్వముగను (South East) వచ్చి, దగ్గరగా కలసి, తిరుగ పశ్చిమ గామియై నిరక్ష రేఖ వెంబడిని అట్లాంటిక్కు ఫసిఫిక్కు మహాసముద్రముల దాటుచుండును కనుకనే దీనిని నిరక్షరేఖా ప్రవాహమని (Equatorial current) వాడుచున్నారు ఈప్రవాహము అట్లాంటిక్కు మహా సముద్రమున మూడువందల యడుగుల లోతువరకును ఉండును ఇట్టి ప్రవాహముల కడ్డముగ భూమియుండనిచో నివి భూగోళమును చుట్టి ఎడతెగకుండ నొక మార్గముననే పోవలసియుండును కాని మధ్యను గొప్పగొప్ప భూఖండములుండుటచే నిట్టిప్రవాహములాపఁబడి వేరువేరు మార్గముల తిరుగఁగొట్టఁబడుచున్నవి దేశభేదములఁబట్టి వీని కనేక నామములు గలవు నిరక్షరేఖాప్రవాహము అట్లాంటిక్కు మహాసముద్రము దాటుసమయమున అమెరికాకు సమీపముననున్న సెంటురోకు అగ్రము (Cape St Roque) నకు తగిలి చీలునవై ఉత్తర దక్షిణములకు పారుచున్నది దక్షిణప్రవాహము బ్రెజీలు (Brazil) దేశమునుచుట్టి పోవుటచే బ్రెజీలు ప్రవాహ(Brazil current) మని వాడఁబడుచున్నది. ఇంకొకటిఉత్తరపథగామియైగల్ఫుస్ట్రీమని(Gulf stream) వాడఁబడుచున్నది. నిరక్ష

ఖా ప్రవాహపు పాయలగుటంబట్టి ఈప్రవాహభేదములందలి నీరు అత్యుష్ణతఁగలిగి
యుండును ఈయుష్ణజల మీరూపమున ఉత్తరదక్షిణ శీతమండల ప్రాంతములఁజేరి
క్కడివారల కానందము గల్పించుచున్నది ఈచెప్పినదంతయు నొక నిదర్శనము
ట్లే యనేకప్రవాహములు భూభాగస్థితులవలనఁగలిగి వివిధనామములచే వాడఁబడు
న్నవి

ఇతర నిదర్శనములనుబట్టియి ట్లే శీతలప్రదేశములందలి శీతము ఉష్ణదేశప్రాంతము
లకు జలప్రవాహరూపముననే వచ్చుచున్నట్లు శాస్త్రజ్ఞులునుడువుచున్నారు ఈప్రవా
హము నీటియడుగుమార్గమున శీతమండలములనుండి ఉష్ణమండలములకువచ్చును కాని
వీని చలనకారణములు పూర్ణముగ నెఱిఁగినవారులేరు

## TIDES

పోటు పాటులు సముద్రచలనములలో మిక్కిలి యద్భుతములైనవి పూర్వకాల
మునుండియు జను లీపోటు పాటులకును చంద్రునకును అత్యంతమైత్రి గలదని ఎరుగు
దురు సూర్యమండలము భూమండలముకన్న పెక్కురెట్లు పెద్దదియగుటఁబట్టియు,
చంద్రుఁడు భూమికి అతిసమీపమున నుండుటఁబట్టియు, వీనిచే భూగోళము బలముగ
నాకర్షింపఁబడుచున్నది. ఇట్టి యాకర్షణబలముచే సూర్యమండలమునకుఁగాని చంద్ర
మండలమునకుఁగాని యెదురుగనున్న భూభాగము వానివాని వైపునకు లాగఁబడును
ఈయాకర్షణవలన భూగోళమునందలి కఠినభాగ మంతగ లేవకపోయినను, జలభాగము
మాత్ర మతిసూక్ష్మమున నెత్తుగ పైకిలేచి పోగుపడును ఆకర్షించుచున్న మండలమునకు
నెదురుగనున్న భూభాగమందలి నీరు లేచును సరేకదా, ఇందుల కావలివైపుననున్న
జలముగూడ నెత్తుగలేచును ఇందులకు కారణమేమన —ఆవలివైపుననున్న భూభాగ
మునసున్న కఠినభాగము (Solid crust) ఎక్కువగను, జలభాగము తక్కువగను ఆక
ర్షింపఁబడుచుండును కనుక జలభాగమక్కడ భూభాగమునువదలి పైకివదులుగ పోగు
పడుచుండును కాని అక్కడజలము మొదటిభాగముననున్న నీరులేచిన ఎత్తునకు లేవ
లేదు భూమండలమందలి జలమిట్టి యాకర్షణబలముచే ఇరుప్రక్కల పైకిలేచినపుడు,
నిమ్మపండువలె గుండ్రముగానుండు భూమి అడ్డముగాసాఁచిన కోడిగ్రుడ్డుయొక్క ఆ
కృతిని పొందవలసియుండును కాని యట్లు భూమియొక్క ఆకృతిమారదు లేచిన
నీరు భూమినిచుట్టి పోవుచుండును భూమిక నొకవైపున చంద్రమండల మున్న
దనికొనియెదము అప్పుడాచంద్రమండలమున కెదురుగనున్న జలములేచును ఇందు
లకు సరిగా నావలివైపుననున్న జలముగూడలేచును భూమి తననారాచముపై చుట్టి

పోవుటచేతను చంద్రుఁడు ఇరువదియైదు గంటలలో భూమిని చుట్టివచ్చుటచేతను, పైకిలేచినజలము చంద్రగమనము ననుసరించి చంద్రుఁడు భూమినిచుట్టి వచ్చునంతటిలోఁ దానును భూప్రపంచమును జుట్టివచ్చుచున్నది జలము భూమండలమున కరుపక్కల లేచుటచే ఇరువదియైదుగంటల సమయములో భూమండలమునందంతటసముద్ర జలము రెండుసారులు పైకిలేచుటయు రెండుసారులు క్రిందికిపడుటయుఁ గలుగుచుండును దీనినే పోటును పాటును అనియెదరు గనుకనే ఆరుగంటలు ఎడముగ రెండుసారులుపోటును, రెండుసారులు పాటునుగలుగుచుండును మొదటపోటును, దాని వెనుకపాటును, తిరుగపోటును, వెంటనే పాటును గలుగుచుండును ఈపోటుపాటులు చంద్రుని యాకర్షణశక్తివలననె కలుగుచుండుటలేదు సూర్యుఁడు చంద్రునికన్న నెక్కువగనాకర్షింపశక్తిగలిగిన వాఁడయ్యును అతిదూరముననుండుటచే నట్లుచేయఁజాలకున్నవాఁడు. సూర్యునియొక్క ఆకర్షణ చంద్రుని ఆకర్షణలో మూఁడవభాగముండుటయైన దుర్గభము అసహాయముగ సూర్యుని యాకర్షణశక్తి నేమియు చేయలేకపోయినను, చంద్రునిబలముతో కలసినప్పుడు మాత్రము ఎక్కువపనిని చేయుచుండును సూర్యచంద్రులు భూమికి నొకవైపున నేకపంక్తినేయున్నపుడును భూమికిరు ప్రక్కలనుండి యేకపంక్తిలో నుండినపుడును ఇట్టి యద్భుతచర్యలు బయలువెడలుచుండును ఇట్లుండినపుడే అమావాస్య పూర్ణిమ దినములు సంభవించును వీని కాణము గురించి ఇంకొక విషయమున వ్రాయునపుడు పూర్తిగవ్రాసెదము

అమావాస్యా పూర్ణిమ దినములలోఁ గలుగు అద్భుతమైన పోటునకు (Spring tides) అనియు, చంద్రుఁడుపక్కగా నొక్కమూలనుండి సూర్యుఁ డొకమూలనున్నపుడు గలుగుపోటునకు (Neap tides) అనియు వాడుచున్నారు

పోటుపాటులు చంద్రసూర్యాదుల గమనిక ననుసరించియుండును గనుక వాని కాలన్నిర్ణయము సులభముగ చేయవచ్చును ఇట్లే ఒక చోటనుండి పోటు మరియొకచోటికి పోవుట కెంతికాలముపట్టునో కనిపట్టియున్నవారు పోటుయొక్క వేగ మనేక సంగతులఁబట్టి గలుగుచుండును నీరు లోతుగనుండినపుడును, భూభాగమాతంకపరచనపుడును, పోటు అతివేగమున చలించును ఇతర సమయములనట్లు పోఁజాలదు నిక్షురేఖకు సమీపమున అట్లాంటిక్కు మహాసముద్రమున పోటు గంటకు 500 మైళ్ళ చొప్పునఁ బోవునని చెప్పుచున్నారు

హరిహరుఁడు ధనమునువిడిచి, సీతనువిడిచి, ప్రాణములువిడుచుటయు, సీత దనపొత్తున కంగీకరించుటయు, శాయాజీ, బాజీరావును ముందుగఁ జెరవిడిపించి పంపఁదలచి పల్లకిఁ దెప్పించి బోయల సిద్ధముఁజేసి సీతతో మరల మాటలాడుచున్న బాజీరావునుఁ బిలిచి పల్లకి నెక్కుమనెను వెంటనే గుడారమునుండి యొకవిగ్రహముఁవచ్చి యందుఁగూర్చుండఁ బోయ లొక ముహూర్తములో వాని మోచుకొని పోయిరి అట్లు బాజీరావును బంపి సీతనిమిత్త మెదురు చూచుచు శాయాజీ మదనతాపమునొందుచు మాటిమాటికి నామెవచ్చుచున్నదేమోయని గుడారము వెడలివచ్చి చూచుచు మనస్తాపము నొందుచుండ నింతలోఁ దనమనోరథసిద్ధి సేయఁదలఁచిన పారిజాతవృక్షమువలె సుందర వదనారవిందము చీకటి గుడారమున వెన్నెలగాయఁ గావలియున్న భిల్లులు నిద్రించినవెనుక నా పురుష విగ్రహము మహారాజుయొక్క గుడారముఁ బ్రవేశించెను ప్రవేశించుటతోడనే యెదురుగ నేగి శాయాజీ యాభువనమోహనవిగ్రహమును జేయిపట్టుకొని ముద్దుపెట్టుకొని దన మంచమునొద్దకుఁ దీసికొనివచ్చెను ఆకపటపురుషుఁడును మెల్లగ వచ్చి ప్రాణేశ్వరా! మిమ్ము వివాహమాడుటకు నాకు సందేహములేదు కాని మీరుయుద్ధములు చేయుటకరుగుదురు యుద్ధమున మరణమొందుదురేమోయని నాకు భయము కలదు సుండీయని పలికెను హోల్కారామెపలుకులకు సంతసించి నేను యుద్ధమునకెన్నడును బోవను భిల్లులను మోసపుచ్చుటకు కయ్యము సేయుదునని నేనందునేకాని యామాట యబద్ధము నిన్నువిడిచి నేనెందరుగుదును? ఇన్ని దినములనుండి నేఁ జేయు ప్రయత్నములు సఫలమైనవి ఏదీ యొకముద్దుఁబెట్టు ప్రాణేశ్వరీయని ముద్దుపెట్టుకొని చెక్కిలి నొక్కుచుండ నీవేషధారి యాకామాతురుని ఛెల్లున నొక చెంపకాయ గొట్టెను చుఱ్ఱున నసాళమంటిన యా దెబ్బతో శాయాజీక కన్నులనుండి బాష్పములు రా నది తుడుచుకొని మెల్లన నిట్లనియె సుందరీ, అబ్బాయిదేమి సరసమే గూబపగిలినది మాటలతో సరసముకాని చేతులతో నేమిసేయని మందలించి యాసుందరిని గౌఁగిలింపఁబోవ నాటక్కరి తన మొలలోనున్న బాకుదీసి శాయాజీని నేలఁ బడద్రోచి కుడిప్రక్క నొక్కపోటుపొడిచి యాక్షణమే యెరికం గనఁబడక యెటకో చనెను శాయాజి యాపోటుతోఁ గెవ్వున కేకవేయుటచే నార్తరవము నాలకించి గండాభిల్లు గండ్రగొడ్డలిభుజముపై వేసికొనివచ్చి పడియున్న శాయాజీనిఁజూచి యాశ్చర్యమొంది మెల్లగ వానిలేవనెత్తి కారణమడుగ నాతఁడు జరిగిన వృత్తాంతము సవిస్తరముగ నీరసముతోఁ జెప్పెను ఆమాటలు చెవుల సోక గండాభిల్లు మహాగ్రహమునఁ గన్బొమలు ముడివడ రూక్ష నిరీక్షణముల నాతనిఁజూచి "దురాత్మా నాతోఁ జెప్పక నీవిట్లుచేసితివిగనుక నీకింతేకావలెను సీత చంపుటకాదు నేను నిజముగఁ జంపివేసెదనుచూడు

నీవు నీచుఁడవుకాని రాజవుకావు అని మాటలచే నొప్పించి చేతిగొడ్డలి నెత్తెను అపరిమిత బాధపడుచు శాయాజీ యెట్లో లేచి భిల్లుని రెండుపాదములం బట్టుకొని నాతండ్రీ నన్నురక్షింపుము నన్ను నిష్కారణముగ దౌలతరావు గంగలోదింపినాఁడు నాకేదైన కట్టుగట్టి నాప్రాణములు దక్కింపుము అని జాలి గలుగఁ బ్రార్థనలుచేసి యేడ్చుట మొదలుపెట్టఁగా, గండాభిల్లు గొడ్డలిదింపి నీకు నేను గట్టుకట్టను చావుమని తిట్టి గుడారమువిడిచిపోయి సీతకై వెదకి యామెను బాజీరావును గూడఁగానక విసిగి తన బసకరిగెను

## ఇరువదియొకటవ ప్రకరణము

మఱునాఁ డుదయమున మంగళ తూర్యారావములు సెలంగ నహల్యాబాయి మేలుకొని కాల్యముల నిర్వర్తించి మహోత్సాహ భరిత మానసయై కోట ముట్టడింజరుపుచుండ జమానుఖా నామెకు సలాముచేసి రాధాకాంతరావు వచ్చియున్నాఁడనియు రాణీదర్శనముం గోరుచున్నాఁడనియు విన్నవించెను రాధాకాంతరావుపై సంపూర్ణముగ నలుక వహించిన దగుటచే రాణీ జమానుఖానుతో ,,నోయీ రాధాకాంతుని మొగము నేనిఁకఁ జూడఁజాలను అతని విశ్వాసముఁ గూర్చి మాకుఁగలపిచ్చి నమ్మకము పోయినది శ్యామసుందరదత్తును వదిలిపెట్టుమని గోమాజీరావున కుత్తరము వ్రాయుటయు రఘునాథరావుతోఁ దానుఁ జేరి నాపైకత్తిఁ బూనుటయు నాహృదయమున నాటినవి అందుచే నాతఁడు నావద్దకు రావలసిన పనిలేదు రఘునాథరావు వద్దకరుగుమనరాదా' యని యుత్తరముఁజెప్పెను చెప్పి ఖానుని వానిపని మీదికంపెను ఖాను వృద్ధుండగు రాధాకాంతరాయునిపైఁ దన యేలికకువచ్చిన నిశ్వాతుకాగ్రహమునకు విచారించి తనశక్తిలో నాకార్యము లేకుండుటచే నప్పటి కూరకుండెను రాధాకాంతరాయలుకకుఁ గతమేమయి యుండునాయని కొంత దడవు విచారించి జమానుఖానును బిలిచి తానరిగిన దండయాత్రలో జరిగిన విశేషాంశముల నెల్లనాతనికి రహస్యముగఁ జెప్పి రాణిదయను సంపాదింపఁ బ్రయత్నలోపము లేకుండ నింబపురము నందె నివసించెను అప్పటికి నింబపుర ముట్టడిలో రసపుత్రులకంటె మహారాష్ట్రులే జయము నొందువారివలెఁ గన్పడుచుండిరి రాణి కందుచే రాజపుత్రులను జయింపవచ్చునను ధైర్య ముదయించెను ఆమెకు ధైర్యమును శత్రులకధైర్యము నొకమారె జనించినందునఁ గడపటివారు జయమున కుపాయములు వెదకుటమాని సురక్షితముగ పారిపోవుట కుపాయము వెదుక నారంభించిరి రాజపుత్రసేనకుఁ దినుబడి సామగ్రి

యైనందున వారాఁకలికి నోర్వఁజాలక చిక్కులఁ బడుచుండిరి కోటలోనికి నీటి చుక్కయైనఁ బోనీయక యహల్యాబాయి నీటి యాధారముల నెల్లఁ గప్పించెను ఫిరం గుల మూలమునఁ గోటభేధింపఁబడి రంధ్రములతో నిండియుండఁ జొచ్చెను అందుచేఁ దమకు జయమునొందు నాశ లేశమయినను లేదనియు నహల్య తమతో సంధిఁ జేసి కొనదనియు నుదయపుర రాణావారు నిశ్చయించి పారిపోవుటకు ముహూర్తము నిర్ణ యించుకొనుటకు మొదలు పెట్టిరి శత్రువుల బలమును గుట్టును దనకుం జిక్కనందున నహల్య వారి లక్ష్యములేక వారులోఁబడినట్లె యెంచుకొని జస్వంతిరావు గండాభిల్లును దక్కఁ దక్కిన భిల్లులనెల్ల దాదాపుగ నిర్మూలించినట్లు విని యొక్క శాయాజీ హో ల్కారు విషయమై చక్కఁజేసికొనవలయునని నిశ్చయించి జమానుఖానునుం బిలిచి శాయాజీయొద్దకు రాయబారముఁ గైకొని పొమ్మని యానతిచ్చి యొకమూలపినుఁగువలె నొదిగియున్న వామనభట్టు నోటినుండి మహారాజు వసించుకొండల సానవాలు చెప్పించి దన పరివారముతో నంపెను నింబపురమున కాకొండ యొక వారము పయనములో నుండినందున జమానుఖాను రేయింబగళ్ళు నడచి శ్రమయనక యెండయనక కొండ లెక్కి వాగులు దాటి యరణ్యములం గడచి మూడుదినములకు శాయాజీయున్న స్థాన మునకువచ్చెను నాటిరాత్రి శాయాజీ సరిసమాడఁబోయి కత్తిపోటుఁదిని గండాభిల్లు ద్దనుండి సహాయము నందక కొంతసేపు బాధఁబడి తనప్రక్క గుడ్డలో నొకదానినిఁ గాల్చి మసిఁజేసి తన గాయమునకుఁ గట్టుకట్టుకొని మరియొక భిల్లు సాయమున మఱి కొంత యుపచారము చేయించుకొని గాయముఁ గుదుర్చుకొని సత్తువఁ దెచ్చుకొని సమయము దొరుకునేనిఁ దనకు రాజ్యము గిజ్యము వలదని భిల్లుల బారినుండి పరిలెంచి యే కాశిలోనైన ముష్టియెత్తుకొని బ్రతుకవచ్చునని యత్నముఁ గావింపుచుండెను పట్టా భిషేక మహోత్సవ కాలమునఁ దన్ను సేవించిన భిల్లులొక్కరొక్కరుగ దేశములపైఁ బడి జస్వంతరాయుని ఖడ్గధారాగ్నికి మిడుతలగుటచేతను కొందఱాతనిధాటికి వెఱచి దూరదేశములకుఁ బారుటచేతను మఱికొందరు వన మృగములవలెఁ గొండ గుహాలలోఁ దాగుటచేతను జమానుఖాను వచ్చునప్పటికి రెండువందలకంటె నెక్కుడు భిల్లులు ఆ పర్వతమున లేరైరి ఆరాత్రి గాయమే తగులకయున్న బలవంతుఁడుగ గండాభిల్లు శా యాజీని దనతోఁగూడ యుద్ధమునకుఁ గొనిపోయి యుండును రాజభట ముఖదర్శనము సేయు వారికఁగూడ నమితమైన భయమేగాని సాహస ధైర్యములు గలుగకుండెను జమానుఖాను రాణీ వద్దనుండి సందేశార్థములు దెలుపవచ్చినాఁడని విని యామె యొడం బడిక చేసికొనుననియుఁ దనకు రాజ్యము పూర్ణముగ రాకపోయినను గొన్ని జాఘీ రులైన రాకపోవనియు శాయాజీ యువ్విళులూరుచుండ నతనికి రాజ్యము గల్గినఁ దమకు

నిలువ నీడచేకురువని భిల్లులానందమొంది ఖానుగారిని సగౌరవముగ నాదరించి సందేశము జరుపుటకు వారునిశ్చయించిరి శాయాజీయుఁ దనపట్టాభిషేక కాలమునధరించు దుస్తులను నాభరణములనుఁ దొడుగుకొని శూరశిఖామణివలె మహారాజ రీవితోఁ దన గుడారమునఁ గూరుచుండ నింతలోఁ దన పరివారముతో జమానుఖాను ప్రవేశించిమహారాజునుఁ జూచి తనలో నగవుకొని తలయూచి సమర్యాదగా నమస్కారముఁజేసి యర్హాసనముపై నాసీనుఁడయ్యెను గండాభిల్లు గంద్ర గొడ్డలినిఁబూని తన మహారాజుయొక్క వామభాగమున నిల్చెను అప్పుడు ఖానుహొల్కారుతో "స్వామీ! తమతో నేనుఁ గొన్ని రహస్యములు మాటలాడవలయును మీ భిల్లుల నావలకంపి వేయవలయును తమకొక సందేహములేకుండ నాతురక మహారాష్ట్ర సేవకులఁ గూడ నావల కంపెదను మీరట్లు చేయుదురాయని మనవి యొనర్చెను అంతట భిల్లులు మహారాష్ట్రయోధులు, గుడారముఁబాసి దూరముగాఁజన, శాయాజీయు జమాన్ ఖాను నిట్లు మాటాడిరి

జమా—దేవా మీరు రాణీగారివిషయమున నేదో సదుపాయముఁ జేయ వలయును ఆమెకు ముద్దులు మూటగట్టునొక కొమార్తె గలదుగదా

శాయా—రాణికి నేను రెండుమూడు జాఘీరులుమాత్ర మిచ్చెదను నాఁడురాముగంతయు నొప్పగించి యిందూరు నగరము విడిచి యామె యరుగవలసినది ఇది లొప్పుకొనకున్న నే నొడంబడికఁ జేసికొనను

జమా—పాపము! దిక్కులేని యాఁడుదానిని మీరింత శ్రమపెట్టుట న్యాయము గాదు మఱియేపురతులనైనఁ గూడ నేర్పరుపుఁడు

శాయా—ముక్తాబాయిని నాకిచ్చి వివాహముఁజేసిన యెడల నేనామెను రాజ్యము నొందించి యన్నవస్త్రము లిచ్చి కాపాడెదను

జమా—పోనీ రాజ్యమంతయుఁ దమకామె వదలివేసినచో మీరామె కేమి యిచ్చెదరు మీతోడను మీ భిల్లులతోడను నామె యుద్ధముఁ జేయఁజాలదు

జమా—నెలకు నొకవేయిరూపాయీల మనోవృత్తి నిచ్చెదను అంతకన్న నెక్కువగా నేనేమియు సదుపాయ మామె విషయమునఁ జేయఁజాలను

జమా—ఆమె మిమ్ము పెంచుకొన్నచో మీరు దత్తులగుట కంగీకరింతురా

శాయా—ఏమో ఆలోచించి చెప్పవలెను ఆమె నాకుఁ దల్లియగుట నాకు శ్రేయముకాదు

జమాన్ ఖాన్ ఎందుచేతనో కడుదీనముగా మాటలాడుటఁజూచి శాయాజీ హొల్కారు తనకు వారు జంకినారనుకొని గర్వించి యంతకంతకు నిర్లక్ష్యముగఁ

బల్క నారంభించి, యావల తన బాహుబలమునుఁ దాను నుతియించుకొని జమాన్ ఖాన్‌తో ,,నోయీ నీవాడిన మాటలుమాకు మహానందమును కలిగించుచున్నవి నీవు మాయెడ నింబయభక్తులతోఁ బలుకఁ జట్టి నిన్నిట్లు విడిచితిమికాని కొంచెము గౌరవహీనముగాఁ బల్కితివేని నిన్నిక్కడ మట్టుపెట్టుదును నీ వదృష్టవంతుఁడవు పెద్ద లక్కరివి ఎవరివద్ద నెట్లు మాటలాడవలయునో పరిపూర్ణముగ నెరుగుదువు సుమీ'' యన ఖానునకు నిలుపలేనంత యాగ్రహము పొడముటచే నాతఁడు దిగ్గునలేచి ,,నేను మీపరాక్రమ మెఱుగుదును మీరు చెప్పనలెనా''యని యాతని రెండు భుజములుపట్టి గట్టిగనొక్కి చేతిలోనున్న ఖడ్గము నూడఁబెరుకకొనెను తెల్లపోయి శాయాజీ నోరెత్తకయుండ, ఖాను ,,నిన్ను రాణీతీసికొని రమ్మనినది రా'యని నేలకుంద్రోచి రెండు చేతులు వెనుకకుంగట్టి గుండెలపైఁ గత్తిమోపి ,,దురాత్మా నీవు హెూల్కారవా? నిన్నిపుడు నేను తుదముట్టించెద నీ దిక్కెవ్వఁడురా'' యని యొక్క యేటున వానిఁ జేయఁబోయి యంతట నిలిచి రాణి కాతని జీవముతోడ నుండఁగ నర్పించుట యుచితంబని పల్లకిఁ దెమ్మని తనభటుల కానతిచ్చెను ఇంతలో నీ సంరంభమును జూచి నూతిలోఁ బడిన వానిలాగు శాయాజీరా విడిన కేకను విని గండాభిల్లు తన మూకలం దోడుకొని తురకను నలుకుటకువచ్చెను భిల్లుల యట్టహాసమును సైరింపనోపక ఖానుయొక్క అంగరక్షక సేనలోనున్న ముప్పదుగురు మహారాష్ట్రులు నిరువదిమంది పచ్చి తురకలు నదివగకే తుపాకులలో మందు ధట్టించి యందున నొక పెట్టునవచ్చి గుడారపు గుమ్మము నాగి భిల్లులను లోని కరుగ నియ్యరైరి భిల్ల సైన్యప్రవాహము మహారాష్ట్రబలమను కట్టచే నాగఁబడినందున శాయాజీ నిర్విణ్ణుఁడై నహోరున నేడు పారంభించి తన్ను వదలుమని ఖాను ననేక భంగుల వేడుకొనెను కాని ఖాను హృదయము రాజద్రోహుల విషయమున మాణిక్యము వంటి దగుటచే వాని దీనాలాపములు వాని డెందమును గరగింప నేరవయ్యెను అప్పుడు కుపితులగు రెండువందల భిల్లులకును నేఁబదుగురు మహారాష్ట్రసైనికులకును ఘోరయుద్ధము జరిగెను మనుష్యులు మనుష్యులను గొట్టుట యటుండ ధమ్ముధమ్మున పేలు మహారాష్ట్రుల తుపాకులగుండ్లును రివ్వురివ్వున వచ్చు భిల్లుల యమ్ములును నొండొంటితో వియ్యమొంద సాగెను తుపాకినుండి వెడలిన ప్రతి సీసపుగుండు నొక్కనిప్రాణమును గొనుటచే జస్వంతరావుచే హతముగాక శేషించిన భిల్ల ప్రపంచమున కది ప్రళయకాలమయ్యెను ఆదినమున నూరుపురు భిల్లులు యుద్ధరంగమునకు బలియైరి ఒక తుపాకిగుండు గండాభిల్లు యొక్క చెవికఁదగిలి దూసికొనిపోవుటచే నాతఁడు రణరంగమును విడిచి వెంటనే ప్రాణరక్షణార్థ మొక కొండగుహాలోనికిం జనెను యజమానుఁ డరుగ గొఱ్ఱెదాటువలె భిల్లులందరు నొకరివెంట

నొకరరిగి యర నిమిషములో రణభూమిని నిర్మానుష్యముగాఁజేసి శాయాజీయొక్క హృదయమునుఁ గూడ ధైర్యశూన్యమగునట్లు చేసిరి మహారాష్ట్రసైనికులు హతులయిన భిల్లులపైఁబడి వారి కడనుండిన గొలుసొమ్ములును నేనుంగు దంతములును మొదలగువానిని దోఁచుకొని యుద్ధాంతమందు జరుగవలసిన పూర్వాచారమగు దోపుడున్నదనిపించిరి తర్వాత నొక ప్రాతపల్లకిలో శాయాజీని గూర్చుండఁ బెట్టిజమానుఖానా స్థలమును విడిచి ప్రయాణమును సాగించెను ఈప్రయాణములో శాయాజీ తన యుత్కృష్ట దశనుండి తప్పించుకొనుటకు చేత నయినంత యత్నము సలిపి కృతకృత్యుఁడుగాక ప్రాణములు వారికొప్పగించి యీశ్వరునిపయి భారమునువేసెను జమానుఖాను మూఁడుదినములకు నింబపురమునకుం జని తన ప్రజ్ఞాదికమును దెలియఁజేయ నామె వానికి బహువిధముల మెచ్చుకొని యొక రత్నపు టుంగరమును బహుమానముగనొసఁగి, తన యెదుటకు శాయాజీని గప్పించెను నిర్జీవ ప్రతిమలాగున బద్ధుఁడై యున్నవానిని జూచి రాణి "మాజ్ఞాతి నిట్టి యవస్థలో నుంచుట నాకిష్టము లేదు నాతో సరిసమానుఁడు నాకు మనోవృత్తి నియ్యఁజాలినవాఁడు ఈతనిని గౌరవింపక యవమానింప నామనస్సొప్పదు" అని పల్కి బంధవిమోచనము చేయించి-యొక పీఠముపైఁ గూర్చుండఁబెట్టెను ఆపలుకుల కులికి శాయాజి జమానుఖాను చేసిన యన్యాయమునుగూర్చి రాణితో నుచ్చరింపఁదలచి రాణి తనపక్షమున నున్నదని నమ్మి యిట్లనెను "మనమును మనయును సమానులమయి యేక కుటుంబములోఁ జేరిన వారమయితిమి. అట్టి నన్ను నా గౌరవము నెంచకుండ నీతురక చేతులు విరిచికట్టి యిట్లితఁడు తెచ్చుట మీరంగీకరించితిరా? ఈతఁడు నన్ను మీదగ్గఱకుఁ దెచ్చుటలో నీతని గొప్పలేదు నేను రావలెననుకొనుచుండఁగఁ దాను మీచే సన్మానింపఁబడుటకు నన్నిట్లు పరాభవించినాఁడు తల్లీ' అని మనవి యొనర్ప రాణి తలయూఁచి 'సరే' ఆవిషయమయి నేను విచారణ సల్పెదఁగాక నీవా గుడారముననుండుము" అని యానతిచ్చివిచ్చుకత్తులతోనుండు పచ్చి తురకలఁ గావలియుంచి సురక్షితముగ నాతని నాగుడారమున నుంచెను

## ఇరువది రెండవ ప్రకరణము

శాయాజి హోల్కారను నామధేయము నొసంగి యూకుట్ర వానినిఁ బయికిఁ దెచ్చుటలో దౌలతరావుయొక్క ముఖ్యోద్దేశ మొక్కటియు జరిగిన దొక్కటియు నయ్యెను క్రొత్త హోల్కారునకుఁ బట్టాభిషేకమగుట ప్రజలు వినిన తోడనే

యహల్యాబాయిని విడిచి తమవద్దకు వత్తురనియు రాణికి కప్పము పన్నులుఁ గట్టరనియు రాణి జంకి రాజ్యమునువిడిచి పోవుననియు నతఁడుగొంతెమ్మకోర్కెతో నీకార్యము కావించెను తరువాతఁ బ్రజలు తనమొగముఁ జూడకపోవుటయుఁ గొందరు దురాచారులుమాత్రము తన్నుఁజేరుటయుఁ జూచి దౌలతరావు బెంగగొని రసపుత్రులతోఁ జేరి వారికి నేవిధమయిన సాయముఁ జేయఁజాలక పట్టినపట్టు వీడవలదని ప్రోత్సాహము చేయఁదొడఁగి మరల శాయాజీయొక్క మొగముఁ జూడక భిల్లులఁ దలపెట్టక యేమి చేసినను రాజపుత్రులే దిక్కని వారి నమ్మియుండెను తమ రాణిపయిఁ దిరుగుబాటుఁ జేసిన కొంద ఱనామధేయుల మాటలనమ్మి రాణి త్రాణ దలియక యట్లుదేశముపైదండు విడియుటకును లంచముదిని గోమాజీరావు సహాయ మొసంగనందులకును దౌలతరావు మాటలు చెప్పుటయేగాని చర్యలు జరుప లేనందులకును నుదయపుర రాణావారుమిగుల నొచ్చుకొనుచుఁ బశ్చాత్తాపమునొంది యాఁడుదానిని గెలువలేక పచ్చినాఁడని రాజపుత్ర కుటుంబములు తిన్న దెప్పునని విచారింపసాగెను అట్లు పశ్చాత్తప్తు లగు మహా రాణావారి పాదసన్నిధికవచ్చి నిల్చి భేలాళసింగు నమస్కరించి యిట్లనియెను——

,,దేవా! యీ దౌలతరావు మనకుండియేమి! లేకయేమి? ఈతని నేల సాగనంపరాదు అదియటుండ నేనుదమకార్యమునకు ప్రాణములనైన విడిచెద నేను గోమాజీరావు మాటలునమ్మి మిమ్ము ప్రోత్సాహపెట్టి యిటకుం దీసికొని వచ్చితి అందుచేత నేనీ రాత్రి యొక యద్భుతముఁ జేసి తమకు జయము చేకుఱఁజేసెద నాకనుజ్ఞమాత్ర మొసంగుఁడు అని రాణాచెవిలో నొక రహస్యముఁ జెప్పి యాతని సమ్మతిఁబడసి తన ప్రయత్నమునఁ దానుండెను అంతట వైరానలము చల్లారనదని యొఱిఁగింపనో యన నెండ చండతమాని, యగుపడదయ్యెను దేశమంతయు వేపిమాడ్చిన శత్రుమండల మిదె గ్రుంకుచున్నదనియు దుఃఖ జలధి మునుగుచున్నదనియుఁజాటనా, భానుమండల మపర జలధిఁ గ్రుంకె శత్రువుల చండతేజంబడగిన వెనుక సన్మార్గవర్తులగు ధవళయశు లనేకులుందురని వెల్లడిసేయు తెఱగున నంబరమ్మున నక్షత్రకోటు లుదయించె అదికృష్ణపక్షమగుటచే వెన్నెలమాత్రము లేదయ్యెను ఆరాత్రి జామయిన తరువాత ముక్తనునిద్దుఁ బుచ్చి యహల్యాబాయి దగ్గరనున్న యాస్త్రీనిఁజూచి, యమునా నీకింతవిచార మెందుకు! ఈయుద్ధము ముగిసినదిగనుక శివనానానుబిలిచి నీకుమారుని వదిలించుటకు నేమి యభ్యంతరమున్నదో యడిగెదను నీవిట్లు విచారింపకు ఆహా కడుపుతీపును మించినదేదియు లేదుగదా ఇన్ని దినములు గడపితివి ఈరాత్రిఁగూడఁ గడుపుము నాకు నిద్రవచ్చుచున్నది నీవు మేలుకొనెదవాయని యడుగ ,,నమ్మా నాకు నిద్రవచ్చునా? ఇన్నిదినములనుండి యన్నమెట్టిదో యెఱుగను తల్లీ నాకు పుత్రభిక్షఁ బెట్టవేని

యింక మృతినొందుదుసుమీ యమ్మా"యని రాణిపాదములపైఁబడి కొంతసేపు వీఁ లేచి తనప్రక్కపైఁగన్నులు దెఱచి పండుకొనెను అహల్యాబాయియు నిర్ముక్త కంటకయై హాయిగ గుండెపైఁ జేయి వైచుకొని నిద్రించెను దౌలతరావాం రాత్రి నిద్దురలేక తన యవస్థఁ దలంచుకొని యింక తనకెట్టి యాసయు లేదని యేమియుం దోచక యిటునటుఁ దిరుగుచుఁ గొంతసేపొక చోటఁ గూరుచుండి యిట్లని విలపించెను „హా నేనేల రాజద్రోహముఁ జేసితిని చేసినవాఁడ నిందు నెఱవేరనైతి ఈ రసపుత్రులు నన్ను నమ్ముటలేదు ఏసహాయమును వారికి సలుపలేని నావంటి యప్రయోజకునియందు నమ్మకము వారేల నిల్పుదురు? ఆకమలపై నాకావెఱ్ఱి మోహమేల యుదయింపవలయును నాభార్యా! హా దుర్గదుర్గా! నేను నీగొంతుకోసి నాగొంతుకోసికొంటిని ఇఁక నీసుందరవదనదర్శనమును నీమధురాలాపములు నాలకించుట నాకులేదు భిల్లులతోఁ జేరి యచ్చటనుండక యేటికిచ్చటికి వచ్చితిని వీరు నన్నుఁగదల నీయరు నాభార్యచేసిన హితోపదేశమును మందోదరీవాక్యము నిరాకరించిన రావణునివలె నిరాకరించి యిట్టి ముప్పుదెచ్చి పెట్టుకొంటిని నేనుఁ జచ్చుచు నిరపరాధియగు శాయాజీ యను పేరుగల యాకుఱ్ఱవానిని బయలఁదీసి వానిని గోతిలోఁ బడద్రొక్కి చచ్చుమెత్తుకొని యైనఁ బ్రతుకకుండఁ జేసినాఁడను ఇప్పుడొకవేళ రాణిపాదములపైఁ బడి క్షమార్పణఁ జెప్పుకొన్నచో లాభముండునేమో? ఏమీ నావెఱ్ఱి? నావంటి ద్రోహిని రాణి బ్రతుకనిచ్చునా? పోదుండిరావా! నాజీవమున కుసూరుమనుచు నీవెందున్నావు హా దైవమా! నేను పాపినగుటచే నాకీమరణమునఁ గడుభయముదయించి యీ మొండి బ్రతుకు బ్రతుకవలెనని యున్నదిగదా" ఇట్లుపశ్చాత్తాపమొందుచుండిన దౌలతరావు నొద్దకు హఠాత్తుగావచ్చి „నీతోఁ గొంచెముపని యున్నది రాణావారు నీతోఁగొన్ని రహస్యములఁ జెప్పుమన్నారు ఒకమారు కోట బురుజుమీదికిరా?" అని భేతాళసింగు వానిం బిలిచెను కోటబురుజుమీది కొంటరిగ నేగుట కిష్టములేనివాఁడయ్యు, నెటులైనఁ దప్పదుగదాయని సింగువెంట నియమితస్థానమునకు విధిలేకనడచి పోయిదౌలతరావు ఎక్కలేక యెక్కలేక బురుజుపైనెక్కి కోటక్రింది కొకమారు దన దృష్టిఁ బరపెను. వెంటనే మహానరకమువలె నగాధమైయున్న కందకమును దిమ్మని దెసల నావరించిన యంధకారమును మహారాష్ట్రునకు భీతిఁ గలిగించినందున నాతఁడు గజగజ వడకఁ జొచ్చెను ఇంతలో భైరవసింగు వచ్చి వారింగలిసికొని దౌలతరావును దాదాపురగఁ బ్రాణములు లేనివానిఁగ నొనర్చెను. వాని భయమును జూచి నవ్వి భేతాళసింగు „ నీకంత భయమేల? నేను నిన్ను సలహాయడుగుటకుఁ దీసికొనివచ్చితింగాని నీకు హానిచేయుటకుఁగాదు అహల్యాబాయి సైన్యమునఁ గలకలము పుట్టినది వారు పరు

గెత్తుచున్నట్టున్నారు చూడు నా వ్రేలిచాయపై నిదానించి చూడు" అని రెండవ వ్రేలితో రాణిసైన్యమున్న చాయ నాతనికిఁ జూపెను దౌలతరావు నెత్తివెత్తి చూపులఁ జూచుచు వానితో "వారు నాకగపడుచున్నారు పారిపోవుచున్నది నిజమే" యని యుత్తర మిచ్చునంతలో భేతాళసింగు భైరవసింగును మెల్లన గోకెను తోడనే భైరవరుద్రుఁడగు భైరవసింగు ఖడ్గము దీసి యొక్కయేటున సకలకలహకారణుఁడగు దౌలతరావుశిరముఁ దెగవ్రేసెను మఱుమాటలేక మహారాష్ట్రుఁడు బురుజుపైఁ బడ భేతాళసింగు నిర్దయుఁడై గుభాలున నాతని నధోలోకమునకుఁ ద్రోచినట్లు కందకములోనికిం ద్రోచివైచి వెంటనే యాతని స్థూలకాయము దడదడ దొర్లుచుండ భేతాళసింగు మహానందమొందుచు వాని మొండెమును గనుల పండువుగఁ జూచుచు భైరవసింగుతో "మిత్రుఁడా లంచపు సొమ్ము మనమే యపహరించితిమని యీదురాత్ముఁడు రాణితోఁ జెప్పనని నాకనుమానము గల్గినది అందుచేత నింతపని చేసినాఁడను ఇంక మనము సేయఁదలచిన రెండవకార్యమున కరుగుదము రమ్ము" అని బురుజులుదిగి పాణిద్వారము దాటి కోట వెలువడిరి అప్పుడు సరిగా రెండుజాములయ్యె ఉభయసైన్యములయందుఁ గావలిఁ గాచు భటులు దక్క తక్కినవాండ్రందరు నిద్రాసక్తులైరి శత్రువులు పరాజితులై రేపోమాపో యింబపురమును విడిచి పోవుట కుద్యుక్తులయ్యున్న వార్తవిని యహల్యాబాయి సేనయంతయు నిద్రించుటయేగాక కావలిగాచుయోధులుగూడ నిద్రకులోఁబడి నడుమ నడుమ యులికిపడి చేతులతోఁ దుపాకులం బట్టుకొనుచు నొడలెఱుంగకుండిరి రాణిగుడారమునసున్న యమునయను నాసుందరి కుమారవియోగముచేతనో మఱియెందుచేతనో కునుకులేక పలుమాఱు తనగదిలోనుండి రాణిగదిలోని కరిగి యహల్యాను ముక్తభాయినిఁ బరీక్షించి చూచుచు గుడ్డతలుపులం దెఱచి యావల కరిగి యడుగుల చప్పుడగుచున్నదేమో యని యాలకింపుచు మనస్స్థిమితములేక తిరుగసాగెను ఒకమాఱామె వీధిలోనికిరా జమానుఖా నామె యాత్రమును గని యేదియో రాత్రి జరుగనున్నదని నిశ్చయించి నిద్రనువిడిచిపెట్టి భద్రముగనుండి యామెలక్షణముల మెలఁకువతోఁ బొడగనుచుండెను ఆమె నాలుగుసార్లు గుడారముయొక్క వెనుక గుమ్మము దాటి యావలనిల్చి యేరినింగానక గుడారమున కరిగి కొంతసే పచ్చట విశ్రమించి యైదవసారి గుమ్మముఁ జేరునప్పటికి నామె పాదముల నేమో తగుల్కొనెను సర్పము కాలిని జుట్టుకొన్నదేమోయని భయపడి తొందరతోఁ గాలువిదలింప మెల్లని యామె పాదమునకు దృఢమైన మనుష్యదేహము తగిలెను అదియేమని యామె వంగి చూడ నొక మనుష్యుఁడు మెల్లగా "నేను భయపడి కేకవేయకు యమునా! లోపలికిరా యని పలుక నామె తొట్రుపాటుతో వచ్చినావా వచ్చినావా లోపలికిరా యని

తాను మును ముందు గుడారముఁ బ్రవేశించెను. వెంటనే యామనుష్యుఁడును తనతో వచ్చిన తనమిత్రునిఁ గూడ లెమ్మని యిరువురును యమున యున్న స్థలముఁ జేరిరి "యమునా, భోగము దానవన్న నీవే భోగము దానవు నిన్నునే నుంచుకొన్నందుకు నాసొమ్ము నీవింతకాలము తిన్నందుకు నాకీరాణిగుడారముఁ బ్రవేశింప వీలు చేసితివి నడచివచ్చినచో మనుష్యవిగ్రహము నానవాలు పట్టుదురని నేనునువీఁడును నేలఁబండుకొని ద్రొల్లుద్రొల్లి వచ్చినాము. ఇంక మేము కృతకృత్యులమైనం జాలును. ఐనను దైవమేమి చేయునోయని యమున యొక్క నిద్దంపు చెక్కుటద్దముల ముద్దుపెట్టుకొని లోపలికిఁ దమ్ముఁదిసికొని పొమ్మని యామెనడుగ నామె మార్గప్రదర్శకురాలయి వారినహల్య యున్న గుడారమునకుఁ గొనిపోయెను. వీరిరువురు యమునాసమేతముగ లోనికరుగునప్పుడే మఱియొక పురుషుఁడు జోడుతుపాకులను మందుఁ గూరి సిద్ధముగ నుంచుకొని యహల్య నిద్రించు గుడారమునకు వెనుక ప్రక్కనున్న గుమ్మము చాటునఁ బొంచియుండెను. క్రొత్త పురుషులలోఁ బ్రథముఁడు గుడారమునంతయుఁ బరికించి యొకమెత్తనిపాన్పుపైశరీరమును మఱచిజస్వంతరాయనిందలంచుకొని పలువరించు ముక్తాయి ముఖాంబింబమునుగాంచి నేనుదిని జోలికిఁబోవను, ఇదిపసికూన, యనియామె నడచి రాజకార్యాంశములఁ బలువరించుచు నొకమూల బ్రహ్మచర్యవ్రతము జరుపుటఁ దెలియఁజేయు నొక చాపపై మ్రుదుబాహువు దలగడ చేసికొని పవ్వళించిన రాణిం జూచి "యీమెయే మనరాకొమారు హృదయ శల్యమగు నహల్య యీమెను గడతేర్చుడ"నని వెండిదీపస్తంభముపై వెలుగు దీపిక నుఫ్ఫునునూది యార్చి యహల్యకు దగ్గఱగ వచ్చి గుమ్మము నొద్దను కావలియుండుమని యొండొకనికి నానతిచ్చి మొదట ఖడ్గసాధనమున నామెను దునుముటకుఁ దలఁచి కత్తియెత్తెను. కాని యొక్క పోటున కాదు చావవచ్చు చావకపోవచ్చు చావకుండినచో నల్లరియగునుసుమీ యనియమున యయానుకూలముగఁ జెప్పిన యాలోచనముఁ బట్టి యాతఁడు తుపాకి నుపయోగింపఁ దలచెను. ఆపురుషుఁడు తుపాకి బారుచేసికొని రాణియొక్క కుడివైపున మోకాళ్లు నేలవాల్చి కూరుచుండ నాతనికి సరిగ నెదురుగ యమున, సమయమునకు రాణినికిదలకుండఁ బట్టుకొనఁదలచి రెండవప్రక్కను గూరుచుండెను. అంతట నాతఁడు తుపాకి రాణి గుండెలపై గురిపెట్టి యింతకంటె నెదురు కణతను గొట్టినచో మఱలమాటాడక పరలోకయాత్ర కామె వెంచేయునని యాగురిమార్చి కణతకుఁ బెట్టి జాగ్రత్తయని యమునతోఁ జెప్పెను. ఆవల రెండుతుపాకులఁ గైకొన్న పురుషుఁడు కూడ రాణిపై పేగుఱినిల్పి ఱెప్పవాల్చక చూడసాగెను. యమునయు మెల్లగ నహల్యబాయిపై చేతులు వైచెను. వైచినలత్తిణమే గభిల్లుమని తుపాకి నాదము వినఁబడెను. ఆధ్వనితో దద్దరిల్లి మహా

రాష్ట్ర సైన్యమంతయు నిద్రనుండి ప్రబోధింపఁబడి శివనానాతు కాజీ హోల్కారు మొదలగు సేనాపతులు సకల యోధులు కలవలపడి లేచి హాహాకారములతో రాణిమృతినొందినది రాణిమృతినొందినదని యఱచుచు నా మొగుడారమును చేరిరి సైనికులందరు నాక్రందనధ్వనులతో నానాముఖములనుండి రాణిగుడారముపై పరుగసాగిరి శివనానా కన్నీళ్లతోఁ గావలివాండ్రఁ దిట్టుచు కొట్టుచు మీయజాగ్రత్తచే నేడు రాణి చచ్చినదిరా దున్నపోతులారా వెధవలారా పశువులారా మిమ్మునందఱఁ జంపెదను చూడుఁడీ అయ్యోయని దుఃఖించుచు లోని కరిగి దీపము దెప్పించి యతి దీనముగఁ బడియున్న యొక యాడు శవమును గాంచి యో తల్లీయని యామెపైఁబడి యేడువ నారంభించెను

## ఇరువది మూఁడవ ప్రకరణము

అహల్యామృతినొందినవార్త శ్రవణానందకరముగ విని శాయాజీహోల్కారు తనకింక సింహాసనము దప్పక యీయఁబడునని యాసజనింపఁ దన గుర్రపుసను మఱచి ''యామెను నేను దహనము చేయవలెను సన్నిహితజ్ఞాతినుండఁగ మఱియొకఁడు వల్లకాదు నన్ను వదలండి'' యని భటులను వేగిరపెట్టెను కాని వారు జాగరూకులై శాయాజీనిగాని వామన భట్టునుగాని విడువరైరి శాంతమునకును నిదానమునకును నాలోచనమునకును ప్రసిద్ధికెక్కిన తుకాజీ హోల్కారు గుడారముఁ బ్రవేశించి యేడ్చుచున్న శివనానాను గనుంగొని వారించి యాస్థలముఁ బరికించి తనగంభీరస్వరముతో నిట్లనియెను ''రాణిగారు సురక్షితలై యున్నారు గడబెడవద్దు భయములేదు ఈయము నచ్చిపడియున్నది ఆమె ప్రక్కను రాజపుత్రుఁడొక్కఁడు కూడఁ బడిచచ్చినాఁడు ప్రాం . వీఁడు భేతాళసింగయియుండును నూరుకోండి'' అని పలుకఁ బ్రజలు నిశ్శబ్దముగనుండిరి శివనానా యామాటల నాలకించి యాశ్చర్యముతో నా రెండు శవములను నిదానించి చూచి కలవలపాటుచే లేచి జడిసిన బాలహరిణముపలె నోటమాటలేకయున్న కూతువీపుపైఁ జేయి వైచుకొని కూరుచున్న యహల్యనుగాంచి, అమ్మా మీరు బాగున్నారా యని పాదములపైఁబడి రోదనము చేసెను రాణి వానిపైఁ దనచల్లని యభయహస్తము వేసి, యీ ప్రాణదాన మెవఁడు చేసెనో కాని నే నీగడియవరకు బాగున్నాను. తనకుమారుని నీవు చెరలోఁ బెట్టితివను నొక వంకఁ బెట్టుకొని యీ యము నాదురాత్ముఁరాలు శత్రువులచే నంపఁబడినదో కాఁబోలు. నేనది యెఱుఁగక దానిమాటలు నమ్మి లోననుంచి నందులకు నాపని పట్టినది. వీఁడే నా భేతాళసింగు/ వీనినిఁ గూర్చి పలుమాఱు విన్నదానను వాని చావునకె వాఁడిందు వచ్చెనని పలికి తానును ముక్తయు నందఱి కగుపడుటకు గుడా

రము ముందఱవచ్చి నిలిచి వెలుతురువచ్చుటకు నెగళ్ళు వేయించిరి అప్పుడురాణిసజీవు రాలయియున్నదని తెలియుటచే శాయాజీక నిలువునఁ బ్రాణములుపోయెను అప్పు డు తుకాజీహోల్కారు రాణితో ,,అమ్మా! యీమహోపకారముఁ జేసినవాఁడు మన జమానుఖానై యుండవలయును ఏఁడీయాతఁడెక్కడున్నాఁడు రాఁడేమి' యని నలు దెసలుంజూచి యాతనింగానక యతఁడొకవేళ శత్రులచేతఁ జిక్కెనేమో యని భయ పడసాగెను అంతలో వారి యెదుటఁ జుట్టుజరీపట్టెలుగల యెఱ్ఱతలపాగఁజుట్టుకొని పచ్చపట్టుఱరాయి పన్నపట్టునిలువుటంగీ దొడుగుకొని తనయాకారము నెగళ్లవెలుతు రులో నొకవింతకాంతినొంది ముద్దులు మూటగట్టు నొక క్రొత్తవిగ్రహముని ల్చెను అందరాశ్చర్యనిమగ్నమానసులై వానిమొగముఁజూచి ,,ఏమిది శ్యామసుందరద త్తిట్లు వచ్చినాఁడేమి నీ వింతకాలము నెచటనున్నావోయి' యని యడిగిరి అహల్య వానిని దప్పకచూచి నీవిక్కడనేయున్నావాయని వానినిఁ బలుకరింప ,,అమ్మ! నిరపరాధి యగు శ్యామసుందరుఁడే జమానుఖాను సుమీ' యని యేలికకునమస్కరించెను ఆనంద బాష్పములతో వానినెత్తి రాణి నాయనా నీమూలమున శాయాజీ మాచేతఁబడి నాఁడు నీమూలముననే నేనునుగూతురును భేతాళసింగు పాలఁబడక బ్రతికితిమి నిరపరాధివగు నిన్ను నిర్హేతుకముగ నుఱిదీయింప యత్నించి తుదకు రాజ్యమునుండి తఱిమితిని నా యపరాధము నీవుసైరింపఁదగు సుమీ నాయనా' యని యాతని మంద మంద మృదూక్తులతో లాలించెను శ్యామసుందరుఁ డాపలుకులు కలర ,,అమ్మా నే నెప్పుడును రాజభక్తియందుఁ దీసిపోవని వాఁడనే నే నాదినముఱ నుఱిదీయఁబడు టకు సిద్ధముగనుండియు జస్వంతరావుగారి వసంతగృహమున వారందరు చేరుదురని మీకుత్తరము నంపితి అందువల్లనేకదా తమరు వారలంబట్టుకొనఁగలిగినారు' అనెను ఆమాటలువిని యచ్చటనున్న వారందఱు నాశ్చర్యమునొంది దత్తుయొక్కరాజభక్తిని వేనో ళ్ళఁబొగడసాగిరి ఇంతలో నీకోలాహలము నాలకించి రాధాకాంతరావు వినయసంభ్రమ ములతో నేలికయెదుటకు నరుగుదెంచి చేతులుజోడించి ,,అమ్మా' ఇదె రాధాకాం తుఁడ కనువిచ్చిచూచి రక్షింపుమీయన" దేవి వానిమొగముచూచి నీరఘునాథ రావును విడిచినావేమని యడిగెను తనపై రాజద్రోహమను హేయమైన నేరము స్థాపింపఁబడినందునఁ గొలుకులనుండి కన్నీరుగారఁ దనవృద్ధశరీరము వడఁకనతఁడిట్లని యెను. ,,లక్ష్మి గోమాజీరావునందు మీకు మిక్కిలి నమ్మకము కలదుగాని యాతఁడు ద్రోహి అతఁడు దమప్రతి కక్షులోఁజేరి కృతజ్ఞుఁడనగునన్ను మీసన్నిధినుండి సాగ నంపఁదలంచి రఘునాథరావు వచ్చుచున్నాఁడని మీతోఁజెప్పి నన్ను దూరదేశమున కంపెను నే నెంతకాలము కనిపెట్టుకొనియున్నను రగోబాకాని యాతని బలము

కాని నా మీదికి రాదయ్యెను తుదకాతఁడు దండెత్తిరా నిశ్చయించుకొనెదని నాకుఁ దెలిసినది " రాణి చెవుల కీమాటలు విన్పించినతోడనే విశేషాశ్చర్యమొంది రాధాకాంతునితో ,,సరే నీవుదత్తు నన్యాయముగ నదలిపెట్టుమని గోమాజీరావున కుత్తరము వ్రాసినావు తరువాత రఘునాథరాయుని పద్దనుండ నీకు వచ్చిన యుత్తరముఁగూడ మాకు దొరకినది అందుకేమి యుత్తరముఁ జెప్పెదవు అని ప్రశ్నవేసెను ఆప్రశ్నవిని యుత్తర మీయలేక యొక కొంతసేపు తత్తరపడి ఎట్టకేలకు నాతఁడు ,,నేను గోమాజి రావున కుత్తరము వ్రాసినానా! రఘునాథరావువద్దనుండి నాకుత్తరమువచ్చినదా? అమ్మా! మీ రంతవఱకు మోసపోయినారు నాపై నన్యాయముగ లగింపవలెనని గోమాజీరావు స్వయముగ వ్రాసియో మఱియొకరిచేత వ్రాయించియో యీజాబులు మీకుఁజూపినాఁడు జాబుఁజూడనిచ్చినచో వ్రాతయెవరిదో చెప్పెదను అని విన్నవించెను విన్నవింప రాణి యారహస్యము వినవలెనను నాతురముతోఁ దనకుఁ జిక్కిన గోమాజీరావు సంబంధములగు రెండుత్తరములును రాధాకాంతునిచేతి కిచ్చెను ఆయుత్తరములఁ జదువుకొని రాధాకాంతరావు దన యేలికతో తల్లీ యీవ్రాలి వామనభట్టుది వానిచేత వ్రాయించి గోమాజి మిమ్ము మోసపుచ్చినాఁడు వామనభట్టువల్ల కొన్ని రహస్యములు బయలకువచ్చునని పలికెను తమచేతఁ జిక్కియున్న వామనభట్టును రప్పించి రాణి వెంటనే యాయుత్తరములఁజూపి యది యెవరివ్రాతయని యడుగ నతఁడుగద్గదస్వరుఁడై యీవ్రాత దనదని యొప్పుకొనెను అంతట శ్యామసుందరదత్తు భట్టుదొడుగుకొన్న యంగరకా జేబులు వెదకి యందుండు మఱియొక జాబును దీసి రాణికిచ్చెను వింత తరువాత వింతబయలు దేఱుటచే రాణికోపము నాపుకొని నవ్వుచు నాయుత్తరమును నీక్రింది విధమునఁ జదువసాగెను ,,గోమాజిరావు భేతాళసింగునకు వ్రాయునదేమన మీకునింబపుర కోటస్వాధీనమగునట్లు నేనుసకలసహాయములును జేసియుండ నాకీవలసిన సొమ్మునిచ్చుట మీ కింతకష్టముగనున్నది మీరు వచ్చునప్పటికి మహాధీరుఁడైన రాధాకాంతుని, మంచియుపాయముచే, దూరదేశమునకంపితిని ఆవిశ్వాసమైన మీకులేదు ఈయుత్తరమందిన తక్షణము నా సొమ్ము నాకంపుము అని రాణిచదివినయాలేఖనువిని తుకాజీ శివనానామొదలగువారు, దత్తు, రాధాకాంతుఁడు, నోరెత్తలేక కొత్వాలుచేసిన ద్రోహమునకు సిగ్గుపడి మిన్నకుండిరి రాణి వారంజూచి నే నింతకాలమునుం గ్రూరభుజంగములమధ్యఁ గాపురముచేసితిని ఇట్టిదుర్మార్గులుండ దేశమునకెట్లు క్షేమముగల్గును రాజపుత్రులు నింబపురిపై వానిమాటలునమ్మి వచ్చినారు ఈభేతాళసింగు నాప్రాణములు దీయఁదలచుటలోఁగూడ గోమాజీయొక్క యాలోచనయుండవచ్చును సుమీ యనెను అనవుడు వామనభట్టు మెల్లగ

"అమ్మా! గోపాజీరావుగారు ఏకాంతరామను పేరుపెట్టి భేతాళసింగును వెంటఁబెట్టుకొని గుట్టులన్నియుఁ జెప్పినారు. నేను కడుబీదవాఁడనై తినుటకన్నము లేక యీతఁడు చెప్పినపనిచేసి పొట్టపోసికొనుచుంటిని గాని నే నేలినవారిమీఁద గత్తిఁబూనుటకు వీరిలోఁ జేరలేదు. తమ పాదరక్షలు మోయుటకైన తగనిబీద బ్రాహ్మణుఁడను నేనుతను పైగత్తిగట్టుట కెంతవాఁడను? నన్ను క్షమియింపుము తల్లీ" యని వేడుకొనెను. ఇది యగు నప్పటికి జాముకోడికూసెను. రాణి నిద్రాభారముచే నలసి యందరకును సెలవిచ్చి ముక్తతోఁగూడఁ దాను నిద్రింపనరిగెను. చిరకాలమునకైన పరస్పర సమాగమమునకు రాధాకాంతుఁడును శ్యామసుందరదత్తును నానందభరితాంతరంగులై నిద్రపోవక తమ కష్టములు చెప్పుకొని యామిగిలినరాత్రికాలముం గడిపిరి. ఆరాత్రి భైరవసింగు దప్పించుకొని పాఱిపోయికోటఁజేరి భేతాళసింగుయొక్క దుర్మరణవార్త రాణావారికి విన్నవించెను. రాణావారావార్తవిని భేతాళసింగుతోఁ దనయాసయుఁ దుదముట్టినదని యెఱింగి ప్రాణములతో నెంబపురము విడిచి, యుదయపురము ప్రవేశించుట యుక్తమని యెంచి మఱునాఁడు గాత్రి భేరీఢక్కాది ధ్వనులుగట్టిపెట్టించి టెక్కెములుచుట్టించి చడిచప్పుడులేకుండ శాంతిశేషమైన సేనతోఁ గోటవదలి పాఱిపోయెను. అర్ధరాత్రి శూరశిఖామణులగు రాజపుత్రులుచేసిన తెగువ నుదయమున నహల్యావిని సంతసించి రణదుందుభి నాదములు దనవిజయవార్తలఁజాట, నున్నతధ్వజములు దనయౌన్నత్యముం దెలుప, రత్నాకరము చందమున మహాసైన్యసమేతమగు సేనలతో నుభయపార్శ్వముల ముఖ్య సేనాధిపతులు గొల్వఁగ, నహల్యనింబపురికోటఁ బ్రవేశించెను. అట మహాపురమున నానందబాయి యొకనాఁడుదయమున నింటఁబ్రాంచి పనిచేసికొనుచుండఁగ నుసుపాకసాగినతె గుఱ్ఱములో నొక పల్లకదిగెను. ఆసమయమునఁ బల్లకి యొక్కవచ్చువారెవ్వరని సంశయముకలిగి యానందబాయి వత్తుకొనివచ్చి చూచునప్పటికి మెల్లగఁ బల్లకిఁదిగి యొకవిలాసవతి యానందకెదురుగవచ్చి యామెను గౌఁగిలించుకొనెను. ఆనంద యామెరాక కద్భుతమంది "కమలా! నీవు బాగున్నావా? నిన్ను చూచి చాలకాలమయినది. నీవు మృతినొందితివని లోకులు చెప్పుకొన్నారు. మాదత్తును రాణి రాష్ట్రమున డి వెళ్లఁగొట్టినది. వాఁడేమైనాఁడో నేనెఱుఁగనమ్మా" యనికంటఁబడిఁబెట్టుకొనెను. శ్యామసుందర దత్తుకు భయములేదని కమల యామెనూరార్చి మా యబ్బి మార్గాయాసముచే డస్సినాఁడు వానికిఁ గొంచెమన్నము పెట్టఁగలవాయనుచు నడుగ నానందయానందమున వాని కన్నముఁబెట్టెను. బాజీరావు భోజనముసేయుచుండఁగ కమలయు నానందయు నిట్లుమాటాడిరి.

ఆనంద—ఈతమ్ముఁడు నిన్నెచటఁగలసికొన్నాఁడు? నీ వెందుండివచ్చినావు?

కమల — నా నిమిత్తము మాయమ్మ మాతమ్ముని టకుఁబంప వాఁడదృష్టహీనుఁడై భిల్లులచేతఁబడి రెండుసారులు చావుదప్పించుకొని యిట్టులుండఁగ నేను రాణిదగ్గర సీతయను వేషముతో దాసిగనుండి దైవయోగమున భిల్లులచేతఁబడితిని

ఆనం — అయ్యో! ఆదుర్మార్గులచేతనుండి యెట్లు తప్పించుకొన్నావు

కమల — అక్కడ శాయాజీ హొల్కారను నామధేయుఁ డొకఁడు నన్నుఁ బెండ్లియాడవలయునని యత్నింప మేము వానిని మోసముచేసి యిట వచ్చినాము బాజీరావు నాతమ్ముఁడు గాఁడనుకొని యాదురాత్ముఁడు దనకొరకు నన్నుఁగూర్చి వానిద్వారా ప్రయత్నించి నన్నుఁ దనకు సమకూర్చిన పక్షమున మాతమ్ముని చెర విడిపించునట్లు వాగ్దానముచేసెను నేనుమగవేషము వేసికొని రాత్రి శాయాజీని దర్శించినట్లు నిర్ణయింపఁ బడినందున నేను మగవానిలాగు లాగుఁ దొడుగుకొని యుంటిని అప్పుడు మూర్ఖుఁడగు శాయాజీ ముందుగ నాతమ్ముని చెర విడిపింపఁదలఁచి పల్లకిఁ దెప్పింప నేనా పల్లకిం గూరుచుంటిని మగవేషముతో నుండు నాకును నాతమ్మునకును భేద మేర్పరచుట కష్టమైనందున నాతమ్ముఁడే పోవుచున్నాఁడనుకొని యామందుఁడు నన్ను విడిచిపుచ్చెను తరువాత మాతమ్ముఁడే వానియొద్ద కరిగి వాని నొక్క పోటుపొడిచి యాస్థలముఁ బాసి ముందు పయనముసేయు నన్నుఁ గలిసికొనెను వింటివా మాయవస్థ నాటి నీయుపాయ ప్రకారముగ నేటివరకును నేను వర్తించుటచే నాకు మానహాని వాటిల్లలేదు

ఇట్లు వారు పరస్పర ప్రేమచేఁ గష్టసుఖములఁ జెప్పుకొనుచు నా దినమును గడపిరి కమల యచ్చటఁ గొన్ని దినములుండెను

## ఇరువదినాల్గవ ప్రకరణము

వామనభట్టు రాణి శిబిరమునఁ జిక్కినాఁడను వార్తవినినతోడనె గోమాజీరావు తనకుట్రకు దాఁగ నేరదని తెలిసి దారాపుత్రాదుల విడిచి యుద్యోగము మానుకొని నాఁడర్ధరాత్రియందు నిందూరనగరముఁ బాసి పలాయనుఁ డయ్యెను ఎక్కడి కరిగి నాఁడో వాని సేవకులుగాని దారాపుత్రాదులుగాని యెఱుఁగరు గోమాజీయధికమయిన యాశయు స్వల్పమయిన ధైర్యముఁగల పిఱికి మహారాష్ట్రుఁడగుట నతఁడు తన చర్యల భరింప నేరక దేశముల పాలయ్యెను జస్వంతరావు భిల్లులనందఱ నాశముచేసి కృతకృత్యుఁడయ్యె గండాభిల్లు దొరకమి నిండారు సంతోష మొందక కొండలు గుహలు నడవులు వాగులు సంచరింప సాగెను దేశమును గొల్లఁ గొన్న భిల్లులును శాయాజీ

తోఁ జేరిన భిల్లులును దాదాపుగ హతులగుటచే నితర భిల్లులు భయకంపితులై దోపుడును తలంపువిడిచి వ్యవసాయములు చేసికొనుటయు బిచ్చమెత్తుకొనుటయు నారంభించిరి కొందరు దొంగతనములు మొదలగు హానికరమైన మారువేషములతో జనులయొద్ద సేవకులుగాఁ బ్రవేశించి పొట్టఁబోసికొన సాగిరి అందుచే గండాభిల్లు చిక్కుటయు నసాధ్యమని జస్వంతిరావు నిరాశ నొంది తుదకట్లే రాణికుత్తరము వ్రాయ వానినింకట్టి యప్పగించినంగాని ముక్తబాయి నిచ్చుటలేదని రాణి వానికుత్తరమంపెను అదియుగాక ఈశ్రమ యంతయు వ్యర్థమైనదని గంగాధరుఁడు మఱలఁ బ్రయత్నము చేయుచు గోసాయీలను బయిరాగులను రప్పించి యడవులయందుఁ దిరుగు నెడ వారికి గండాభిల్లుఁ డెందైనఁ గానంబడునేమోయని యరయుచు నానాశ్రమలొందుచుండెను అంతఁ డొకనాఁడు మహానగరమునకరుగ నచ్చటి జనులెల్ల నొక మహాత్ముఁడు గ్రామమునకు వచ్చినాఁడనియు నాతఁడు గండాసంగతి నెఱిగింప వచ్చుననియుఁ దెలిపిరి "ఇట్టి మహాత్ముల నెందఱినో నేనిదివఱకుఁ జూచినాఁడను ఎవరును నాకువాని జాడఁ దెల్పరైరి" యని తిరస్కార భావముగఁ బల్కి తన బసకుం జనియెను అయినను మనసులో నొక మధ్యాహ్న మొకసారి యా మహాత్ముఁడుండు జయదేవుని మఠమున కరిగి యాతని దర్శించెనుగాని యాతఁడు మౌన ముద్రాధారణమొనర్చిన బయిరాగి యగుటచే నాతని నాతఁడు పలుకరింపకయే యింటికివచ్చెను రాత్రి జపము ముగిసిన తరువాత నా బయిరాగి వచ్చియు రాని హిందీకీర్తనలు పాడుచు శ్రీకృష్ణుని యమునావిహారములు రాధావిలాసములు స్తవమొనర్చు యానందించుచుండ నచ్చటికి మఱియొక బైరాగివచ్చి తనసంచి నందుదింపుకొని మొదటివానినడిగి గంజాయి కొంచెము గ్రహించి పీల్చి మహారాష్ట్రభాషతో వల్లభాచార్య స్తవాదులగు పాటలు పాడసాగెను ఇట్టిరువురు వినుగువచ్చు పదును భగవద్ధ్యానముచేసి తమ తమ కంబళములపైఁ దాము పవ్వళించిన తఱి రెండవ బయిరాగి మొదటి వానినిఁ బలుకరింప మొదలుపెట్టె నాతఁడు మౌనభంగ మగునని కొంచెము పలుకక నిష్టపడక పదిప్రశ్నలకొక్క యుత్తరముఁ జెప్పుచు నిద్రింపఁజొచ్చెను రెండవవాఁడు విధవిరామములేక ప్రశ్నలడుగఁ జొచ్చుటచే నాతఁడు విసిగివేచికూరుచుండి ఓయన్ని ప్రశ్నలడుగఁ దలచితివో యన్నియు నడుగుమని కోపముతోఁబలికెను అప్పుడువారి కట్లు సంభాషణ జరిగెను

రెండ—తమరు నామీఁద కోపపడవద్దు గోసాయీలము మనలో మనముచేఁ దోడువాదోడుగనుండకుండిన నన్నెవ్వరుందురు నేను క్రొత్తగ నీ యాశ్రమమును స్వీకరించితిని మీరు మహాత్ములు నాకుపదేశమ్మొదనంజేయుఁడు

మొద—నాకుమంత్రములురావు రామరామయనుమాటదప్ప నాకేమియు రాదు

# హిందూస్త్రీలస్థితి.

ఏజాతివారియందైనను స్త్రీలస్థితిననుసరించియే, వారినాగరికమును ఉండును దీనినిగురించి గ్లాడుస్టనుదొర* వారిట్లు చెప్పియున్నారు "మనస్వభావమునుగూర్చి యేజాతివారికైనను ఎట్టియభిప్రాయము గలుగునదియు మనము తెలిసికొనఁగోరితిమా మన స్త్రీలస్థితినే యందుకుఁ బ్రధానముగా గ్రహింపవచ్చును బలాత్కారము దుర్జనకృత్యముగాన నట్టియాచారమునకు మనుష్యుఁడెంత లోఁబడియుండునో క్రూరస్వభావమునకంత సమీపించుచుండును ఇట్టి క్రూరనియమములులేక తానెంత స్వేచ్ఛగానుండునో యంత దేవత్వమును బొందును" ఈప్రమాణమును బట్టిచూచితిమా ఐరోపాఖండములోని గ్రీసు రోము దేశములు పూర్వకాలమునందా దేశములయుచ్ఛస్థితియందుండిన సంస్కారమునకంటెఁ దక్కువ కాని నాగరికమును మనహిందూదేశము ప్రాచీనదినములందుండియే యున్నది గ్రీసుదేశమునందు స్వదేశాభిమానమే ప్రధానవిధిగా నెన్నఁబడి సంసారబంధములచే నది తగ్గకుండుటకై నీచపుఁబనులన్నియు స్త్రీలకు విధింపఁబడెను పురజనాభివృద్ధికి స్త్రీలు ముఖ్యరాండ్రుగావుననే గ్రీకులు తప్పనికీడుగానెంచి వారిపట్ల సహనము వహించిరి గ్రీసుదేశమునందాఁడువారు గృహముయొక్క ప్రత్యేకస్థలమునందే కాంతముగా నుంచఁబడిరి క్రొత్తవారు వచ్చినయెడల వారికి భోజనసమయమందైనను గనుపడరాదు విద్యయనిచెప్పఁదగిన చదువేదియు వారికిలేదు స్త్రీధర్మము, పురుషులకు సహాయురాండ్రుగా నుండుటకూడ కాదు వారినీచభావమును బూర్తిచేయుటకో యనునట్లు ఆదేశమునందుఁ బురుషులకామాదులనుదీర్చుటకును వారితోటికఁగడపుటకును వేఱొకజాతివనితలుగలరు ఇప్పుడు నాగరికతగలదేశములందచ్చటనైన అట్టి తెగలోని స్త్రీలకుఁగల స్థితికన్న గౌరవముగల స్థితి వారికుండెను ఇదియంతయు గ్రీసు ప్రాచీననాగరికత ఇఁక రోముదేశమునందైనను సుందరులగు యింతికంటె నేవిధముచేతను మంచిదిగానుండలేదు అప్పటియిల్లాండ్రు విమలమైన సత్స్వభావము కలవారని ప్రసిద్ధిఁజెందిరి అయినను వివాహితస్త్రీలకు నాదేశధర్మములను బట్టి స్వకీయమైన యధికారమేదియులేదు భర్తకు స్త్రీ బానిసవలె లోఁబడియుండవలెను ఇఁక మనప్రాచీన హిందూదేశమునుగూర్చి వర్ణింతము

---

* ఈయన పలుమాఱులు శ్రీమహారాణిగారికి ప్రధానమంత్రిగా నుండి కడుఁ బ్రసిద్ధిఁజెందిన యింగ్లీషుదొర

హిందూదేశముయొక్క పూర్వస్థితిం దెలిసికొనుట కాధారములు వేదములు అవి యిప్పటికి సుమారు 4000—3000 సంవత్సరముల మధ్య పుట్టినట్లిప్పటిపండితులచేత నిశ్చయింపఁబడినది అప్పటిసుందరులు మూఢురాండ్రుగారు ఏకాంతవాసినులును గారు పురుషులభ్యసించు విద్యలే వారికని నేర్పఁబడెను పురుషులవలెఁ గ్రతువులఁ జేయుటకును వేదమంత్రములఁజేయుటకును సమర్థురాండ్రగు నంతటి విద్య నభ్యసించిన కాంత లనేకలు కనఁబడుచున్నారు స్త్రీలకంతఃపురమునం దేకాంతవాసత్వము వేదములం దెచ్చటను విధింపఁబడలేదు క్రతువులందు భార్యలుభర్తలతోఁగూడ మెలఁగుచుండిరి ,,ఓదేవతలారా! కలసియాహుతిని సిద్ధముచేసి సోమరసమును బవిత్రము చేసి దానినిబాలతోఁ గలుపు నీదంపతులకు సుభోజనము లభింపఁగా వారుకలసి యీ క్రతువునకు నిత్తురుగాక! క్రతువులఁజేయ నాసక్తగలదంపతుల పూజలకు దేవతలాశపడుదురు , అనియిట్లు ఋగ్వేదమునందున్నది అప్పుడు ప్రతిబాలికకును వివాహముకావలెనన్న మతనియమముకూడ లేదు అవివాహితలయియే, జననీజనకుల యిండ్లయందుండి వారిసొత్తునందొక భాగమును సయితము పొందిన వనితలకథలుకొన్ని గలవు తనకూతులకుఁ దగినవరుల నేర్పరచువాఁడు తండ్రియే యైనను వరనిర్ధారణమందు బాలికలకుఁగొంత యధికారము లేకపోలేదు ఇందుకుదాహరణముగా ఋగ్వేదము పదవమండలమునం దిట్లు చెప్పఁబడినది——,,స్త్రీల నేకులు ధనమునుబట్టి తమనాథు నిర్ణయముఁ జేసికొను చున్నారు కాని, సౌమ్యస్వభావము గల సుందరాంగులు భర్తనువరించుటయందు భాగ్యమును ప్రధానముగాఁ జూడక తమ ప్రేమకాస్పదమైన వానినే వరియింతురు —ఇదితరువాతి కాలములందు వాడుకకు వచ్చిన స్వయంవరమునకు సూచనగా నుండెను హానికరమైన బాల్యవివాహములప్పుడు లేనేలేవు ఈసంగతి ఋగ్వేదమునందలి యీక్రింది మాటలచేఁ దెలియ వచ్చుచున్నది ,,ఓవిశ్వావసూ! (వివాహదేవత) ఈబాలిక వివాహితయైనందున నిక్కడినుండి లేచి పరిణయార్థమయిన వయస్సుచనలు గలిగినట్టియుఁ దండ్రియింటనే యున్నట్టియు మఱియొకకన్యకకడకుఁ బొమ్ము ఆమెనీపాలగును ఓవిశ్వావసూ! ఇక్కడినుండిలేచి యౌవనాంగములు బాగుగా వికసించినవో యట్టికన్యకకడకుఁబోయి యామెను భార్యగాఁజేసి నాథునితోఁ గూర్పుము వివాహమంత్రములు గూడ వయసు వచ్చినవార పెండ్లికే సరిపడి యున్నవి పెండ్లికూతురు భర్తయింటికిఁబోయి గొంపోన్నత పదవి ననుభవించును దీనిని జూపుటకై ఋగ్వేదమునందుండి యీక్రింది సంగతుల నిందుత్తి వ్రాయుచున్నాను

,,ఓకన్యకా! ఎత్వమునకును ధర్మమునకును స్థానమైనస్థలమునందు

నిన్ను నీభర్తతోఁగూడ నట్లు చేయుచున్నాము మేమీకాంతను బితృగృహమువిడిచి భర్తృగృహమును జెందునట్లు చేయుచున్నాము మేమామె నచ్చట స్థాపించుచున్నాము ఓ యింద్రా! ఆమె భాగ్యము గలదై తగిన పుత్రులఁబడయుఁగాక

నీభర్తయింటికిఁ బోయి యచ్చట గృహస్వామినివై యుండుము అందఱకును యజమానురాలవై నీయధికార మింటియందంగడియందును జెల్లింపుము. నీకు సంతానము కలుగుఁగాక నీవిచ్చటి యాహ్లాదములఁ గొనుము జాగ్రత్తతో నీ గృహకృత్యములను నెరవేర్చుకొనుము నిభర్తతో నీవేక దేహినివై నీ దైన యీయింటి యందధికారము నీవార్ధకము దనుక చెల్లింపుము ఓవధూవరులారా. మీరెడఁబాటులేక యిచ్చటఁగూడి యుండుఁడు ఇష్టమృష్టాన్నములనుభవింపుఁడు మీ పుత్రపౌత్రవర్గముయొక్క కూటమునందుండి సౌఖ్యమనుభవింపుము మీయింటియందు వసియింపుఁడు ఓసుందరి! శుభసూచకములతో నీభర్తృగృహమును బ్రవేశింపుము నీదాసీదాసజనమునకును బశువులకును మేలుచేయుము కోపదృష్టిలేక యుండి నీమగనిసౌఖ్యమునకై యుపచారములుచేయు చుండుము నీసౌందర్యము ప్రకాశించుఁగాక నీవుదైవభక్తకలిగి వీరమాతవుకమ్ము నీకత్తమామలు స్వాధీనులగుదురు గాక! ఆడుబిడ్డలకును మఱఁదులకును గౌరవనీయురాలవగుదువు గాక ''

హిందూదేశములో వేదకాలమునందనేకభర్తృకతలేనేలేదు అనేకపత్నీకత లేకపోలేదుగాని రాజులయందును ధనికులయిన గొప్పవారియందును మాత్రమున్నట్లగు పడుచున్నది ఈయాచారము పూర్వకాలమున్న జాతులయందు నున్నది. ఇందుకుఁ దార్కాణముగా, సలగ్జాండరు, వానివంశజులగు లిసిమేకసు సెల్యూకసు, టోలెమి, డెమిట్రియసు, పిరహసు మొదలగువారి ననేకభార్యలుగలవారినిగాఁ జెప్పవచ్చును. దురదృష్టవశమున భర్తృహీనయైన స్త్రీని భర్తచితియందుంచి దహించువాడుకగాని, బ్రతికియున్నంతకాలము వైధవ్యదుఃఖము ననుభవింపఁ జేయునాచారముగాని లేనేలేదు సహగమనము వారెఱుఁగరు విధవలకుఁ బునర్వివాహమంగీకరించిరి

శ్లో॥ “ఉదీర్ష్వ నార్యభిజీవలోకమితాసు మేతముప శేష ఏహి।
హస్తగ్రాభస్య దిధిషో స్త్వమేతత్పత్యుర్జనిత్వమభిసంబభూవ”॥

ఓనారీ! చచ్చియున్న యీపెనిమిటి యొద్దపడియున్నావు (బ్రతికియున్నవారిని జూచి లేచిరా, పాణిగ్రాహకుఁడును వితంతువును వివాహమాడ నిచ్ఛగలవాఁడును నగు భర్తకు భార్యవుకమ్ము అని యీశ్రుత్యర్థము ఈశ్రుతియజుర్వేదతైత్తిరీయారణ్యకములోని యాఱవప్రపాఠకమునందలి పదునాలుగవయనువాకము

ఈవిషయమునుగూర్చి, సంస్కృతపండితులగు రాజేంద్రలాలమైత్రిగారిట్లు వ్రాసి

యున్నారు. "వేదకాలమునందు స్త్రీపునర్వివాహము దేశాచారమని రూఢిపరుచుట కనేక నిదర్శనములును గారణములును గలవు. సంస్కృతభాషయందు బూర్వమునుండియు దిధిషు (విధవను బెండ్లియాడినవాఁడు), పౌనర్భవ (విధవను బెండ్లియాడినవాని కొడుకు), పరపూర్వ (పునర్వివాహము చేసికొన్న స్త్రీ) మొదలగు పదములుండుటయే దీనినిస్థిరపరుచుచున్నది. తరువాతిదశయందు—అనఁగా బ్రాహ్మణములు, ఉపనిషత్తులు, రామాయణము, మహాభారతము వీనికాలమునందు—సయితము స్త్రీలు సంఘమునందు మనుష్యులవలెనే గౌరవింపఁబడుచుండిరి. గృహకృత్యనిర్వహణము బాగుగ వారికి నేర్పఁబడెను. ఇంతేకాక తత్త్వశాస్త్రముల విద్యలన్ని వారభ్యసించుచుండిరి. ఘనతఁజెందిన మైత్రేయి యనువిదుషకని నామెభర్తకును జరిగిన సంభాషణము కడుఁబ్రసిద్ధము. యాజ్ఞవల్క్యుఁడు మెకును నిమెసవతికిని భాగించియిచ్చెదనన్న ధనమునీమె లక్ష్యము చేయక మోక్షమార్గోపదేశమునకై ఆయనను బ్రార్థించెను. మఱియొక స్త్రీ, జనకుని కొలువుకూటమునందు యాజ్ఞవల్క్యుని రెండు ప్రశ్నములడుగునంతటి ధైర్యములును విద్యావతియునైయుండెను. ఆమహర్షియు వానికప్పుడుత్తరమిచ్చెను. స్వయంవరన్యాయముచే, రాజపుత్త్రికలు తమభర్తలనేరికొనుచున్నను దక్కినజాతి స్త్రీలకును భర్తృనిర్ధారణసమయమునందుఁ గొంత స్వాతంత్ర్యముండెను" హిందూదేశపూర్వనాగరికచరిత్రకారుఁడొకఁడిట్లు వ్రాసియున్నాఁడు.

"పూర్వకాలమందు హిందూసుందరు లందఱు భర్తలకు బుద్ధివైశద్యమందు సహచారిణులుగాను జీవయాత్రయందు మిత్రురాండ్రును స్నేహసహాయురాండ్రును గాను గృహకృత్య నిర్వహణమునందు సమభాగినులుగాను గృహసౌఖ్యమున కాధారభూతురాండ్రుగాను దమ భర్తలచే నెన్నఁబడి గౌరవింపఁబడిరి. మైత్రేయి గార్గి మొదలగు వారివలె దుర్గ్రాహ్యములయిన విద్యల నభ్యసించినవారు గరుదు. అయినను గృహకృత్యములను బాగుగ నెరవేర్చుట లోకసామాన్యమైన యంశములనెల్ల నెఱింగియే యుండిరి. తమసంచారమునకుఁగాని కృత్యములకుఁగాని యక్రమమైనయాటంకము లేక తమ సంఘమునందు స్వేచ్ఛగా సంచరించుచు, నుత్సవాదులకుఁబోవుచు, మతక్రియలఁజేయుచు, సఖుల యిండ్లకుఁబోవుచు వచ్చిన సఖులకు దానమిచ్చుచునుండిరి. ఇంతేకాక సొత్తునకును దాయమునకును అర్హత కలిగియుండిరి. ఇదియె వారిపట్లఁగల గౌరవమును దెలుపుచున్నది."

పూర్వకాలమునుండియు మన స్త్రీలు పతిభక్తి, పుత్రవాత్సల్యము, గృహకృత్యనిర్వహణశ్రద్ధ, వినయము, మొదలగు గృహధర్మములకుఁ బేరొందియే యున్నారు

ద్విపద॥ "పతులు గావించిన భాగ్యంబులైన
ఎతులనురక్షింపు సమ్మదంబెసఁగ
నాపాలివిభుఁడన్న నాదైవమన్న
నాపుణ్యగతియన్న నరనాథ నీవ
ఘనతప స్స్వర్గభోగము లనేకంబు
లనుభవింపుటకంటె నతిభక్తితోడ
నిచ్చలు మనమార నీపదాంబుజను
లచ్చుగాఁగొలుచుట యదె నాకుసుఖము
నృపవర్య నీవున్న నిఘరాటవులు
నుపవనంబులు నాకు నూహించిచూడ
జగతీశ విను విష్ణుసముఁడైననీవు
జగదేక విక్రమశాలివై పరఁగఁ
గరమొప్పనీరక్ష గలిగిననన్ను
సురరాజు ఆలయెత్తి చూడంగ వెఱచు
నారచీరలుగట్టి నడచి నీతోడ
నారంగఁ జనుదెంచ నటనివు మాప
నమరంగఁ జూచెద నదులు నదులు
కమలాకరంబులు కడువేడ్కతోడఁ
బాయ నిన్నెందును బరఁగనూటైన
వేయైనఁగానిమ్ము విపినంబులందు
నన్నుఁ దోడ్కొనిపొమ్ము నరనాథయనిన"

రంగనాథ రామాయణము

ఇట్లు సీత తాను వెంబడించుటకు సమ్మతింపుమని రాముని తో విన్నవించెను ఇది యే యప్పుడు స్త్రీలకుఁ బలపట్ల భక్తి ప్రేమము లెట్లుండెనో స్పష్టముగాఁ దెలుపుచున్నది ఇఁక రామరాము మనుస్మృతి పుట్టినకాలమునందు నిరు హీనదశ నొందినట్లు స్పష్టముగాఁ గనుపడుచున్నది ఆచారములును నాతిములునుశలశశవృద్ధిఁ జెందినట్టియు మతాచార్యుల యధికారము దృఢముగా స్థాపింపఁబడినట్టియు, కాలమిదియె ఈ కాలమునందుఁ బుత్రునిఁ బడయుట పురుషునికి మతిసంబంధమైన విధిగా నెన్నఁ బడెను కనుక నే తనయులులేని విధవ, ముఖ్యముగా మఱఁది తరువాతఁ గ్రమముగా సపిండుఁడు, సగోత్రుఁడు, తుదకు సజాతీయుఁడు వీరిలో నేరివల్లనైన నద్దఱకంటె

నెక్కువగాని పుత్రులను గనవచ్చునని విధింపఁబడెను. అనేకులకు సంతానము గనుటకుఁ గూఁతును నియమించుటయు, నితరుల పుత్రులను దత్త స్వీకారము చేసికొనుటయు నాచారమునకు వచ్చెను. ప్రథమభార్యకుఁ బుత్రులు లేనప్పుడును, మఱి ధర్మములందామె తనతోఁ గూడ నుండుటకు సమర్థురాలు కానప్పుడును బురుషుఁడనేకభార్యలను వివాహము కావచ్చును. అప్పుడు నయితేము ప్రథమభార్యను బోషించు భారము తనిదే. భార్యను వదలివేసినవాఁడు ఆఱుమాసములదాఁక గాడిద చర్మము ధరించి యిండ్లకుఁ బోయి "భార్యను విడిచిపెట్టిన నాకు బిచ్చము పెట్టుము" అని యాచించుట ప్రాయశ్చిత్తమగుటచేత భార్యా పరిత్యాగము మహాఘముగా నెన్నఁబడినట్లు కనఁబడుచున్నది. పాతివ్రత్యము సర్వదా గౌరవింపఁబడెను. జారత్వమతి హేయమైన తప్పుగా నెన్నఁబడెను. ఆంగ్లేయ ప్రభుత్వమువారి పరిపాలనమందును శిక్షాస్మృతియందది నేరముగా నెన్నఁబడుట యొక విశేషము. అష్టవిధములని చెప్పఁబడు వివాహభేదములు నీకాలమునందే పుట్టెను. హానికరమైన యీ బాల్యవివాహములు అప్పుడు సాధారణములయి యుండెనుగాని యిప్పటివలె శాస్త్రవిధినిబట్టి యవశ్యాచరణీయములు కాలేదు. "రజస్వలయైన స్త్రీ మూఁడు సంవత్సరములు వేచియుండి తన జాతివారియందొక భర్తను గైకొనవచ్చును" అని వసిష్ఠుఁడు చెప్పియున్నాఁడు. మనువు విధవావివాహము నంగీకరింపలేదు. కాని, శాస్త్ర ధర్మపరాయణుల యిష్టమునకు వ్యతిరేకమయ్యును నప్పుడది పాటింపఁబడుచున్నట్లగపడుచున్నది. అక్షతయోనులయిన విధవా బాలికల పునర్వివాహమునకు నపుడాక్షేపము లేకుండెను. స్త్రీజాతియు, సందు ముఖ్యముగా సంతానవతులును ఎక్కువ సన్మానమును బొందిరి. "వర్ణభ్రంశమును గలిగించు తప్పు చేసినప్పుడు తండ్రిని వెలివేయవలెను. కుమారుఁడు చేసిన తప్పునకుఁ దల్లి జాతిభ్రష్టురాలు కాఁజాలదు. ఉపాధ్యాయునికంటె నాచార్యుఁడు పదిరెట్లు పూజ్యుఁడు, తండ్రి యాచార్యునికంటె నూఱురెట్లు, తల్లి తండ్రికంటె వేయిరెట్లు పూజ్యురాలు" అని వసిష్ఠుఁడు చెప్పియున్నాఁడు.

స్త్రీలను గుఱించి మనుస్మృతి ధర్మము లేకరీతిగా లేవు. అయినను గొన్నియిందు వ్రాయుటకుఁ దగియేయున్నవి.

శ్లో॥ పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా।
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః॥
యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః'

శుభముఁ గోరు తండ్రులును, సోదరులును, భర్తలును, మఱఁదులును, స్త్రీలను గౌ

సించి పూజింపవలెను ఎక్కడ స్త్రీలు గౌరవింపఁబడుదురో యక్కడ దేవతలు క్రీడింతురు ఎక్కడ గౌరవింపఁబడరో యక్కడ వారికర్మలు నిష్ఫలము లగును అని వీనియర్థము

ఇవి మనుస్మృతిలోఁ దృతీయాధ్యాయమందు 55, 56 శ్లోకములు

శ్లో॥ శోచంతి జామయో యత్ర వినశ్య త్యాశు తత్కులం
నశోచంతి యత్రైతా వర్ధతే తద్ధిసర్వదా.
జామయో యానిగేహాని శపంత్యప్రతిపూజితాః
తానికృత్యా హతానీవా వినశ్యంతి సమంతతః॥

స్త్రీలు దుఃఖించు సంసారము నశించును సంతోషించెనా, ఆసంశము సదా వృద్ధిఁ జెందును స్త్రీలకు గౌరవముచూపనిచే వారు శపించినయెడల నా సంసారములు మంత్ర హతములయినట్లు నిస్ఫలములగును అని వీనికర్థము ఇవి యచ్చటనే 57, 58 శ్లోకములు

శ్లో॥ అస్వతంత్రాః స్త్రియః కార్యా పురుషైః స్వైర్దివానిశమ్
* * * * *

పితారక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే
రక్షంతి స్థావిరే పుత్రా న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి

స్త్రీ లహోరాత్రములు పురుషులకు విధేయలై యుండవలెను బాల్యమందుఁ దండ్రియు యౌవనమందు భర్తయు ముసలితనమునఁ బుత్రులును వారిని రక్షింతురు స్త్రీలు స్వేచ్ఛగా నెన్నడు నుండరాదు అని గీని కర్థము ఇవి నవమాధ్యాయమున, 2, 3 శ్లోకములు

శ్లో॥ నాశ్నీయా ద్భార్యయా సార్ధం నైనామీక్షేత చాశ్నతీమ్
క్షువతీం జృంభమాణాం వా నచాసీనాం యథాసుఖమ్॥

చతుర్థాధ్యాయము శ్లో॥ 43

పురుషుఁడు భార్యతో భుజింపరాదు మఱియు నతి భుజించునపుడును తుమ్మునపుడును ఆవులించునపుడునుహాయిగాఁ గూర్చుండునపుడును భర్తయామెనుజూడరాదు

శ్లో॥ భార్యా పుత్రశ్చ దాసశ్చ శిష్యో భ్రాతా చ సోదరః
ప్రాప్తాపరాధా స్తాడ్యాః స్యూ రజ్జ్వా వేణుదళేనవా॥
పృష్ఠతస్తు శరీరస్య నోత్తమాంగే కథంచన
అతోన్యథాతు ప్రహరన్ ప్రాప్తః స్యా చ్చౌరకిల్బిషమ్॥

అధ్యాయము 8, శ్లో॥ 299 300

భార్య, పుత్రుఁడు, పరిచారకుఁడు, శిష్యుఁడు, తమ్ముఁడు, వీరు నేరము చేసినట్లయిన త్రాడు, బెత్తము వీనిచేతఁ గొట్టవలయును అదియు వీపుమీఁద మాత్రమే కొట్టవలెను శిరస్సుమీఁదఁ గొట్టరాదు మఱియెక్కడనైనఁ గొట్టువాఁడు చోరుని పాపమును బొందును.

శ్లో॥ విశీలః కామవృత్తో వా గుణైర్వా పరివర్జితః
ఉపచర్యః స్త్రియా సాధ్వ్యా సతతం దేవవత్పతిః
నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో నవ్రతం నాప్యుపోషితమ్
పతిం శుశ్రూషతే యేన తేన స్వర్గే మహీయతే।

అధ్యాయము 5, శ్లో॥ 154, 155

భర్త క్రూరుఁడైనను జారుఁడైనను దుర్గుణుఁడైనను సద్భార్య వానిని దైవమువలెఁ బూజింపవలెను స్త్రీలకుఁ బ్రత్యేకముగాఁ గ్రతువుగాని వ్రతముగాని యుపవాసముగాని పనిలేదు భర్తకు శుశ్రూష చేయుటచేతనే వారు స్వర్గమందు గౌరవమును బొందుచున్నారు

ఇట్లు క్రమముగా నిప్పటికి 1000 సం॥ పూర్వమునాఁటికి స్త్రీలు హీనదశ నొందుచు రాఁగా వారికి పురుషాధీనత సంపూర్ణమాయెను అప్పుడు వారికి స్వతంత్ర యత్నముగాని, స్వతంత్ర జీవనముగాని లేదు బాల్యవివాహములు శాస్త్రవిధులాయెను విధవా వివాహము నిషేధింపఁబడెను ఈ దేశముపై దండెత్తివచ్చిన సిథియనులను జూచి సహగమనము ను ఘోరమైన యాచారము నవలంబించిరి ఇతర జాతులవారికి శాస్త్రాధ్యయనము నొల్లని మతాచార్యులు స్త్రీలకుఁగూడ విద్యను నిషేధించిరి — నిశ్చయముగా నిది నారిష్టఁ దమ నిరంకుశాధికారముఁ బ్రసరింపఁ జేయుటకే యయియుండును దీనికిఁ దోడయి యీదేశమునకుఁ దురకలయేలుబడి వచ్చి స్త్రీలయధఃపతనమును బూర్తిచేసెను మహమ్మదీయుల వివాహ నిబంధనల్ల దృఢమయినవి కాకపోవుటయును, సౌందర్యవతులను వారు బలవంతముగాఁ గొనిపోయి చెరఁబెట్టుటయును మన యాఁడువారి యేకాంతవాసమునకుఁ గారణము లాయెను ఇంటి వెలుపలి ప్రజలతోడి సమావేశమువలన లభింపఁదగిన జ్ఞానమైనను వారికి లేకపోవుటచేత బుద్ధికుశలతలు పూర్ణముగా క్షీణించుటయే దీని ఫలము ఇట్లు మతాచార్యుల మోసముల వలనను మహమ్మదీయ ప్రభుత్వమువలనను వందలకొలఁది సంవత్సరములనుండి మనయాఁడువారిస్థితి క్షీణించి యిప్పటి దుర్దశకువచ్చినది గృహాభ్యంతర వాసమును మూఢత్వమును వారపాలైనవి మగవారితో దగ్గరబంధువులతోనైనను గలసి సంభాషించుటకు సామాన్య స్వాతంత్ర్యమైనను వారికలేదు శాస్త్రాభ్యాసముగాని భర్తలకు సహాయపడుటకైనను సంతానముయొక్క క్షేమాభివృద్ధికైనను వీరు ప్రవర్తించుట కావశ్యకమైనయుప

దేశముగాని పీరికంతకంటె లేదు కనుక నే వారు మూఢవిశ్వాసము ప్రబలఁగా వివేకము మాలిన యూహలకుఁ దావున్న హానికరములైన పూర్వాచారములపట్ల దృఢవ్రతముగలవారగుచున్నారు స్త్రీలవివాహితలై యుండరాదు పూర్వకాలమునందు లాభకారియైన స్వయంవరాధికారము నయితము వారికి లేదు ఉన్నను అతిబాల్యావస్థలో వివాహములు చేయఁబడుచుండుటవలన నాయధికారమును వారుపయోగింపఁదగిన యవకాశమును లేదు ఇట్లగుటచేత బాలికలకు భర్తయగుటకంటెఁ దండ్రిగాని తాతగానియగుటకుఁ దగియున్న ముసలివారికిఁ గూడ వారు పెండ్లి చేయఁబడుచున్నారు పురుషుఁడు తనయిష్టము వచ్చినంతమంది భార్యలను వరుసగా వివాహముకావచ్చును ఏకకాలమున నయిత మనేకభార్యలను నిరాతంకముగాఁ బెండ్లియాడవచ్చును దయార్ద్రహృదయులగు నీ దొరతనమువారు సహగమన మనుదురాచారమును మాన్పిరిగాని యంతకంటె నెక్కువకాలమునందుండి యున్న నిర్బంధవిధవాత్వమువలని కష్టములను మాన్పఁజాలరైరి హిందూవనిత భార్యయై స్వతస్సిద్ధమైన తప్పు దిద్దునట్టియు, సుదారమయినట్టియు నధికారమును పురుషునపయిఁ జెల్లించుటకు సమర్థురాలుగాక భర్తకు సహాయురాలుగా నుండుటకుమాఱుగా నొకభారమగుచున్నది తల్లిగానుండి తనపిల్లలను బలమైన యారోగ్యస్థితియందుంచి వారికి సన్మార్గోపదేశమును జేయుటకుఁ దగకయున్నది విధవయై తన జీవితకాలమంతయు దుస్సహవ్యథపాలుగాఁగుందుచున్నది ఆమెకంధకారబంధురమైన యా జన్మమువలని కష్టము తేలికపడుటకు నాశాలేశముగాని సంతోషచిహ్నముగాని కలుగ వీలులేకయున్నది వారిని దురవస్థావిముక్తలను జేసి యభివృద్ధిలోనికిఁ దిసికొనివచ్చుటకు నేనిందుఁ గొన్ని మార్గములను సూచించుచున్నాను

(1) స్త్రీలకు విద్యఁ గఱపుట మనకుఁ బ్రధానవిధిగానున్నది జనులలో సుమారు సగమువంతాడువారేకదా! వారిని విద్యాహీనలనుగా మనమేల చేయవలెను? పురుషులకుండు సర్వవిషయజ్ఞానమునకు న్యాయముగాఁ గాంతలుకూడ సమానఫలపాత్రలగుచున్నారు వారికి విద్య నేర్పుట కేన్యాయమే కాక స్వప్రయోజనముకూడఁ గారణముగుచున్నది స్త్రీలుచ్చదశయందుండకుండిన మనము వారినీచమైన యధోగతికి రావలసియుండును మనభార్య లారోగ్యధర్మముల నెఱిఁగినయెడల మన సంసారములింతకంటె నారోగ్యస్థితియందుండును మనోహారిణులై యుపయుక్త సహచారిణులగుటకుఁ దగినవిద్య వారు గఱచిన, మనమింతకంటె సౌఖ్యస్థితియందుందుము "బాలునికిఁ గఱపినవిద్య వానినే పండితునిజేయును బాలికకుఁ గఱపినవిద్య యామెనే కాక కుటుంబములోనందఱనుగూడ విద్యావంతులను జేయున"ని పాలుబెర్టు అనుఘనులు సెలవిచ్చినట్లు పురుషవిద్యకంటె స్త్రీవిద్య యెక్కువకాఁబట్టి దానికంటె నిదియే ముఖ్యము

దేశముయొక్క భవిష్యదవస్థ, ముందుజనించు ప్రజాపరంపర ననుసరించి యుండును గనుకను, అట్టిప్రజలను బెంచి పెద్దలనుజేయువిధి తల్లులది గనుకను, ఈతల్లుల జ్ఞానాజ్ఞానములే యట్టిప్రజలస్థితిబాగుపడుటకుఁగాని చెడుటకుఁగాని హేతువులగును గనుకను స్త్రీవిద్యయెక్కువ ముఖ్యముగా నెన్నఁబడవలసినది దీనినిగుఱించి యొక కవీశ్వరుఁడిట్లుచెప్పియున్నాఁడు "పిల్లలు తల్లులను బోలియుందురు ఉయ్యాలయందు నిద్రించుచున్న బాలునిపైఁ బ్రసరింపఁబడిన తల్లియొక్క భయాకాంక్షా కటాక్షవీక్షణములవలె నెంతబుద్ధిశాలియైనను ఎంతప్రేమగలవాఁడైనను దండ్రియొక్కజాగ్రత్త బాలుని హృదయమును జక్కపఱుపలేదు" ఆంగ్లేయభాషా ప్రసారమున్నంతవఱకు సాధారణముగా నంతట నుపయోగింపఁబడు నీక్రిందివాక్యములను శ్రీమహారాజ్ఞిగారి యాస్థానకవీశ్వరుఁడు లార్డుటెన్నిసనుగారు చెప్పియున్నారు "స్త్రీయభివృద్ధి పురుషునిది వీరిద్దఱును దేవత్వము, రాక్షసత్వము, స్వాతంత్ర్యము, పారతంత్ర్యము మొదలగు నుచ్చనీచదశలను సమముగానే పొందుదురు విస్మృతినుండిలేచి పురుషునితో రమ్యమైన సృష్టిసోపానముల నెక్కు స్త్రీ, పురుషుని కహోరాత్రములు సహభోగినిగానుండి సమానపదవిని జెందును లతాంగి జ్ఞానమునందును, గుణమునందును కొఱవడ్డదై దౌర్భాగ్యస్థితియందున్నయెడల పురుషులెట్లు పెంపొందఁగలరు" సంఘదురాచారభారంబునఁ గ్రుంగియున్న మనసంఘమునందు మూఢత్వంబునంజేసి ప్రస్తుత దురవస్థనే నిలుపఁజూచు తమయాడువారి కారుణ్యమును దోడ్పాటును సంస్కారకర్తలు పొందినయెడల వారిశ్రమ సగముతగ్గును లాభకరములును, శాశ్వతములునగు రాజకీయకార్యసంస్కారములు సన్మార్గమువలనను సద్వృద్ధిఁ జెందిన సంఘశక్తివలనను లభింపవలెను మనదేశముయొక్క రాజకీయస్థితిని నిష్పాక్షికబుద్ధితో నభివృద్ధిపఱిచిన ఏ. ఓ. హ్యూము దొరవారిట్లు చెప్పియున్నారు "ఆయాదేశస్థులకు తమ్ముఁబాలించు దొరతనమువారు రానురాను దమకుఁదగినవారే యగుదురు సంస్కారమువలనమాత్రే, వృద్ధిఁజెందిన రాజనీతిధర్మములకు సమ్మతముగాఁ బ్రవర్తించుటకుఁగాను దేశస్థులకర్హతయుండునట్లుగా నితర (సాంఘిక) విషయములన్నిటియందుఁగూడ, రాజ్యధర్మములతో సమకాలమందయినను అంతకుముందైనను వీరభివృద్ధిని బొందినవారయినం దప్ప కేవలరాజ్యతంత్రధర్మములవలని సదుపాయము ప్రజలకు అనర్థదాయకమేకాని వేరుకాదు రాజ్యతంత్రసంస్కరణమందు వేఱువే ఱభిప్రాయములు గలవారయిననుసరే ఈసంస్కరణ కర్తలందఱును వారిసంస్కరణములతోపాటు దేశస్త్రీలస్థితికూడ నభివృద్ధిఁజెందినం దక్క ప్రజాస్వాతంత్ర్యమునుగూర్చి వారుపడు ప్రయాసములన్నియు వృథయగునన్న యంశము నెన్నఁడును మఱవరాదు" సంస్కారము మూఁడవస్థలను జెందునందురు, అందులో

మొదటిదశయందు సంస్కారకర్తలను మతభ్రష్టులని దూషించిబాధింతురు రెండవదశయందు సంస్కారము నిరాతంకముగా జరుగుచుండును వారుమాత్ర మెగతాళినొందుదురు కడపటిదగు మూఁడవదశయందు, జనులు, సంస్కార మాటంకములున్నను మెల్లఁగా దేశమందంతటను వ్యాపించెఁగదా యనియేకాక యదిచిరకాలముక్రిందటనేలప్రారంభింపఁబడలేదనిగాని, వేగముగా నేలవ్యాపింపలేదనిగాని యద్భుతపడుదురు నిశ్చయముగా నదియావశ్యకమేయని వారు స్వయముగా నొప్పుకొందురు మన దేశమందు స్త్రీవిద్యాప్రశంస యిప్పుడికడపటి దశయందున్నది కనుక ఆవిద్యావలని లాభములనుగూర్చి యిప్పుడు విస్తరించి వ్రాయుటకంటె నేరీతివిద్య యవశ్యమో దానినిబొందు టెట్లో కొంచెము వ్రాయుట యావశ్యకమని తోఁచుచున్నది "స్త్రీ, వికాసమునొందని పురుషునివంటిదికాదు" జీవయాత్రయందుఁ బురుషునికుండవలసిన విద్య, గృహపరిపాలనఁజేయు స్త్రీకఁదగదు పురుషుల స్వాతంత్ర్యములన్నియుఁ దమకునుగావలెనని పోరాడుచు నితరదేశములలో నిప్పుడు బయలుదేరిన "క్రొత్తస్త్రీల" కావశ్యకమైన కార్యములును మనస్త్రీలకిపుడక్కఱలేదు అనుభవసిద్ధులైన సంస్కారకర్తలు మితమైన స్త్రీవిద్యా విధానముకని పెట్టినంజాలును మనస్త్రీలకు భర్తపై ననురాగముతోను శిశువులపై ప్రేమతోను నడుచుకొనుటకుఁ దగిన తెలివిని గలిగించువిద్య ప్రస్తుతస్థితినిబట్టి చాలునని నాకుఁదోఁచుచున్నది మనము కల్పించు యావత్ప్రబోధమును స్త్రీనియోగ్యురాలయిన గృహిణిఁగాను, పరిజ్ఞానముగల పురంధ్రినిగాను, అభివృద్ధికిఁదోడ్పడు సఖినిగాను జేయఁజాలినది గావలయును మనబాలికలకుఁ గ్రమమైన సామాన్యజ్ఞానము దేశభాషయందుండవలెనని యందఱంగీకరించినదే అట్టి పరిజ్ఞానముతోఁ దన తీరుబాటునందుఁ బుస్తకములను బత్రికలనుజదివి యామె వృద్ధినొందవచ్చును వార్తాపత్రికలుచదివి ప్రపంచమందలి తత్కాలసమాచారముల నెఱుఁగవచ్చును స్త్రీలకు గృహకృత్య నిర్వహణమునందును ఆరోగ్యశాస్త్రమునందును పాండిత్యమావశ్యకమైయున్నది సృష్టధర్మము వికారములేనిదైయున్నది దాని నజ్ఞానముచేనైన నుల్లఘించినవారి కనివార్యముగా హానిగలుగును సంసారమును, ముఖ్యముగా శిశువులను, ఆరోగ్యస్థితియందుంచుట యారోగ్యవేదినియైన భార్యయొక్కగాని తల్లియొక్కగాని సంరక్షణమందున్నపుడే శక్యమగును శారీరశాస్త్రమును, వైద్యశాస్త్రసంబంధమైన మూలధర్మములును వారికుపయుక్తములెయగును భూగోళశాస్త్రమును, దేశచరిత్రమును మనోహరములై జ్ఞానబోధకములుగానుండును ఘనతఁజెందిన స్త్రీల చరిత్రములు వారి స్వభావమును జక్కపఱచి యాశల నభివృద్ధిపఱచుటయందెక్కువ సామర్థ్యముగలిగియుండును. కుట్టుపని మొదలగునవి మిక్కిలి యావశ్యకము సంగీత

మత్యంతోపయుక్తమైనవిద్య “ఆర్ఫియసు” మృగములను నిర్జీవపదార్థములనుగూడఁ
దన సంగీతముచే మైమఱపించెనని చెప్పుదురు పనిచేసియలసినపుడును విచారముచేఁ
దోఁచకున్నపుడును సంగీతమువలె నాహ్లాదపఱచునదియు నూఱటపఱచునదియు మఱి
యొకటిలేదు భగవంతుఁడీయసాధారణవిద్యను స్త్రీలకొఱకు నిర్మించినట్లు కాన్పిం
చుచున్నది ఏలయన సంగీతమునకు స్త్రీకంఠము స్వాభావికముగా మనోహరత్వమును
సౌందర్యమును గలుగఁజేయుచున్నది ప్రస్తుతము మనలో నెక్కడనో గౌరవముగల
కొన్నిస్థలములందప్ప స్త్రీలయందు సంగీతవిద్యయంతయు వెలయాండ్రపాలయియున్నది.
గర్హితలయినవీరిని దొలుతగానవిద్యచే నపేక్షించి గుణమును, ఆరోగ్యమును, తుదకు
భాగ్యమును జెఱిపికొన్నవారిని మనమెఱుఁగుదుముగదా! అనేక కారణములచే,
నాంగ్లేయభాషకూడ హిందూస్త్రీ కావశ్యకమని తోఁచుచున్నది అదియిప్పుడు
దేశభాషయగుచున్నది ఈభరతవర్షమందలి పలుభాషలలో నాంగ్లేయభాష యొక్కటి
యే యన్నిదేశములవారికిని పరస్పర ముత్తరప్రత్యుత్తరములకుఁ దగియున్నది రాజకీయ
వ్యవహారసంబంధమైన దేశీయమహాజనసభయును, ఏటేట జరుగుసంఘసంస్కరణ
సభలును అపారమైన యాంగ్లేయభాషాప్రవర్తనము లేకున్నయెడల నసాధ్యములగును.
ఒకవేళసాధ్యమైన, నస్వాస్థ్యములగును నేనొకనాఁడు హిందూదేశముయొక్క
వేర్వేరు భాగములనుండివచ్చికూడిన మనోహరమైనసభయం దిద్దఱు స్త్రీలనుజూచితిని
వారిలో నొకయామెకు మూఁడుభాషలువచ్చును రెండవయామెకును మూఁడుభాషలు
వచ్చునుగాని యామెకు వచ్చినవానిలో నొకటియునీమెకు రాదు! ఇదియును “ఆంగ్లే
యభాష వృద్ధిఁజెందుచున్నభాష అది క్రొత్తవిశేషములను జూపుచున్నది చిరకాలము
నుండి ప్రతిదేశమునందును వ్యాపించినవిద్యలనన్నిటిని దెలిసికొనుటకు సాధనమగు
చున్నది” ఇంతేకాకదీనిక తత్క్షణోపయోగములును గలవు ఎట్లన రోగపీడితు
రాలైన యొకసుందరి యాంధ్రపత్రికనుదానె చదువుకొని యందువ్రాసినట్లు నడుచు
కొనఁగలదు తంతివార్తలు వచ్చినయెడల భయపడి దగ్గరదొరకు నాంగ్లేయవిద్యార్థి
కడకుఁ బరుగెత్తనక్కఱలేక తానెచదువుకొనును వీనియన్నిటికంటె ముఖ్యముగా
స్త్రీలు తావలమైయున్నమూఢవిశ్వాసమును బిచ్చియాచారములును లేనిసన్మతిధర్మముల
ను, నీతిధర్మములను వారికి నేర్పవలెను మనస్త్రీలదుర్దశకు జాలిపడినయొకరు మన
కాంతలను “మూఢవిశ్వాసనిధుల”ని యెంచినారు వారికి మంత్రములు, శకునములు,
మ్రొక్కుబడులు, వ్రతములు, నుపవాసములుమొదలగు పనికిమాలినవానియందుఁ బురు
షులకంటె నెక్కువనమ్మకముకలదు ఆవశ్యకమైనవిద్య మనస్త్రీలకీరీతిగా నేర్పవలెనని
క్రియచే వివరించిచూపుట సులభముగాదు “ప్రతిమనుష్యుఁడును దనగుమ్మము ముందఁ

దుడుచుకొన్న యెడలఁ బట్టణమంతయు శుభ్రపడు ననుచీనాదేశపు సామెతప్రకార మెల్లవారును దమ కుటుంబమునందలి భార్య, కూతులు, తోఁబుట్టువులు మొదలగు స్త్రీలవిద్యకై కొంచెము శ్రద్ధ వహించినయెడల స్త్రీవిద్య యపారమైన వృద్ధిని జెందును అయినను బురుషులు స్వయముగా విద్య నేర్పుట యశక్యము గనుక వారపనిని సులువు చేయుటకై బాలికాపాఠశాలలుండవలెను కనుక అట్టివిద్యాశాలలయొక్క స్థాపనమునకును సంరక్షణకునుదగిన నిర్వాహకత్వమునకును సహాయముచేయుట మన ప్రధానవిధియైయున్నది కాని, దౌర్భాగ్యవశమున మన బాలికలు యుక్తమైన యభివృద్ధి నొందకమునుపే పాఠశాలనువిడువవలసినవారగుచున్నారు ఈయాచారము నాపఁజాలుటవఱకు నిప్పటివఱకు మన కంతగా లాభములేదు మనము 'గృహబోధన' నేర్పఱచి దానిని బ్రోత్సాహపఱుపవలెను దీనికై కొందఱిని జీతమిచ్చి కుదిర్చిన బాగుగనుండును చెన్నపట్టణము మొదలగు స్థలములందు క్రైస్తవమతబోధకురాండ్రగు స్త్రీలు క్రైస్తవ వేదమునుగూడ నేర్పు నిర్బంధమున కొలఁది జీతమును పుచ్చుకొని యంతఃపురములకుఁబోయి విద్యఁ గఱపుచున్నారు దేశీయ హిందూసభకుఁజేరిన చెన్నపట్టణపు శాఖవారు మూడువేల రూపాయలను వ్యయపఱచి కొంతమంది యుపాధ్యాయురాండ్రను, ఒక పైవిచారణఁ జేయునధికారిని నియమించియున్నారు కొంతకాలము క్రిందట, ననంతపురమునందుఁ గొందఱు ఘనులు స్త్రీల గృహవిద్యకై యొక సంఘముగా నేర్పడిరి బంగాళమునందుఁ గొందఱు సంఘములుగాఁ గూడి పురుషు లాడువారికంటెకడ నేర్పువిద్యను గనుఁగొనుటకై నియమిత కాలములందు స్త్రీలను బరీక్షఁ జేయుచున్నారు వీనిలోఁగొన్నిటికి దొరతనమువారు నయితము ద్రవ్యసాహాయ్యము చేయుచున్నారు స్త్రీల గృహబోధనకై యుపాధ్యాయులను నియమించుట, వారిని బోషించుట ఈకృత్యములందు ప్రతి పట్టణమందలి ఘనులు పూనుకొనవలెను బాలురకు వలెనే బాలికలకును బరిశుద్ధవాయువును విశాలమైన స్థలమునందు సాధకము నావశ్యకముగాన బాలికల దేహపరిశ్రమ విషయమం దుపేక్ష చేయరాదు ఎదిగిన యాఁడువారు నయితము తమ వాసగృహములను వదలి సేదఁదీర్చు శుద్ధవాయువును బీల్చుటకును జక్కని సృష్టపదార్థములఁ గని యామోదించుటకును వెలుపలకు వచ్చుచుండవలయును దీనిని బట్టి స్త్రీలయంతఃపురవాసము నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చుచున్నది ఇది మొదట మన యాచారము కానేకాదు ప్రాచీన దినములందు హిందూసుందరులు సమయము వచ్చినపుడు సభలకుఁ గూడఁ బోవుచువచ్చిరని మనము చదివియే యున్నాము ఇట్టి సదాచారచిహ్నములు మనయం దిప్పటికిని లేకపోలేదు ఒకఁ డేదైన కార్యము చేయవలసిన యెడల బంధువులును లాలివారును ఎంతమందియున్నను వాని భార్యకూడ వాని కడనుండ

వానికి సహాయురాలు కావలెనుగదా! పూజాస్థలములకుఁ గాని యాత్రలకుఁగాని సతియుక్తుఁడై పోకున్నవానికి ఫలములేదని కూడఁ జెప్పఁబడినదికదా! అంతఃపురవాసమను దురాచారము మహమ్మదీయులనుండి గ్రహింపఁబడినది కనుకనే యెక్కడెక్కడ మహమ్మదీయరాజ్య ప్రాబల్యమెక్కువగా నున్నదో యక్కడ నీ యాచారము జాగ్రత్తగా నవలంబింపఁబడుచున్నది. ఇందు కుదాహరణముగా బంగాళమునం దిది యెక్కువగా నున్నది. అదృష్టవశముచే దక్షిణ హిందూస్థానమందును మహారాష్ట్ర దేశమునందును స్త్రీలకు సాధారణమగు స్వేచ్ఛగలదు. ఉత్తర సర్కార్లయందలి యాచారము బంగాళమునందలి యాచారమును సమీపించుచున్నది. జనసంఘములో నధిక సంఖ్యావారైన హీనజాతి స్త్రీలుకూడ నిట్లే యున్నారని నాతాత్పర్యము గాదు. ఇప్పుడు స్త్రీజాతి కీ యన్యాయము జరుగుచున్నది. ఈ యాచారముయొక్క ప్రధానోద్దేశము వారి పాతివ్రత్యమునందు నమ్మకము లేకుండుట. అన్యోన్య సంసర్గముచేఁ గలిగెడు తెలివియు సర్వవిషయ జ్ఞానమును లేకుండుట రెండవది. సృష్టిలోని వింతలను గని వాని నామోదింపలేక పోవుట మూడవది. "అంతఃపుర నివాసినులమగు మేము కూపస్థమండూకమును బోలి యున్నాము. వింత లన్నిచోట్లను గలవు. కాని మేము వానిని జూడలేము. మాకవి యలభ్యము లయియున్నవి" అని యొక హిందూస్త్రీ మొఱపెట్టుకొనుచున్నది. పరిశుద్ధవాయువు, విశ్రామము, సాధకము లేకయుండుట నాల్గవది. దీనివలన సీమ దొరసానుల యాచారమును బూర్ణముగా నిప్పు డవలంబించుట నాయుద్దేశమని మీ రెన్నఁడును దలఁపఁగూడదు. వారి యాచారము వలన సాధారణముగాఁ జెఱుపులేకపోలేదు. ఇప్పు డభ్యాసయోగ్యమై యీ రెంటికి మధ్యస్థమయిన పద్ధతి యొకటి నాకుఁ దోఁచుచున్నది. అది ప్రతి కుటుంబమువారును గృహమునందొకచోటఁ గూడి స్వేచ్ఛాసంభాషణమున కలవాటుపడుట. క్రమముగా బంధువులును స్నేహితులును గూడ నీసంఘమునందుఁ జేరవచ్చును. స్త్రీలు క్రమముగా జనసంఘముచేయుస్థలములకును వాదసభలకును జూడఁబోవుటకుఁ బ్రోత్సాహపెట్టుట. భార్యాభర్తతోఁ గూడ భుజింపరాదనుట పరిహాసాస్పదముగా నున్నది. ప్రస్తుతాంశముతో సంబంధించియున్న వారి యలంకారములను వేషమును గుర్చి యించుక విచారింతము. మన యాఁడువారి వేషము మందముగానె యున్నది గాని స్వేచ్ఛాసంచారమునకుఁ దగియుండలేదు. కంఠము మొదలుకొని కటిప్రదేశమువఱకును శరీరమును బాహువులను బూర్ణముగా నాచ్ఛాదింపఁగలిగిన చొక్కాయిలను వాడుకొనుచుంట కొంత యభివృద్ధిగానుండును. స్త్రీలు పాదరక్షలు తొడుగఁగూడదనియు గొడుగు వేసికొనఁ గూడదనియుఁ దలఁచుట సరిగాదు. స్వదేశ క్రైస్తవ స్త్రీలదుస్తులు మనవారి వేషమునందలి

యందును బశ్చిమదేశపువారి వేషమునందలి యుపయోగము గూడఁ గలిగి యున్నవి జేబులును, జేబురుమాళ్ళును, జేబుగడియారములును నుపయోగ కరములైనవె దట్టీ (నడికట్టు) లను గూడ నుపయోగింపవచ్చును కాని, బంగారము వెండి వానికంటె సొగసైనవిగాని మెత్తనివిగాని యెక్కువ సౌఖ్యప్రదములు నొసటిపైని గాని, ముంజేతిమీఁదఁగాని, లేక, శరీరమందలి మఱియేప్రదేశమం దయినను గాని పచ్చబొట్టు పొడిపించుకొనుట కేవలము దురాచారము అది మానఁదగినది నగల పై కాంక్షకూడ మానఁదగినది ప్రపంచమునందు స్త్రీలకందఱి కాభరణము లం దభిరుచి స్వాభావికగుణముగా నున్నది కాని యెచ్చటనుగూడ హిందూదేశమునం దున్నంత పరిహాసాస్పదమైన యమితత్వమును గాని, యపరిమిత ధనవ్యయమును గాని గలిగింపలేదు అతి దరిద్రులకుఁ దక్క ప్రతికుటుంబమునందును నగలుగలవు ఈదురా చారమెంత వఱకు వ్యాపించినదో యీ క్రింది సంగతులను బట్టి గ్రహింప వచ్చును “హిందూదేశమునందు నగల రూపముననున్న నాణెముల వెల 280 కోట్ల రూపాయిలు సాధారణముగా నూటికి నెలకు రూపాయి చొప్పున వడ్డిలెక్క చూచితిమా సాలునకు ముప్పదిమూడు కోట్లన్నర రూపాయిలగును ఇది యిండియా దేశపు భూమి పన్ను కన్నఁ జాల నెక్కువగా నున్నది” తక్కువ వడ్డియైన నూటికి సాలునకు మూడున్నరచొప్పున 9¾ కోట్లరూపాయిలువచ్చును ఇదిదొరతనమువారు రైల్వే,ఇర్రిగేషన్, పబ్లికువర్క్సు మొదలగువానికి ఋణదాతలకిచ్చు వడ్డికన్న నూటి కరువదిరెండు చొప్పున నెక్కువగానున్నది ఇఁక నగలుచేయుటకై కంసాలులకిచ్చు కూలియెంతో! 1891 వ సంవత్సరమున హిందూదేశమునందు నాలుగులక్షల యొకవేయి యేనూట యిరువదెనమండ్రు స్వర్ణకారులుండిరి సాధారణముగా జరుగు వీరి యుపహారణము లటుండఁగా వీరికూలి సగటున నెలకొక్కని కాఱురూపాయల చొప్పున మూడుకోట్ల రూపాయిలగుచున్నది కనుక నొక సంస్కారకర్త బెంజామిను ఫ్రాంక్లిను (Benjamin Franklin) గారితో నిట్లు చెప్పియున్నాఁడు “దొరతనమువారు మాకు విధించు పన్నులనుగుఱించి మేము విసుఁగుకొనుచున్నాము కాని, సోమరితనముచే దానికి రెండు రెట్లును, గర్వముచే మూడు రెట్లును, నవివేకముచె నాలుగురెట్లును, పన్నును మేమే విధించుకొనుచున్నాము’ ఆభరణము లందలి యత్యాశకు మూడు ముఖ్యకారణములగపడుచున్నవి వానిలో మొదటిది శరీరము శృంగారముగా నుండవలెనని కోరుట రెండవది నగలను బట్టియే, భాగ్యాభాగ్య నిర్ధారణమనితలంచుట మూడవదిబాలికలకుఁ గొంతియాస్తినిచ్చి ముందుజాగ్రత పడవలెనను నాశ ఈకడపటిదాని కాచారమును హిందూధర్మశాస్త్రమును కారణములయియున్నవి భర్త గతించినయెడల నా స్త్రీ

తన జీవనమునకై పునర్వివాహము చేసికొనరాదు ఎంత భాగ్యవంతమయినను సమిష్టి కుటుంబమునందొకఁడు పోయినయెడల వాని భాగపు సొత్తును బొందుటకు వాని భార్య కెంతమాత్రమును స్వత్వములేదు జీవనాంశమునుమాత్రమె యామె పొందఁగలదు భర్తయొక్క ప్రత్యేక ద్రవ్యమునందైన నామెకుఁ బూర్తియైన స్వాతంత్ర్యము లేదు భర్త స్థిరరూపమగు నాస్తిని విడిచిపోయినయెడల దాని ఫల మనుభవించుటకు మాత్రమె యామె యధికారముకలదు ఆ భూములను జ్ఞాతుల భావిలాభమునకై యామె జాగ్రత్తతోఁ గాపాడఁగలెను స్త్రీధనముగా నియ్యఁబడినట్టియు దాయముచేఁబొందఁబడినట్టియు సొమ్మును నగలును మాత్రమామె యాస్తియగుచున్నవి ఇట్లుండఁగా హిందూసుందరులకును, దఱుచుగా వారి జననీజనకులకును నగలయం దాశయుండుట యాశ్చర్యమా? కాని స్త్రీపురుషులజ్ఞానాభివృద్ధిచేతను, సొమ్ము దాచుకొనుటకు సేవింగ్సు బ్యాంకులు మొదలుగా నిప్పుడు గలిగిన సులభ సాధనములచేతను వారియభిప్రాయము లీయలంకారముల విషయమై మాఱవలెనని కోరుచున్నాము ఈలోఁగా వారి యభిరుచులును నభిప్రాయములును సంస్కరింపఁ బడవలయును తక్కిన వేడుకలను వలెనే కొంతయలంకార సంగ్రహముకూడ మన మంగీకరింప వలసినదే అందమైన పనితనముగల కొన్ని నగలు స్త్రీలశరీర సౌందర్యమునకు వన్నెఁదెచ్చునని మన మొప్పుకొన వలసినదే స్త్రీలకు సౌందర్యమే కాక శృంగారముకూడ ననావశ్యకము కాదు మొత్తముమీఁద నీ దేశమునం దుపయోగింపఁబడు నగలన్నియు సౌందర్యమునే కలుగఁజేయుట లేదు పాదములను ధరించెడు సంకెలల వంటి పలువిధములగు వెండిసజ్జువలన నేమిప్రయోజనము? ఆభరణముల నిమిత్తము ముక్కునకును జెవికొనలకును బది పండ్రెండు కుట్లు పొడుచుట కొంత క్రూరత్వమును సూచింపదా? దండకు బిగువైన బంగారపు కడియము నుంచుకొనుట సౌఖ్య నిరోధముకాదా? ఆచార ప్రవాహమం దంధులవలెఁ గొట్టుకొనిపోవుటకు మాఱుగా నీవిషయములందుఁ గొంచెము శ్రద్ధయు నాలోచనయు నగపర్చవలసియున్నది స్థితిగతులను దాఁటిన వ్యయము జరుగకుండునట్లు కూడ జాగ్రత్తగా నుండవలెను

ఇఁక స్త్రీ సంబంధ మున్నంతవఱకు వివాహ నిబంధనలను నాచారములను గూర్చి యాలోచింతము

మొదట పెండియీడుమాట.--జనులలోన నేకులు తమ కూఁతులకు యౌవనదశ వచ్చినదాఁక వివాహమక్కఱలేకుండ నుంచవచ్చును కాని, కొన్ని ముఖ్యజాతులయందు యుక్తవయస్సు రాకమునుపే వివాహము కావలెను ఈయాచారము తదుల్లంఘనముచేసిన వారిని జాతిభ్రష్టులను జేయునంతటి బలముగలదిగానున్నది ఈయాచా

రము సంస్కరింపఁబడు నంతవఱకును మనము వ్యతిరేకముగా నడుచుకొనుట సాధ్యము ఈయాచారమునకు లోఁబడియైనను మనయభివృద్ధి కవకాశము లేకపోలేదు మొదటి నుండియు సంబంధబాంధవ్యములు గల స్వల్పసంఖ్య కుటుంబములవారికే పిల్లనియ్యవలసిన యావశ్యకముచేతను, దగినవరుఁడు దాఁటిపోవునను భయముచేతను దల్లిదండ్రులు తొందరపడి కొన్నివేళలఁ బసికూనలకే వివాహముచేయుచున్నారు ఇట్టి వధూవరులు పెద్దవారైన తరువాత నొండొరులకు గుణములందుఁగాని యభిరుచులందుఁగాని యైకమత్యము కలుగకపోవచ్చును జీవితకాలమంతయు దౌర్భాగ్యము ననుభవింపవలసిన వైధవ్యము ప్రాప్తింపవచ్చును వీనినాలోచించితిమా పయినఁజెప్పినట్లు తొందరపడుట యెంతయు నుచితము కాదని తేలుచున్నది ఇంతేకాక బాలికలను బదునొకండుగాని పండ్రెండుగాని యేండ్లు వచ్చువఱకు వివాహమాపుటవలన నంతగా నష్టముండదు ఈ నిబంధనయే కొంతవఱకభివృద్ధియని మనము తలఁపవచ్చును కడచిన జనసంఖ్యవివరమును బరిశీలించినయెడల ముఖ్యముగా నుత్తరసర్కారులయందలి స్త్రీలకింక నభివృద్ధి కవకాశమున్నదని తోఁచుచున్నది మన రాజధానికంతకును నాలుగుసంవత్సరముల వయసునకు లోపుగానున్న వివాహితబాలికలు 24,257 రు, (విధవలు కాక) వారిలో 11,904 రుత్తరసర్కారులయందె యున్నారు ఇక్కడి జనసంఖ్య, రాజధానిలో సుమారు ఆఱవవంతైనను బాలవితంతువుల సంఖ్యమాత్రము సుమారు సగముగానున్నది. ఇట్టియతిబాల్య వివాహమను దురాచారము సగముపాలు గంజాము, విశాఖపట్టణము, గోదావరి, కృష్ణ జిల్లాలయందున్నను, బళ్లారి, కడప, కర్నూలు, అనంతపురము జిల్లాలయందు నాల్గవపాలుమాత్రమె యున్నది తంజావూరు, తిరుచునాపల్లి, మధుర, తిరునల్వేలి జిల్లాలయం దిదిసగటునఁ జాలఁ దక్కువగానున్నది ఇదియంతయు నాలుగు సంవత్సరములకులోపుగా వివాహమై సనాథలైయున్న బాలికలవివరము ఇఁక మన రాజధానికంతకు నైదుమొదలుకొని తొమ్మిదిసంవత్సరములకు లోపుగానున్న పుణ్యస్త్రీలు 144,482 రు వారిలో 79,102 రుత్తరసర్కారులయందే యున్నారు ఉత్తరసర్కారులయొక్కయు బళ్లారి, కడప, కర్నూలు, అనంతపురముజిల్లాలయొక్కయు జనసంఖ్య సమానమేయైనను బళ్లారిమొదలగు నాలుగుజిల్లాలయందు 21,753 రు మాత్రమేయున్నారు. పైనిజెప్పిన తంజావూరు మొదలగు నలువజిల్లాలయం దుత్తరసర్కారులకంటె జనసంఖ్య యెక్కువయేయైనను వీరిసంఖ్య 9,591 మాత్రమే దీని ముఖ్యఫలితముగా మనరాజధానికంతకును నాలుగేండ్లకులోపలి విధవలు 1000 మంది కంటె నెక్కువగానున్నారు పదేండ్లకులోపలి వితంతువులు 4,253 ప్రతి 10,000 స్త్రీలకును నాలుగేండ్లకులోపుగా వివాహమై సనాథలైయున్నవారు [illegible]రు ఆవయసు

నసె భర్తృహీనలైనవారు ముగ్గురు పదేండ్లకు లోపుగానున్న పుణ్యస్త్రీలు 189 రు ఆవయసునందె విధవలుపదుముగ్గురు సంఘమునుండి బహిష్కారమక్కఱలేకయుఁ బూర్వాచారమును మీఱనక్కఱలేకయు మనప్రయత్నమువలన నీయాపదలను నివారించుకొనుట కెంతయవకాశము గలదియుఁ బైనిసూచించినయంకెలు మనకుబోధించుచున్నవి చెన్నపట్టణమును యూరోపుఖండములోని దేశములతోఁ బోల్చిచూచితిమా యీదురాచారముయొక్కవ్యాప్తి మఱింత స్పష్టముగాఁ గనఁబడును ,,చెన్నపట్టణమునందు ప్రతి పదివేలపురుషులయందుఁ బదియేనేండ్లకులోపుగాఁ బెండ్లియాడినవారు 154 రు ప్రతిపదివేల స్త్రీలయందుఁ బదియేనేండ్లకు లోపుగానున్న పుణ్యస్త్రీలును విధవలును గలిసి 1,006 రు గ్రేటుబిటను, జర్మనీ, ఫ్రాంసుదేశములయం దీయీడుగల స్త్రీపురుషుల కెవ్వరికని వివాహమేలేదు ఇటలీయందుమాత్రము పదివేలబాలికలకు నీవయసునందు వివాహమాడినదొక్కతెయేయున్నది ' (1891 జనసంఖ్య వివరము) బాలికలకు యౌవనదశ రాకమునుపే వివాహముచేయవలెనను నిర్ణయముగలవారందఱు దమకూతులను బంగ్రెండవయేడువఱకు నాపఁదగును తక్కినజాతివారందఱు క్రూరమైనబ్రాహ్మణాచార మవలంబింపక యౌవనదశ వచ్చినతరువాత నె వివాహముచేయఁదగును

2. <u>గర్భాధానము చేయఁదగిన సమయము</u> దీనినిగుఱించి యనేకులు తప్పభిప్రాయములను జెందియున్నారు శీతలదేశమునకంటె నుష్ణదేశమునందు బాలికలకు యుక్తవయసు త్వరితముగావచ్చునని యందఱును నమ్మియున్నారు వైద్యశాస్త్రజ్ఞులు దీనికి భిన్నముగాఁ జెప్పుచున్నను ఇది కొంతవఱకు శీతోష్ణస్థితి ననుసరించి యుండు ననుట సత్యమే హిందూదేశమునందు బాలికలను బెంచుటలోఁగల విపరీతహేతువులచేత యౌవనము యుక్తకాలమునకంటె ముందుగఁ గలుగుచున్నదనుటయు సత్యమే బాలికకుఁ బదునాలుగేండ్లు రాకమునుపు పునస్సంధానము చేయుట హానికరమనియు నట్టియాచారము శీఘ్రముగా మానవలెననియు వైద్యశాస్త్రజ్ఞు లేకగ్రీవముగా మొఱపెట్టుచున్నారు యౌవనముయొక్క ప్రథమచిహ్నము బాల్యముపోవుచున్నదని తెలుపుటకేకాని సంభోగస్థితియందుండుటకుఁ దగియున్నదనుట కెంతమాత్రమును గాదు రజస్వలయైనతరువాత నాల్గవదినముననఁగాని యైదవదినముననఁగాని శోభనము చేయుట ముఖ్యముగా నీదేశమునందు విశేషాభిమానముతోఁ జూడఁబడుచున్నది వైద్యశాస్త్రప్రకారమిది యుపద్రవభూయిష్ఠమై క్షమింపరాని యపరాధముగానున్నది చిన్నవారికిఁ బ్రసవోపద్రవములు మెండుగానుండును ఒకవేళనవి సురక్షితముగా దాటినను, రీరదౌర్బల్యము మాత్రమెన్నటికినిదీఱదు దీనిఫలము సంతానమునందును విశేషముగానుండును సంతానమునకుఁ జెందుటయే ముందుతరములవారికిఁ జెందుట

పూర్తిగా వికాసమునొందని శరీరముగల స్త్రీ, నీరసులును, జబ్బువారునుగాని పిల్లలను గనుననుట వెఱ్ఱితనము ఈవిషయమై సంస్కారము సులభముగా నేయున్నది కొమార్తె నత్తవారియింటికిఁ బంపుటయందుఁ గొంచెము పేక్షఁ గనపర్చినయెడల నవివేకులగు బంధువులయొక్కయు స్నేహితులయొక్కయుఁ బరిహాసవచనములుతప్ప మతసంబంధమైన కఠినశిక్షలేవియులేవుగదా వచ్చునష్టముల నాలోచించుకొనినయెడల మనము వానిని సులభముగా నంగీకరింపవచ్చును

3 <u>వరనిర్ధారణము</u> ఇదియుఁగొంచెము సంస్కారము నొందవలసియున్నది దగ్గఱబంధువులతోడి వివాహము సంతానముయొక్క బలమునకును బుద్ధికిని నిరోధముగా నుండునని పండితులేకరీతిగాఁ జెప్పుచున్నారు అకాలమరణములకును దుర్బలశిశువులకును దగ్గఱబంధువులతోడి వివాహమే మొదటికారణమని యొక వైద్యశిఖామణి నుడివియున్నాఁడు కనుక పెద్దలచేనొప్పుకొనఁబడ యిప్పుడాచారములోనున్న "మేనరికము' తప్పిదమైయున్నది వేదము మొదలగు సద్గ్రంథములందెచ్చట నొకకులముయొక్క యుపజాతులలో నొండొరులకు వివాహముండఁగూడదని చెప్పలేదుగాన వివాహముచేసికొనఁదగిన కుటుంబముల సంఖ్య హెచ్చించవలసియున్నది ఇదియారోగ్యమునకును సులువునకునుగూడఁ గారణముగానున్నది కొన్ని యుపజాతులు తమనిర్ణయకుటుంబములయందె యొండొరులతో వివాహముచేసికొని వేఱైయుండవలసిన యావశ్యకమేమొ తెలియకున్నది ఒకప్పుడీనిర్ణయకుటుంబములు నూఱువంశములతోడనె సమాప్తమగును మఱియుజ్యోతిషమునందలి పిచ్చినమ్మకముగూడ వరనిర్ధారణమునకు నంతరాయము తెచ్చుచున్నది ఒకప్పుడనుకూలదాంపత్యములుకూడ వధూవరుల జాతకములు కుదురకపోవుటచేఁ జెడుచున్నవి ఎట్లన నొకప్పుడు జాతకములనుండి వరుఁడల్పజీవి యనిగాని, వివాహానంతరము మామగారికిఁగాని యత్తగారికిఁగాని, మరణము సంప్రాప్తమగుననికాని నిశ్చయింపఁబడుటచే నాసంబంధము వదలుకొందురు జాతకములెంత క్రమముగాఁ బరిశీలింపఁబడినను సంప్రాప్తమయ్యెడి వేలకొలఁదిమరణములును వైధవ్యములును జ్యోతిషమునందలి యసంగతమును దెలుపుచున్నవి ప్రపంచమునందు క్షేమముగానుండి వృద్ధిపొందుచున్న తక్కిన జాతులవారందఱు నధర్మచరులెయగుదురా? సంసారసుఖము వారికంటె మనకెక్కువగలదా? హిందూదేశమునకంటె నైరోపాఖండమునందు మరణములును వైధవ్యములును మిక్కుటముగానున్నవా? అన్నిజాతులలో నొక్క హిందువులే జ్యోతిషము ననుసరించి నడచుకొనవలసిన వారేలకావలెను? నామట్టుకు నాకు జ్యోతిషమునందెంత మాత్రమును నమ్మకములేదుగాని యదిమంచిశాస్త్రము కావచ్చుననుటను దిరస్కరింపవలసిన యావశ్యకము ప్రస్తు

తాంశమందు నాకులేదు ఇప్పటిజ్యోతిష్కులసమర్థులు వంచకులునని యు, వారిగణిత ములును వారుచెప్పెడిఫలములును విశ్వాసార్హము లెంతమాత్రమును గావనియుంజెప్పుట చాలును చనిపోయిన రాజా సర్ టీ మాధవరావుగారు దీనినిగుఱించి తమ యభిప్రాయము నిట్లువ్రాసియున్నారు ''వివాహవిషయములందు హిందువు లుపయోగించు జ్యోతిషమంతయు వట్టి యబద్ధమును కేవలవంచనమునని నానిశ్చితాభిప్రాయమని తెల్పుట యిప్పుడావశ్యకమని తోచుచున్నది హిందూదేశమునందన్నిచోట్లను బురుషులు తమభార్యలయెడ నిండుప్రేమ నగుపఱుపరు వెలయాండ్రును అనేకపత్నీకతయును దీనిముఖ్యకారణములు ''ఇద్దఱుభార్యలుకలవారు నూటికి నలుగురున్నారని తెలుపు వెనుకటి జనసంఖ్య వివరమునుబట్టి చెన్నరాజధానియందనేక పత్నీకతయెంత వఱకు వ్యాపించినదో సులభముగా గ్రహింపవచ్చును పురుషునకుం బుత్రుండుండవలెనని మతవిధియున్నంతవఱకుం గొందఱు ద్వితీయభార్యలను వివాహమాడుచునే యుందురు విలాసముకొఱకును గృహకలహములచేతను నివి జరుగుట మిక్కిలియరుదు ఇంతకంటె ఘోరమైనదియు సులభముగా మాన్పందగినదియునైనది వెలయాండ్రపద్ధతి వ్యభిచారమెంతమాత్రమును లేనిదేశము ప్రాయికముగానుండదు కాని హిందూదేశమునందు మాత్రము వారు మతసంరక్షకురాండ్రై యభివృద్ధినొందుచున్నారు ''దేవదాసి'' యను గొప్పపేరితోం బిలువంబడుచున్నను వ్యభిచారమె కులవృత్తిగా నేర్పఱుచుకొని ప్రతి దేవాలయమునకు నొకతెగాని యంతకంటె నెక్కువమందిగాని వారకాంతలున్నారుగదా! పూజాస్థలములందు వారావశ్యకమైన పరివారమంట! ఈజాతివారిలో దేవాలయముల సంబంధములేనివారు మఱికొందఱున్నారు వివాహము మొదలగు శుభకార్యములయందు వీరు నృత్తగీతాదుల కుపయోగింపంబడుచున్నారు ఇతరులనాకర్షించి యపమార్గమున కీడ్చుటకు వారికంగల సమయములన్నియు సాధ్యమగునంతవఱకుం దగ్గింపవలెనని యందఱొప్పుకొందురు కనుక సాధ్యమగునంతవఱకు వారుత్సవములకు రాకుండునట్లు చేయవలయును వివాహాది శుభకార్యములకు వారినిం బిలువకుండుటయేకాక వారున్నయెడల స్నేహితులయిండ్లకు నయితము పోకుండుట మనవిధియైయున్నది వేశ్యాంగనలు ప్రతిస్థలమునకును బోవుటకుం దగినగొప్పవారని తలంచుటకుమాఱుగా నసహ్యపాత్రములనియు విసర్జనీయులనియు జనసామాన్యమునకు బోధింపవలెను హిందూవితంతువుల దౌర్భాగ్యస్థితియు వారిని జక్కపఱుచుమార్గములును నేనిందువివరముగా వ్రాయం జాలకున్నాను మనరాజధానియందు మిక్కిలి యావశ్యకమగు నీసంస్కారమును గలుగంజేయుటకు భిన్నాభిప్రాయులగు ననేకులతోం గలహపడుచున్న స్థిరమనస్కులగు కొద్ది సంస్కారకర్తలేయావద్గౌరవమునకును అర్హులుగానున్నారని చెప్పి వారిలో రాజమహేంద్ర

వరమున నున్న కందుకూరి వీరేశలింగము పంతులుగారిని మాత్రమిందుఁ బేర్కొని యీ సంగతి నింతటితో ముగించుచున్నాను.

దాంపత్యనిబంధనములు. మహమ్మదీయులయందును క్రైస్తవులయందును స్త్రీపతులలో నెవరైనను వివాహబంధ నివృత్తినిఁ బొందవచ్చును. మంచిసంసారములం దివి తఱుచుగా జరుగుచుండవలెననుట నా యభిప్రాయము కాదు. కాని యసాధారణస్థితులసాధారణమార్గములనే పొందవలెను. హిందువులయందు వివాహ మొకయొడంబడిక గాఁగాక మతక్రియగా నెన్నఁబడుచున్నది. మరణమువల్ల తప్ప వివాహబంధవిమోచనము జరుగఁగూడదని హిందూధర్మశాస్త్రము చెప్పుచున్నది. ఇతరజాతులందున్నట్లు బహుభర్తృత్వము లేదుగాన మనలో స్త్రీలు పతివర్జనము చేసి బాగుపడలేరు. పురుషుఁడనేక భార్యల నేకసమయమునందుఁ గూడఁ బొందుటకు ధర్మశాస్త్రము నాచారముం గూడ నొప్పికొనుచున్నవి. శాస్త్రప్రకారము పోషణభారము తప్ప మఱియే విధియు నాతనికి లేదు. భార్యతో సంసారము చేయుటకును మానుటకును వాని యిచ్ఛకే స్వతంత్రత గలదు. ఇంతేకాక మగఁడెంత దుర్మార్గుఁడైనను అసహ్యపాత్రుఁడైనను రోగియైనను స్త్రీకి వానితోనె యుండవలసినది విధియైయున్నది. సామాన్యమైన కనికరముతో యోచించినను సంఘలాభములను యోచించినను ఇది తగదని తోఁచకమానదు.

ఇట్టివిషయములందు సంస్కరణ మెట్లు? మనమతాచారముల నన్నివిధములచేత గౌరవించెదమని ప్రతిజ్ఞవహించిన బ్రిటిషు దొరతనమువారు మనల సంస్కరింపఁ జేయుటయం దనిష్టులైయున్నారు. కాన, వారిసహాయమును మనమంతగాఁ గోరఁజాలము. మనము చేయు ప్రతికార్యము కూడ మతసంబంధమయినదే కదా! సంఘవిషయములతో మతాభిప్రాయములు మిళితమైయున్నవి. సంస్కరణమునకు విద్యాధికులు దొరతనము వారి సహాయమెంతఁ గోరుచున్నను వారియుపదేశకులును గార్యనిర్వాహకులును మన యాచారములతోడి సంపర్కమును గలుగఁ జేసికొనకుండుటకే యిష్టపడుచున్నారు. ఈమధ్య దాంపత్యనిబంధనలను గూర్చినయొక సాధారణ సంస్కరణమును రాజ్యశాసననిర్మాణసంఘమువారి యోచనమునకుఁ దేఁగాఁ జాలమంది సభికులది తగినదేయని యొప్పుకొనిరి. కాని న్యాయమగు రాజ్యనీతిని బట్టి దానినంగీకరింపరాదనువారు వీరికి సుమారెనిమిదిరెట్లుండిరి. శాశ్వతలాభము నిచ్చుసంస్కరణములన్నియు సంఘమువారు యేర్పఱుచుకొనవలెను. దీని కితరులసహాయము కుంటివాని చంకకఱ్ఱలవంటిది. ఆకఱ్ఱలను లాగితిమా వాఁడు మునుపటిదౌర్భాగ్యస్థితికే వచ్చును. స్వప్రయత్నముచేఁ గలుగు సంస్కరణ మెంత చిన్నదియైనను దానికి లాభములు లేకపోలేదు. ప్రతిసంస్కరణమార్గమును ముందుమార్గమును సులభము చేయును. హిందూసంఘములు స్వప్రయత్నముచే

నీదురాచారములనుండి విడుదలను బొందవలెనని నాయభిప్రాయము, కనుక విద్యార్థికులు తమయాలోచనమును, గాలమును, శ్రద్ధను, దీనివిషయమై కొంతవినియోగపఱచవలసి యున్నది స్వవిషయమును, ధనలాభమును సయితము లెక్కచేయక మనవారప్పుడప్పుడైనను దీనివిషయమై కృషిచేసి యెంతయల్పమయినను దమసహాయమును జేయుట సంఘాభివృద్ధి కవశ్యమైయున్నది క్వీబెక్కుజనులకు రాజ్యవిషయమై డఫ్రిన్ ప్రభువుగారు చెప్పిన యీక్రిందిసంగతులు సంఘవిషయమునకును సరిపడుచున్నవి

„ విద్యచేతను, స్వభావముచేతను, నభ్యాసముచేతను, సూక్ష్మబుద్ధిచేతను గూడ దేశమున కుపకారముచేయుటకుఁ దగియున్నవారు, లేనిపోని గృహకృత్యములలో మునిఁగి తేలుచు, భారమైనరాజ్య విషయములందుఁ దగిన భాగమును వహింపకయు, లోక విషయములందు జోక్యమునుగలుగఁజేసికొనకయు, నుండుటకంటె స్వదేశాభిమానాభావమును, కుక్షింభరిత్వమును, నీచత్వమును మఱియొకటిలేదు

బదనికలు వృతతరుల నాశ్రయించినట్లు మనము మనదేశమున కంటియున్నప్పుడును, దేశాభివృద్ధియను ప్రాణనాడితో సరిగా మనహృదయములు కొట్టుకొనకుండినపుడును, మనదేశముయొక్క యభివృద్ధియందును చరిత్రమునందును మనము భాగస్వాములము గాకున్నప్పుడును, మనము సుఖించు దేశమునుగూర్చి మనము గొప్పగాఁజెప్పుకొనలేక పోయినప్పుడును, మనయదృష్టమువలన నేమిఫలము? మనసుందరహర్మ్యములవలన నేమి ప్రయోజనము? మనయభివృద్ధివలనను నాగరికతవలనను నేమిలాభము? ”

# ఉత్తరసర్కారులలోని మండలసభలు.

ఉత్తరసర్కారులలోని మండల సభలు

ఈచెన్నపురిరాజధానిలోని యన్నిమండలములలోను ఒక్క యుత్తరసర్కారులలోమాత్రమే ప్రతిసంవత్సరమును మండలసభలు జరగుచున్నవి దీనినిబట్టి విచారింపఁగా జనసామాన్య మాభాగమునం దితరభాగములకంటె నెక్కువ యభివృద్ధి నొందుచున్నట్లు కన్పట్టుచున్నారు ఉత్తరసర్కారులలోనున్న నాలుగుమండలములలోను మూడుమండలములలో ఏటేట మండలసభలు వివిధస్థలములయందు చేయఁబడి జనసౌఖ్యమునకుఁ గావలయు వివిధాంశము లందుఁజర్చింపఁబడుచున్నవి ఉత్తరసర్కారులలో నొక్క గంజాముమండలములోమాత్ర మిట్టిసభలు జరగుటకింకను నారంభము కాలేదు అక్కడ ప్రముఖులుగానుండువారు కృషిచేసి యీలోపమును శీఘ్రకాలములోనే నివారించుకొందురని నమ్ముచున్నాము ఇతరమండలములలో నిట్టిసభలింకను ప్రారంభముకాలేదు

రాజ్యాంగవిషయములను జర్చించుటనుగూర్చి యిటువంటిసభలు మొట్టమొదట కృష్ణామండలమునందుఁ జేయఁబడినవి అటుతరువాత గోదావరిమండలమువా రాపద్ధతి నవలంబించి యేటేట సభలుచేయుచున్నారు ఈయుభయమండలములవారును ప్రదర్శించినమార్గము నవలంబించి రెండేండ్లనుండి విశాఖపట్టణమండలమువారును సభలు చేయుచున్నారు ఈసభలవిషయమున గోదావరిమండలమున నొకవిశేషముగలదు అచ్చటివారు మొదటినుండియు రాజ్యాంగవిషయములతోడిపాటుగా సాంఘికసంస్కారవిషయములనుగూర్చికూడ ప్రత్యేకముగా సభలుచేసి వివిధాంశములను చర్చించి సంఘాభివృద్ధికరములైన వివిధనిర్ణయములను జేయుచున్నారు ఈమంచిమార్గమును ద్రొక్కి కృష్ణామండలమువారును కడచిన రెండుసంవత్సరములనుండియు సాంఘికసంస్కారసభలనుగూడఁ జేసి ఫూనికతోఁ బనిచేయుచున్నారు ఈమండలద్వయమువారును జూపిన యీయుత్తమపద్ధతి నీసంవత్సరము విశాఖపట్టణమండలమువారును స్వీకరించిరని తెలిసి సంతోషించుచున్నాము

కృష్ణా గోదావరీమండలములలో గతమాసాంతమునను విశాఖపట్టణమండలమున వర్తమానమాసారంభమునను మండలసభలు జరపఁబడినవి గుంటూరునందు జరగిన కృష్ణామండల రాజ్యాంగసభకును సాంఘికసభకునుకూడ మ-రా-శ్రీ ఆర్ వెంకటరత్నము నాయఁడు ఎమ్ ఏ, ఎల్ టీ, గారగ్రాసనాధిపత్యమును వహించి తమకృత్యమును చక్కఁగానిర్వహించిరి పసలపూడి గ్రామమునజరగిన గోదావరీమండల రాజ్యాంగసభకు మ-రా-శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులుగారును, సాంఘికసభకు మ-రా-శ్రీ

# ఉత్తరసర్కారులలోని మండలసభలు.

కటసూర్యప్రకాశరావు బీ ఏ. గారును, అగ్రాసనాధిపత్యమును పూని సామర్థ్యముతో నెఱవేర్చిరి విజయనగరమునందు జరగిన విశాఖపట్టణ మండలరాజ్యాంగసభకు మ-రా-శ్రీ గంజాము వేంకటరత్నము పంతులుగారును, సాంఘిక సభకు మ-రా-శ్రీ బి ఎన్ శర్మ బీ ఏ, బీ ఎల్ గారును, అగ్రాసనాధిపత్యముఁ గైకొని తమ కృత్యమును సమర్థతతో కొనసాగించిరి వచ్చినసభికులలో నుత్సాహమునకుఁ గొఱఁతలేకపోయినను సభకువచ్చినవారి సంఖ్యనుబట్టి విచారించినపక్షమున గోదావరీమండలసభ మొదటితరముగాను, కృష్ణామండలసభ రెండవతరముగాను, విశాఖపట్టణమండలసభ మూడవతరముగాను, ఉన్నవని చెప్పవచ్చును

గుంటూరులో జరగిన సాంఘికసభలో మండలములోని ముఖ్యప్రదేశములలో నెల్లను సాంఘికసంస్కారసమాజము లేర్పఱుపవలయుననియు, వివాహకార్యములయందుఁ జేయఁబడెడి యతివ్యయమును తగ్గించుటకై యెల్లవారును ప్రయత్నింపవలయుననియు, స్త్రీవిద్య వృద్ధిచేయవలయుననియు, ఒకవర్ణములోని శాఖలలో సహభోజనములను పరస్పర వివాహములను జరపవలయుననియు, భోగముమేళములనుబెట్టు దురాచారమును మాన్పవలయుననియు, ఎనిమిదేండ్లలోపలి యీడుగల బాలికలకును పదునాఱేండ్లలోపలి ప్రాయముగలబాలురకును వివాహములు చేయకుండవలయుననియు, నిర్ధారణములు చేయఁబడినవి

పసలపూడిలో జరగిన సాంఘికసభలో వివాహాదులగు శుభకార్యములలో సాధ్యమైనంతవఱకు వ్యయము తగ్గింపవలయుననియు, ఎనిమిదేండ్లునిండని బాలికలకును పదునాఱేండ్లునిండని బాలురకును వివాహములు చేయఁగూడదనియు, బాలికలకును కులకాంతలకును విద్య నేర్పించుట కేర్పాటు చేయవలయుననియు, వర్ణములలోఁగల యెల్ల శాఖలవారును భోజన ప్రతిభోజనములను జేయుచు వియ్యమందవలయుననియు, కన్యాశుల్కవరశుల్కములను మాన్పవలయుననియు, శుభకార్యములయందును లౌకికసభలయందును భోగముమేళముల రప్పింపకుండవలెననియు, సురాపానాదుల మాన్పవలయుననియు, వితంతువివాహములను ప్రోత్సాహపఱుపవలయుననియు, దేవాలయాదిమతసంబంధనిధులను బాగుగపాలింప శాసనమును నిర్మించుటకు దొరతనమువారిని ప్రార్థింపవలయుననియు, శవవహనవిషయమున మంచియేర్పాటులు చేయవలయుననియు, నిర్ధారణములు చేయఁబడినవి సంఘసంస్కారము జరగక కేవలరాజ్యాంగస్వాతంత్ర్యలాభమువలనఁ బ్రజలకునిజమైన సుఖాభివృద్ధి కలుక నేరదుగనుక, ఇట్టి సాంఘికసంస్కారప్రయత్నము దేశముయొక్క పురోవృద్ధికి సూచకముగానున్నదని సంతోషించుచున్నాము

రాజా రాజబల్లవులు—అందును గురించి మే మిదివఱకే విచారణచేసి యున్నాము మీర్జాఫరును మన చేతిలో నుంచుకొనుటకు నింగ్లీషువారి సహాయ మడుగఁదలఁచితిమి వారు బహుబలవంతులు, కేవలము వర్తకులు రాజ్యము చేయవలయుననుకోరిక వారికిఁ గలుగ నేరదు వర్తకమునందు విశేష లాభము గలుగునటులు గొన్ని పరతులు వారికి వ్రాసియిచ్చిన పక్షమున, వారు మన కత్యానందముతో సతతము సహాయము చేయుచుందురు వారి సహాయముచే నెల్లప్పుడు నవాబు మనకు లోఁబడియుండు నటులు చేయవచ్చును

జగత్సేటు—ఇదియునుఁగాక కలకత్తా నగరములోని కంపనీవారి దుకాణమును సిరాజద్దౌలా కాల్చియున్నాఁడు కాన కంపనీవారు సిరాజద్దౌలాను ఓడించుటకు యత్నింపుచున్నారు గనుక నిప్పుడు క్రొత్తగాసింహాసనస్థుఁడగు నవాబు వారికి స్నేహితుఁడుగానున్న పక్షమున వారితనికి చాల్ప సహాయముఁజేసి కృతజ్ఞులయి యుందురు వారితో సఖ్యముఁ జేయనిపక్షమున రాజ్యమునకుఁ బ్రారంభము కాఁగానే, క్రొత్త నవాబునకు వారితో యుద్ధము చేయవలసివచ్చును

రాజా రాయ దుర్లవులు— ఇంగ్లీషువారు దక్షిణములోని నవాబును పరాజితుని జేసిరి కాన వారితో సఖ్యమే చేయువలెను, వైరమువలదు.

రాణీభవాని—నృపోత్తములారా! నేను స్త్రీనైనందువలనఁ దమకిట్టి రాజకీయ వ్యాపారములలో సలహా చెప్పుటయందు సమర్థురాలనుకాను అయినను, నా స్వల్పబుద్ధికోలఁదిఁ జెప్పెద వినుఁడు ఇంగ్లీషువారిప్పుడు వర్తకులుగానున్నను, మనము వారి సహాయముగోరి, వారిచేతికి మనజుట్టునిచ్చినప్పు డీమహారాజ్యమునుజూచివారికిరాజ్యాభిలాష గలుగకమానదు వారు వర్తకపు తక్కెడనువదిలి, రాజ్యమును చేతఁ బూనెదరని నమ్మవలసి యున్నది అప్పుడు మన గతియేమి? మరారావారి గుణ ధర్మములను గురించి మనకుఁ గొద్దిగనైనను తెలియును కాని వీరి విషయమయి బొత్తుగ మన కేమియుఁ దెలియదు కాన తురుష్కుని రాజ్యారూఢుని జేయుటకును, పరదేశస్థులయిన కంపనీవారిని దీనులవలె సహాయం బడుగుటకును, నేను సమ్మతింపఁ జాలను

ఇట్లచ్చటఁ జాలసేపువఱకు వాదవివాదము జరిగి తుద కితరరాజుల బలవంతముచే రాణీభవాని, యింగ్లీషువారి సహాయముఁ బుచ్చుకొని మీర్జాఫరును రాజ్యముపై నుంచుటకు సమ్మతించి యిట్లనియె —“మహారాజులారా! మీరందఱు సమ్మతించి, నిశ్చయించిన మాటకు విరుద్ధముగా నడచుట నాకు భావ్యముగాదు గనుక మీమాటనాకు సమ్మతమే కాని యీ మార్పువలన మన దేశమున కెంతమాత్రము, లాభము గలుగ నేరదని నా మనోదేవత నాకుఁ జెప్పుచున్నది ఈమార్పువలన తురకవారికిఁగల సర్వాధి

కారమింగ్లీషు వారి కిచ్చుచున్నాము తురుష్కుని రాజ్యమునుండి తొలఁగించి, హిందూ దేశమున హిందురాజును స్థాపించునంత శక్తియు, దేశాభిమానమును, ఐకమత్యమును, మనలకు లేనపుడును, మన దేశస్థులయిన మరాఠావారిని మనము నమ్మఁజాలనపుడును, మనము మనరాష్ట్రము హూణులచేత నొప్పగించుటయే బహు యోగ్యముగా నున్నది వీరే మనకు హితకర్తలగుదురుగాత" ఇట్లందఱును నిశ్చయించి వారివారిసంస్థానములకు వెళ్ళిరి తరువాత ౧౭౫౭ వ సంవత్సరమున జరగిన ప్లాసీయుద్ధమునందు కంపనీవారును, మీర్జాఫరును గూడి సిరాజద్దౌలాను ఓడించిన సంగతి చరిత్రజ్ఞుల కందఱికిని దెలిసినదే

ఇప్పుడు నేను వర్ణించిన కాలము హిందూదేశముయొక్క చరిత్రములోని ముఖ్య భాగమయియున్నది తురకల రాజ్యముయొక్క క్షయమునకును, ఇంగ్లీషు ప్రభువుల యొక్క యభ్యుదయమునకును, ఇది సంధికాలమని చెప్పవచ్చును ప్రభుత్వము లిట్లు తలక్రిందు లయ్యెడి కాలముయొక్క మాహాత్మ్యమప్పుడు, రాణీభవాని గారు దప్ప నితరులెవరును గ్రహించినవారు కారని పైని వ్రాయఁబడిన సంభాషణలవలనఁ జదువరులు గ్రహించియే యుందురు రాణిగారి సంభాషణలవలన వారికిఁ గల యనుపమేయ స్వదేశాభిమానము వెల్లడియగుచున్నది రాణిగారు చేసిన రాజకీయ భవిష్యత్తులన్నియుఁ దప్పక నిజమయినవని చూచి రాణిగారి రాజనీతినిపుణత్వమునకును, వ్యవహారమునందుఁగల దీర్ఘదృష్టికిని, మానవ స్వభావముయొక్క యథార్థజ్ఞానమునకును, ఎంతయు సంతసింప వలసియున్నది రాజకార్యముల యొక్క వాస్తవ స్వరూపములను పూర్ణముగా గుర్తెఱిఁగిన యీ లలనారత్నము, మన దేశమునందు కార్యధురీణులనియు దీర్ఘదృష్టులనియుఁ బేరొందిన తోడరమల్లు, నానాపడనవీసు, అక్కన్న, మాదన్న మొదలయినవారితోను, ఐరోపాఖండమునందువ్యవహారవేత్తలని విఖ్యాతిఁగాంచిన పిట్టు, ఫాక్సు, బర్కు, బిస్మార్కు, గ్లాడుస్టాను మొదలయిన పురుషపుంగవులతోను, బుద్ధియందు సమానురాలని చెప్పుటకు సందేహములేదు మన దేశమునందలి నారీమణులిట్టి బుద్ధివైభవముఁ జూపుచుండఁగా, స్త్రీలు పురుషులకన్న బుద్ధిహీనలనియు, వారికి విద్య నేర్ప వలదనియుఁ బ్రతిపాదించుట వింతకాదా? మన దేశమునందలి స్త్రీలకు స్వాతంత్ర్యము లేనందునను, వారికి విద్య నేర్పనందువలనను, మన మనేక రాణీభవానులను బోఁగొట్టికొనిన వారమైతిమి ఇన్ని నిర్బంధము లుండియు నప్పుడప్పుడు రాణీభవానులవంటి నారీరత్నంబులు మన దేశమున నుదయించుటచూడఁగా ఈ నిర్బంధనలు లేకయుండి, మన స్త్రీలకు యోగ్యమైన స్వాతంత్ర్యమును సద్విద్యయు ప్రాప్తమయి యుండినయెడల నిచ్చట నిదివఱకు ననేక రాణీభవానులుద

యించి యుందురని చెప్పుట యతిశయోక్తిగానేరదు

రాణిగారి శౌర్యధైర్యములను గుఱించియు, రాజకీయ వ్యవహారములలో నామె చూపిన చాతుర్యమును గుఱించియు నిదివఱకు వ్రాసితిని ఇఁక నామె ధర్మకృత్యములను గుఱించి వ్రాసెదను

భర్తయొక్క జీవితకాలమునందు భవాని, ధర్మాత్మురాలని విశేష విఖ్యాతిఁ జెంది గాదు అయిన నామె సాధారణముగా దానధర్మములను జేయుచునే యుండెను దేవాలయములఁ గట్టించుట, చెఱువులు బావులు మొదలైన జలప్రదేశములఁ ద్రవ్వించుట, అన్నసత్రములు స్థాపించుట, బీదబ్రాహ్మణులకేమి బ్రాహ్మణేతరులకేమి వివాహాదులు చేయించుట మొదలైన భూతదయా ప్రేరితములగు సత్కృత్యము లప్పటినుండియే, రాణిగారు చేయుచుండిరి

ఈమెకు దైవభక్తి విశేషముగాఁ గలిగి యుండెను ఏవస్తువు నయిన నీశ్వరునికి సమర్పింపక యీమె యనుభవించుటలేదు ఒకనాఁ డీమె పెనిమిటి యిరువది యయిదువేల రూపాయలకు రెండుచంద్రహారములఁ గొనెను వానిలోనొకటికాళికాదేవికనియు, మరియొకటి తన భార్య కనియు నాయన నిశ్చయించుకొనెను వానిలో నొకటి బహుసౌందర్య యుతముగాను, మఱియొకటిసాధారణముగాను, ఉండెను. వానిలో నుత్తమమయినది తనభార్యకయ్యవలయుననితలఁచి, రాజుగారు వానినిరాణిగారికఁజూపఁగా నుత్తమ మయినది కాళికాదేవి కిచ్చెదనని యామె చెప్పెను అందుమీఁద రాజుగారు తన యభిప్రాయమును దెలుపఁగా "మీకిష్టమైన హారము మీరు సమర్పింపవచ్చును, నాకిష్టమైనదానిని నేను సమర్పించెదను, ఇట్లైన నిరువురికోర్కె లీడేరును" అని రాణిగారు చెప్పిరి. అదేప్రకారము రెండు హారములును దేవికి సమర్పించిరి! ఇట్లామె యకల్మష దైవభక్తనిజూపు దృష్టాంతంబులనేకంబులు గలవు కాని విస్తర భీతిచే నిచ్చట వ్రాయలేదు

తనకుఁ గుమారులు లేకపోయినను, తనకూఁతురగు తారకుఁ గుమారుఁడు గలిగిన పక్షమున వానికిఁ బట్టముకట్టి తాను గంగాతీరముననుండి, దాన ధర్మములఁజేయుచు, ఈశ్వరుని ధ్యానము చేసికొనుచు నుండవలెనని యీమెకుఁ దాత్పర్య ముండెను ఇట్టి యోచనగలదియి, తారకొక మంచి వరుని దెచ్చి పెండ్లిచేసెనుగాని, "తానొకటి దలఁచిన దైవమొకటి తలఁచు" నను సామెత చొప్పున నాయల్లుఁడు మృతినొందెను అల్లుని మరణమువలన రాణిగారి కత్యంతదుఃఖమును అపరిమితమైన నిరుత్సాహమును గలిగెను కొన్ని దినములవఱకునువితంతు పుత్రికను జూచినప్పుడెల్ల నామెకు మిగుల దుఃఖముగలిగి చిత్తభ్రమ గలుగుచుండెనఁట నవాబగు సురాజద్దౌలా, రాణిగారికోమా

ర్రను చెరఁబట్టఁదలఁచి, సైన్యములఁబంపెననియు, వానిని రాణిగారోడించిరనియు వెనుక వ్రాసియున్నాను ఆ యుద్ధమీవితంతువగు తారకొఱకే జరిగినదని చదువరు లిదివఱకే గ్రహించి యుందురు. ఈయుద్ధము జరిగినప్పటినుండియు రాణిగారు తార నెప్పుడు తనవెంటనే యుంచుకొని బహు జాగరూకతతోఁ దారను గాపాడుచుండిరి

అల్లుని చావుతో రాణిగారి యాశలన్నియు నిరాశలాయెను రాజ్యమున మగవారసుదారు లెవరును లేనందువలన, రాణిగారు సంపత్తినంతను లోకహితమయి వ్యయపరుచుటకు నిశ్చయించిరి ఇట్లు నిశ్చయించిన పిదప నీమె చేసిన దానధర్మము లింతంతని చెప్ప నలవిలేదు వానిని విన్నవారు సానందాశ్చర్యమును బొందక మానరు ఈమెకన్న నధిక శ్రీమంతులగు రాజు లనేకులు గలరు, కాని యీమెచేసిన దానము లనేకములు గొప్పగొప్ప చక్రవర్తులకు శోభించునట్టివి

ప్రతిసంవత్సరమీమె ౨౫ వేలరూపాయలు చిల్లరదానధర్మములయందు వ్యయపరుచుచుండెను గంగాతీరముననుండి వేదాధ్యయనముచేయు బ్రాహ్మణోత్తములకును, యోగాభ్యాసముచేయుయోగులకును, అతిథులకును, అభాగ్యతులకును, అన్నము పెట్టుటకై యామె యనేకసత్రములను గంగాతీరమునస్థాపించియున్నది సంస్కృతవిద్యాధ్యయనమును, వేదాధ్యయనమును, శాస్త్రాధ్యయనమునుజేయు విద్యార్థులకు విద్యార్థి వేతనార్థము సంవత్సరమునకు నిరువదియైదువేల రూపాయిలు ముట్టునట్టీమె బందోబస్తుచేసినది ఆకట్టుబడి యిప్పటివఱకు నడుచుచున్నదని చెప్పెదరు ! అనేక గీర్వాణపాఠశాలలు స్థాపించి, వానిపై గొప్పపండితులను గురువులుగా నేర్పరచి, విద్యార్థులకు పాఠశాలలలోనే యన్నము పెట్టునటు లేర్పాటులఁజేసి, శాస్త్రములందుఁ బ్రవీణులగు విద్యార్థులకు వారి వారి ప్రవీణత ప్రకారము పారితోషకముల నిచ్చునటులు నియమంబులుచేసెను తానేర్పరచిన సత్కృత్యంబుల్లు తన మరణానంతరము నిర్విఘ్నముగా జరగవలెనని, రాణిగారు ఈస్టుఇండియా కంపనీవారికిఁ గొన్నిలక్షల రూపాయీలిచ్చి వాని వడ్డీవలన నీ పాఠశాలలు సతతము జరుగునటులు నియామకము చేసిరి గనుక నిప్పటికి బంగాళాదేశములో వీరికి ననేకాశీర్వచనములనిచ్చుచు ననేక విద్యార్థులు సంస్కృత విద్యామృతమును బానముచేయుచున్నారు. ఈమె భూదానము లనేకములు చేసనది, అనేకులైన బీదకాఁపుల సిస్తులు వదలిపెట్టనది ఇందుచే నీమెరాజ్యమున బీదలందఱు సుఖముగానుండిరి

కాశీ, గయ, రాజశాహి, బడానగర్, మొదలయిన పట్టణములయందీమె గొప్ప గొప్ప దేవాలయములను. సత్రములను గట్టించినది వీనిలోఁ గాశీక్షేత్రములోని దేవాలయము బహురమ్యమైనది. దీనిలోని విశ్వేశ్వరుఁడు, దండపాణి, దుర్గ, తారా,

రాధాకృష్ణుల విగ్రహములు కడుసొంపుగానున్నవి అత్యంత సుందరములైన శివలింగంబు లిందనేకంబులు గలవు దేవాలయమంతయు శ్రేష్ఠమైన నల్లని రాతితోఁ గట్టఁబడినది. ఇదే రీతిని నామె యనేకఘట్టముల రాతితోఁగట్టించెను అనేక ధర్మశాలల స్థాపించెను కాశియం దేడుబందల గృహములఁగట్టించి యిహసౌఖ్యముల వదిలి కాశీవాసముఁ జేయవచ్చిన యనాథలను వానియందుంచి భోజనముఁబెట్టి వారి మరణానంతర ముత్తరక్రియలనుగూడ యథావిధిగాఁ జేయించుచుండెను పంచక్రోశము చుట్టు నీమె ధర్మగృహములు, బావులు మొదలైనవి యనేకములు కలవు కాశీక్షేత్రమం దీమె సహాయమువలన నాలుగువేల ప్రజ బ్రతుకుచుండెను!

రాణిగారు మనుష్యులయందేగాక పశుపక్షిక్రిమి కీటకాదులగు సమస్తప్రాణులందును కరుణగలదియై వర్తించుచుండిరి లన రాజ్యమునం దెచ్చటను గోమహిషాదుల వధ కాఁగూడదని యామె నిబంధనఁజేసెను ఈనిబంధన నుల్లఘించువారికి ఘోరశిక్షవిధించెను పక్షులకొక నోడ్డిలో నసేక ధాన్యములు వెదచల్లించి, వానికొఱకై వచ్చిన పక్షిసమూహమును దూరమునఁజూచి యిట్టి చక్కనిపక్షుల నుత్పన్నముచేసిన సర్వేశ్వరుని యద్భుతశక్తి ప్రేమాదులకు నానందించుచుండెను చీమలకుఁ బంచదార, చేపలకు రొట్టెముక్కలు, మార్జాలములకు క్షీరాన్నము మొదలగు భక్ష్యములనిప్పించి, యవి సుఖించుచుండుటఁజూచి భవానిగారు మనమునందు మిగుల సంతోషించుచుండురు ఇట్లీమె కారుణ్యామృత ప్రవాహము ఎల్లప్రాణుల యెడలను సమానముగఁ బ్రవహించుచుండెను

ఈమె కాశీయాత్రకు బయలుదేరినపుడు ఈమె వెంట ౧౫౦౦ ఓడలు ... లినవఁట భక్ష్యపదార్థములు ౧౦౦౦ పడవలమీఁద వెళ్లినవఁట! ఇట్లపరిమితాన్నదానము చేసినందువలన లోకు లీమెయన్నపూర్ణయొక్క యపరావతారమని యెంచుచుండిరి.

రాణిభవానిగారి రాజ్యమునం దనాథులగు రోగులకౌషధంబు లిప్పించుటకునై యనేకౌషధాలయంబులు కట్టింపఁబడినవి ఇప్పటివలె నప్పుడు డాక్టర్లును, ఆసుపత్రులును లేకపోయినను, హిందూవైద్యశాస్త్రమునందుఁ బ్రవీణులగు భిషగ్వర్యులనేకులు, రాణిగారివలన గొప్పవేతనములఁగొనుచు వైద్యశాలలయందు బీదలకౌషధంబు లిచ్చుచుండిరి రోగి, వైద్యశాలలోనికివచ్చి బాగై వెళ్లువఱకును వానికిఁగావలయు పథ్యపానములును, ఔషధంబులును, ఉపచారంబులును మొదలైనవన్నియు యథావిధిగా జరుపుటకు రాణిగా రనేకసేవకుల నేర్పరచిరి ఆహా! ఈమె భూతకారుణ్యము నెంతనికొనియాడెదను ఇట్టివిశ్వకుటుంబినిని వేయినోళ్లఁగొనియాడినను జాలదు

రాణిగారు సకల లోకులచే సత్కరింపఁబడుచుండిరి కేవలము హిందువులకే గాక తురుష్కులకుఁగూడ నీమె పూజ్యురాలాయెను ఒకానొక సమయమున రాణిగారు గయలోఁ బిండము వేయుటకునై వెళ్లినప్పుడు అచ్చట రాజు తనకైదులక్షలరూపాయీ లిచ్చినఁగాని పిండదానము చేయ నియ్యనని చెప్పెను రాణిగారీసంగతి మూర్షిదాబాదు నవాబునకుఁ దెలుపఁగా నాతఁడు గయాధీశ్వరుని పదచ్యుతుని జేయుటకై తత్క్షణమే సైన్యములఁబంపెను ఈసంగతివిని యారాజుభయమొంది రాణిగారికి శరణుచొచ్చెను శరణాగతుని రక్షింపవలెనని రాణిగారు తిరిగి నవాబునకు సమాధానము చెప్పి యారాజును రక్షించెను కొన్నిదినముల కీరాజు నవాబుకియ్యవలసిన కప్పమీయనందునఁ గారాగృహవాసుఁడయ్యెను అప్పుడును రాణిభవానిగారడ్డముండి యతనిని బంధిఖానానుండి విడిపించిరి

,,క ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ * వివరింపంగా
నపకారికి నుపకారము
నెప మెన్నక చేయువాఁడు * నేర్పరిసుమతీ॥''

యని మనము చిన్నతనమునందుఁ జదివిన యీయమూల్యమైన నీతిపద్యమునకు రాణిగారు లక్ష్యభూతలని చెప్పుటకు సందేహములేదు కారాగృహవిముక్తుఁడైన యారారాజు రాణిగారి యొద్దకు వెళ్లి, మిక్కిలి కృతజ్ఞుఁడై, తలపాగాతీసి, రాణిగారి పాదములపైనుంచి ,,అపకారముఁ జేసిన నాకుఁ బ్రాణదానములిచ్చిన మీవంటి పరోపకారుల నెచ్చటఁగానను'' అని విన్నవించి, సెలవుపుచ్చుకొని తన రాజ్యమునకేగెను తరువాత నెల్లప్పుడును ఆరాజు రాణిగారి యాజ్ఞప్రకారమే ప్రవర్తింపుచుండెను

నాటూరులో గంగలేనందున రాణిగారు తమ రాజధానిని అచ్చటనుండి తీసి మూర్షిదాబాదువద్ద గంగాతీరముననున్న బడానగరమను గ్రామమునందు స్థాపించిరి ఈమె రానపుడు బడానగర మొకచిన్నగ్రామముగానుండెను, గాని యీమె యచ్చటకి వచ్చినతరువాత నా నగరము కడుగొప్పదై బడానగరమనఁగా గొప్పనగరమన్న పేరును సార్థకపరచెను

ఇఁక నీమె దినచర్యనుగుఱించి కొంతవ్రాసెదను ఈమె దినచర్య బహురమ్యముగాను, అనుకరణీయముగాను ఉన్నది ప్రాతఃకాలమందు నాలుగు గంటలకే లేచి, ఈశ్వరస్తుతిఁ జేసి, కాగడాలువేయించుకొని గంగానదికిఁబోయి స్నానముచేసి వచ్చి, పుష్పములనుగోసి, గృహదేవతను బూజించునఁట ఇంతలో సూర్యోదయము

కాఁగానే గంగాతీరమునకుఁబోయి దేవతలఁబూజించి, బాటసారులకు దానధర్మములు చేసి, పురాణశ్రవణముఁజేయును మధ్యాహ్నకాలమప్పుడు భోజనానంతరమున రాజవేషము వేసికొని రాజసభకుఁబోవును అచ్చటి యుద్యోగస్థులకు వారుచేయవలసిన పనులు నియమించి, వారుచేసిన పనులఁజూచి, తానుసభలో స్వయముగఁజేయవలసిన పనులను నిర్వహించి, తిరుగఁబురాణ శ్రవణమునకుఁ బోవును సాయంకాలమప్పుడు తిరిగి దేవతాదర్శనముచేసికొని ముఖ్యమంత్రిసభకుఁబోయి, ప్రజలవిన్నపములు, వ్యాజ్యములు మొదలైనవి విని, వానితీర్పులుచెప్పి, యిలుసేరి, దేవునిప్రార్థించి నిదురించును భవానిగారొకపూటయే భుజించుచుండిరని చెప్పెదరు రాణిభవానిగారికాలము, అప్పటి సంఘస్థితి, దృఢమైనధర్మవిశ్వాసములు, మొదలైనవానిని విచారించిచూడఁగా, రాణిభవానిగారి దినచర్య, అప్పటికాలములో నుత్తమోత్తమమైనదనియే యెవరికైన నొప్పుకొనవలసియుండును

ఇట్లు పతిభక్త, రాజ్యకర్తృత్వము, శౌర్యము, ధైర్యము, స్వదేశాభిమానము, భూతదయ, ఈశ్వరభక్తి మొదలైన యుత్తమోత్తమ సుగుణసంపదలకు వాసస్థానమైన రాణిభవానిగారు ౧౮౦౩ వ సంవత్సరమున, అనఁగా డెబ్బదితొమ్మిది సంవత్సరముల ప్రాయమున స్వర్గస్థలైరి వీరి మరణమునకయి లక్షలకొలఁది ప్రజలు దుఃఖించిరని వేరుగ వ్రాయవలయునా?

భవానిగారు ఒడ్డుపొడుగు గలిగి, మిగుల సుందరముగనుండిరి చనిపోవువఱకు నీమెశక్తితగ్గలేదట తుదవఱకు నీమె స్వయముగా వంటచేసికొని భుజించుచుండెనఁట

ఈమె రామకృష్ణుఁడను బ్రాహ్మణబాలునినొకని వానిశైశవమునుండి పెంచుచుండెను తుదకు వానికేరాజ్యముగట్టి మృతినొందెను కాని రాజారామకృష్ణుఁడు సాధువృత్తిగల వాఁడగుటచే నిప్పుడు వీరిరాజ్యమొకచిన్నజమీందారియైయున్నది

# అహల్యాభాయి హోల్కరు.

,,ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం ''

(ఉదార చరితులకు విశ్వమంతయు స్వకుటుంబమే )

ఈయద్వితీయమైన సాధ్వీమణి చరిత్రము, మనోరంజక మయ్యును హృదయ ద్రావక మైనట్టియు, ననుకంపనీయ మయ్యును అనుకరణీయమైనట్టియు, వీర రస విరహిత మయ్యును శాంతిరస పరిప్లుతమైనట్టియు మూడంకముల నాటకమని చెప్ప వచ్చును! ఈనాటకముయొక్క చాల భాగము దుఃఖరూపమైన యంధకారముతో వ్యాప్తమైయున్నను, అహల్యాభాయిగారియొక్క సద్గుణము లనుచంద్ర కిరణములచే ప్రకాశిత మైనందున రమ్యముగానే యుండును ఈమూడంకము లెవ్వియనఁగా — (౧) అహల్యాభాయిగారి జన్మమును బాల్యమును (౨) ఆమె సంసార సుఖము (౩) ఆమె వైధవ్యమును రాజ్యము చేయుటయు ఈమూడంకములలోనిసంగతులను విడి విడిగా విచారించెదము

(౧) జన్మమునుబాల్యమును—బొంబాయి ప్రాంతమునందలి అహమదు నగర మను తాలూకాలో పాథరడీయను చిన్న గ్రామము గలదు ఈగ్రామమునందుఁ బూర్వము, ఆనందరావు సిందేయన నొక మహారాష్ట్రగృహస్థుఁడు వాసము చేయుచుం డెను ఈతఁ డాగ్రామమునందుఁ బెద్దమనుష్యుఁడని పేరు వడసెను ఈతఁడు ధనవం తుఁడు గానందునఁ బొలములు దున్నుకొని జీవనముఁజేయుచుండెను అతనిభార్యయు స్వభావమునం దితనిని బోలియుండెను ఈసత్వగుణ ప్రధానులైన దంపతులకు ౧౭౩౩వ సంవత్సరమున నొక కన్యారత్నము గలిగెను ఈకన్యకు వారు అహల్యయని నామ ధేయమిడిరి ఈమెయే చరిత్రనాయికయగు అహల్యాభాయి ఈమె తరువాతఁజూపిన యసమాన సద్గుణములనుబట్టి, యీమె సామాన్యస్త్రీకాదనియు, నవతారస్త్రీయనియు మహారాష్ట్రగ్రంథకర్తలనేకులు 'దేవీ అహల్యాభాయి' యని సంబోధించియున్నారు ఈమెజగదంబయొక్క యవతారమని యిట్లొకకథ చెప్పెదరు అనేక దినములవఱకు నానందరావునకు సంతానమే లేకపోయెనఁట అప్పుడొక్కనాఁ డాయనభార్య చింతాక్రాంతురాలయియుండ వారిగృహమున నొక బైరాగి వచ్చెనఁట. ఆమెచింతయొక్క కారణమును విచారించి, ,,మీరు కోల్హాపురమునకువెళ్ళి, అచ్చటి జగదంబను సేవించిన పక్షమున మీకు సంతానముగలుగును'' అనిచెప్పి వెళ్లిపోయెనఁట.

క చోరుఁబడి గోయుగముం గొని । సరగున నే నూరువెడలి చనునంతట భూ
సుర నీవు పట్టుమనుటయు। నరుణాక్షులు మెఱయ నతఁడు నాతనికనియెన్ ౨౦౬

క పసుల మును నీవు దోలిన। మసరిన నెవ్వగల నతఁడు ముచ్చిరుచుండన్
బసలేదు నాకుఁబట్టఁగ। వెస నే మున్నరుగ నీవు వెనుచను మనినన్ ౨౦౭.

వ ఇవ్విధంబున నయ్యిరువురు నొండొరులమీఁది యాగ్రహంబున మెలపెఱుంగక రొదకొట్టునంతట నాయింటి గృహపతి మేల్కని తలవాకిటికిం జను దెంచి యర్ధరాత్ర సమయంబున వచ్చి మా వాకిటం బోరుచున్న వారెవ్వరనిన నతనికిఁ జోరరాక్షసు లిట్లనిరి ౨౦౮

ఉత్సాహ వెస నితండు నిన్నుఁబట్ట వేచివచ్చె బ్రహ్మరా
క్షసుఁ డటంచుఁ జోరుఁడనినఁ గనలి నీ పశుద్వయం
బెసఁగు వేడ్క వీఁడు వేగ నిపుడు దోలవచ్చె సా
హసికవర్యుఁ డితఁడు దొంగయంచుఁ నెప్పెఁ జెప్పినన్ ౨౦౯

గీ విని మహీసురవర్యుండు వితతమంత్ర । బలమునను బ్రహ్మరాక్షసుఁ బాఱఁదోల
నంత నటమున్న చోరుండు నరిగెఁగానఁ। బొసఁగ నహితులు దమలోనఁ బోరమేలు

క కావున శరణాగతునిం । గావందగుఁగాని చంపఁ గాదనినయెడన్
దావిని ప్రకారవర్ణుని । నీవివరము చెప్పుమనిన నేర్పున నతఁడున్ ౨౧౧

వ. వక్రనాసుండు చెప్పిన యట్లు చెప్పినవిని రక్తాక్షుండు సముద్ధితుండై మ్రొక్కి యుప మర్దున కిట్లనియె ౨౧౨

గీ దీనదశదోఁపఁ బగతుండు హీనవృత్తి । నడఁగి బలమబ్బువేళను మడఁగఁజేయు
దృష్టముగఁ గీడుచేసిన దుష్టువలని। వినయవాక్యంబులకు మెచ్చు వెట్టివాఁడు ౨౧౩

వ అని మఱియు నిట్లనియె మున్నిట్టిప్రియాలాపంబుల కలరి ౨౧౪

క ప్రేమను జారిణియగుతన । రామను శిరసావహించె రథకారుఁ డొకం
డీమహి నవివేకి యనుడు। నా మంత్రి మొగంబుచూచి యతఁ డెట్లనినన్ ౨౧౫

వ ఆతండిట్లను రథకారుని కొక్క కులకాంత గలదు దాని తెఱంగు వినుండు ౨౧౬

క నగుమొగముఁ గలికి కన్నులు । బిగిచన్నులు ననదునడుము బింబాధరమున్
జిగిదొలఁకు పదతలంబులుఁ। దగియొప్పున్ బద్మముఖికిఁ దరుణులలోనన్ ౨౧౭

క ఆపాలఁతుక పరపురుషు। వ్యాపారము సేయుచుండ నరుఁ డెఱిఁగి నిజం
బేపారఁ దెలియఁ దలఁపునఁ। గోపంబడఁచుకొని పలికెఁ గోమలితోడన్ ౨౧౮

ఉ బాలరో నన్ను రాజు పనివంపఁగఁ బోవుచునున్నవాఁడఁ బో
జాలనటంచు భృత్యునకు సందుల దాఁగఁగఁ బోలదెందు నే

నేల నృపాలుకొల్వునకు నేగతివచ్చె నవస్థయంచుఁ జిం
తాలసుఁడైన నాథునకు నంగన యిట్లనియెన్ ముదంబునన్ ౨౧౯

ఉ ఎన్నికబంటవీవు నిను నేలికపిల్చి ప్రియంబు చెప్పినన్
సన్నకుసన్నఁబోక పెఱసన్నల సాకులు పన్నుటొప్పునే
తిన్నఁదనంబుతోడఁ బనిదీర్చుకవచ్చి సుఖింతుగాని పో
కున్న నృపాలుఁ డుగ్రుఁ డదయుండు చలంబున నేమిసేయునో ౨౨౦

వ అని ససంభ్రమంబును సకౌతుకంబునుంగా నమ్మగువ యతని మజ్జన భోజనాదులం
బరితృప్తుంజేసి తాంబూలంబిచ్చి సెజ్జకుఁదార్చి యిట్లనియె ౨౨౧

క తడవోర్వవు ప్రాణంబులు। దడసి నినుంబాసి నాకుఁ దప్పదునీకున్
బడఁతుక లచ్చటఁ గలరని। తడవుచురాకున్న విడుతుఁ దనువు నిజేశా ౨౨౨

గీ అనుచుఁ గందర్పసంక్రీడ నాత్మనాథు। నుల్లమలరంగ నేర్పుల నోలలార్చి
చలిదియును సంబడంబును జాలనొసఁగి। ప్రొద్దుగ్రుంకెడునంతన పుచ్చె నతని

క పుచ్చి యుపనాథుఁ బిలువం। బుచ్చి యుదకమాడఁబోవఁ బోవకమగుడన్
వచ్చి యిలుచొచ్చి సూతుం। డచ్చటి మంచంబుక్రింద నడఁగినవేళన్ ౨౨౪

వ పదంపడి యక్కాంతయు ౨౨౫

చ ఒడలికినాడి సన్నమణుఁ గొప్పఁగఁగట్టి సుగంధమంతిటం
బొడవడకుండ మేన నెగపూఁతగఁబూసి వినీలకేశముల్
ముడివడకుండఁదీర్చి విరులుం గురువేరుఁ గదంబుకంబుగాఁ
బొడవుగఁ గొప్పువెట్టి మణిభూషణముల్ ధరియించె వేడుకన్ ౨౨౬

గీ ఇవ్విధంబునఁ గైసేసియిందువదన। దీప్తులడరంగ నద్దంబు తెచ్చిచూచి
తనముఖావయవంబులు తానెమెచ్చి। సుదతి యుపకాంతున కెదురుచూచుచుండె

వ అయ్యవసరంబున నుపనాథుండును నతిసంభ్రమంబున నలంకరించుకొని దూతి
కానుగమ్యమానుండై పద్మముఖి మందిరంబునఁ బ్రవేశించి పర్యంకంబు నందుఁ
గూర్చుండియుండె ౨౨౭

క ఆసమయంబునఁ బుష్పశ। రాసను సామ్రాజ్య లక్ష్మియన శృంగారో
ద్భాసితయై నిజ పర్యం। కాసనమునఁగాంతఁ జారునల్లనచేరెన్ ౨౨౮

వ ఇట్లుచేరిన కాంతాతిలకంబునకుం గదిసి యతండిట్లనియె ౨౩౦

ఉ ఎప్పుడుపిల్చుఁ బద్మముఖి యెప్పుడు దానిప్రియుండు వోవున
న్నెప్పుడుగారవించుఁ గమలేక్షణయంచు నహర్నిశంబు నే

నెప్పుడుఁ గోరుచుండుదు మహిం దలపోయఁగ నేను ధన్యుఁడన్
జెప్పఁగ నేల నన్నిపుడు శీఘ్రము రమ్మని పిల్వఁబంచుటన్ ౨౩౧

క. అని మఱియుఁ బ్రియము చెప్పుచు। ఘనపరిరంభంబు చేసి కాంతయు నతఁడున్
మనసిజ సంక్రీడలమై। ననుపమ శయ్యాతలంబునం దున్నయెడన్ ౨౩౨

గీ. మగువ కాలు చాప మగనిఁ దాఁకుటయును। నతివ యాత్మలోన నది యెఱింగి
వీఁడు మగఁడు గాని వింతవాఁ డెవ్వఁడు। గాఁడటంచుఁ గాంత కళవళించి ౨౩౩.

వ. విచారించు సమయంబునం గూటమితమకంబున నమ్మగువ యభిప్రాయం బెఱుంగమిం
జేసి పరపురుషుండు దానికిట్లనియె ౨౩౪

గీ. నాకు వలతొ మున్ను చేకొన్న మగనికి। వలతొ నిజము చెప్పవలయుఁ దెలియ
నోసి చెప్పకున్నఁ గోసెదఁ జూ ముక్కు। చెవులు ననిన వాని కువిదయనియె ౨౩౫

ఉ. ఓరి దురాత్మ నీవును బ్రియుండవె నాహృదయేశు కాలిపై
గోరును బోలవీవు నసగూఁటఁగదుర్ జపలస్వభావలై
నారులు రూపయౌవనమున న్నిలుపోపక యివ్వలవ్వలన్
జారహితంబుసేయ విభుచక్కటి మోహము మాననేర్తురే ౨౩౬

వ. అదియునుంగాక ౨౩౭

సీ. మగఁడు దైవంబని మదిఁదలంచిన యట్టిమగువ పుణ్యాంగన మగువలందు
విభుఁడు శరీరంబు విడిచిపోయెడివేళ నగ్నిముఖంబున నరుగుఁగాక
తరుణి యుండఁగలేక తగని కార్యమొకటి నేరక చేసిన నియుడుకొనుచు
సతిలేని ధర్మంబు పతికి నేయెడలేదు పతి వెలిగాలేదు సతికి మేలు
గానసతియుఁ బతియుఁ గలకాలమెల్లను। దోడునీడగాఁగఁ దొలఁగరనిన
శయ్యక్రిందనుండి సంతోషమున రథ। కారుఁ డద్భుతంబు గ్రమ్ముమదిని ౨౩౮

వ. ఇట్లని తలంచె. ౨౩౯

గీ. మిగులఁ బక్షమైన మెలఁతుక యొకనాఁడు। ప్రియము పుట్టి యొకనిఁ బిలిచె నేని
నేమిదప్పెననుచు నెంతయు ముదమంది। యలుకవిడిచియున్న యవసరమున ౨౪౦

క. పరపురుషుండును దరుణియు। సురతశ్రమ పారవశ్య సుఖసుప్తిమెయిం
గరచరణంబులు పెనఁగొనఁ। బరిరంభణకేళి నున్న భావించి మదిన్ ౨౪౧

ఉ. ఆరథకారుఁడల్లన నిజాంగనఁ దెల్పినఁ గన్నువిచ్చి యా
సారసనేత్ర యిట్లనియెఁ జయ్యన నీవు తొలంగు మంతకా
కారుఁడు వీఁడు మేల్కనిన గ్రక్కున నిన్నును నన్నుఁ జంపు ము
న్నారసి వీఁడెపట్టిన భయంబునఁ బోవక చిక్కియుండితిన్ ౨౪౨

గీ. అనిన దాని నాథుఁ డటఁ జూసి తొలఁగిన । నొద్ద నిదురపోవు చున్న విటునిఁ
దలుప వెఱచి తాను దెలియక నిద్రించు । మగువఁ గాంచి యపుడు మగఁడు కినిసి

క. ఆమంచము తలనిడుకొని । ప్రేమంబునఁ బెద్దవీధిఁ బెట్టిన జారుం
డా మగువఁ బాసి తొలఁగిన । నేమియునన కతివఁ గొనుచు నింటికిఁ జనియెన్

వ. కావునఁ బ్రత్యక్ష ద్రోహంబు చేసినవానిం జూచియైన నవివేక మంచిమాటలకుం జొక్కి మోసపోవునని పెక్కు భంగుల రక్తాక్షుండు చెప్పిన నతనిమాట లవధరింపక యాచిరంజీవిం దోడ్కొని నిజనివాసంబునకుం జని యతని నత్యంత గౌరవంబునం గొలిపించుకొని యున్న సమయంబున నచిరకాలంబునకు నొక్కనాఁ డుపమర్దుండు సకల భృత్యామాత్య నివహంబుతోడం గొలువున్న సమయంబునఁ జిరంజీవి చనుదెంచి యతనికి మ్రొక్కి యిట్లనియె ౨౮౫.

ఉ. నీపగవానిముందటను నీగుణముల్ గొనియాడఁ గోపసం
తాపపరీతచిత్తుఁడయి దండితుఁ జేసెను నన్నుఁ బ్రాణముల్
తీపని యుండనొల్ల సడి తెచ్చిన యీబ్రతుకేల యగ్నిలో
నేపునఁ జొచ్చి దేహము దహించెద నడ్డము రాకుఁ డెవ్వరున్ ౨౮౬

క. తినయేలిక ముదలకొనక । గొనకొని ప్రాణంబు విడువఁ గొఱగాదనినన్
విని రక్తాక్షుఁడు వానిం । గనుఁగొని యిట్లనియె మనసుగనుఁగొను బుద్ధిన్ ౨౮౭

గీ. చచ్చి యేమి సేయు దిచ్చట నీవన్న । నతఁడు దా నులూకమగుచుఁ బుట్టి
కాకకులము నెల్ల గ్రక్కునఁ జంపుదు । గాలి వోవకుండఁ గాంక్ష దీఱ ౨౮౮

వ. అనిన విని రక్తాక్షుం డవ్విధంబు సేయ నీకు సాధ్యంబుగా దెట్లనినఁ దొల్లి యొక్క మూషకంబు సూర్యానిల దేవేంద్ర మేరుపర్వతంబులు దనకుఁ బ్రత్యక్షంబులైనను నెప్పటి రూపంబు నె పొందెఁ గాని యుత్కృష్ట జన్మంబు నొంద నేరదయ్యె ననినఁ జిరంజీవి తత్కథాక్రమం బెట్టిదనిన రక్తాక్షుం డిట్లనియె ౨౮౯

సీ. మునివరుఁ డొకరుండు ముఖ్యతీర్థము లెల్ల నాడి భాగీరథి కరిగి యందు
నవగాహనము చేసి యాదిత్యుఁ డుదయించుతఱి నర్ఘ్యజలము హస్తములఁ బట్ట
నయ్యవసరమున నాకాశవీధిగా నొక డేగ యెలుకఁ బట్టుకొని చనఁగ
నాయెల్క విడివడి యమ్మహీసురుచేతి యర్ఘ్యజలంబులయందుఁ బడిన
నతఁడు గనుఁగొని కౌతుకాయత్త చిత్తుఁ । డగుచు నమ్మూషికమ్ము మీఁద నిగుడు కరుణఁ
గన్యయగుఁ గాక యనుటయుఁ గాంత యయ్యె । దానిఁ దనభార్యచేతి కమ్మానియొసఁగ

క. ఆరామయుఁ దనకన్నకు । మారికకంటెను గరంబు మక్కువ మెఱయన్
గారామునఁ బెనుపఁగ న । న్నారీరత్నంబు యౌవనప్రాయమునన్ ౨౯౧

వ. అతి మనోహరాకారయైన యక్కన్యకం గనుంగొని యొక్కనాఁ డమ్మునీశ్వరుండు మనంబున నిట్లు విచారించె ౨౫౨

క. ఈకన్నియఁ దగువరునకు । నీకున్న రజస్వలయయి యిది వృషలియగున్
బ్రాకట నిందాపాత్ర । వ్యాకులయగుననుచుఁ దన మహత్త్వము పేర్మిన్ ౨౫౩

క. త్రిభువనదీపకుఁ డగునా । నభోమణిఁ దలఁచిన వేగ నమ్ముని ప్రేమోలన్
శుభమూర్తి వచ్చినిలిచిన । నభివందన మాచరించి యతఁ డిట్లనియెన్ ౨౫౪

క. ఈరూపవతికి మర్త్యులు । గారని నిలిపితిని భాగ్యఁగాఁ గైకొనుమీ
కోరిక నాకిదియనుటయు । నారవి విని యపుడు వేడ్క నాతని కనియెన్ ౨౫౫

ఉ. ఏణవిలోలనేత్ర వరియింప మహాబలుఁడైన యాజగ
త్ప్రాణుఁడు గాని కాఁ డతనిఁ బ్రార్థనసేయుము నన్ను మీఱు న
క్షీణవిభూతి నాతఁ డని చెప్పి దివాకరుఁ డేగినన్ దప
స్త్రాణపరాయణత్వమునఁ దాపసుఁ డయ్యనిలుం దలంచినన్ ౨౫౬

చ. తలఁచిన నా సమీరుఁడును దత్పరతం బొడచూపి నిల్చినన్
దళితసరోజనేత్ర యిది నాకుఁ దనూభవ నీకుఁ బత్నిగా
నొలసి పరిగ్రహింపుమని యుగ్మలిఁ జూప మునీంద్రుఁ జూచి హా
సలలితవక్త్రుఁడై మృదువచస్సులతోఁ బవమానుఁ డిట్లనున్ ౨౫౭

ఉ. నాకధికుండు దేవపతి నాతుక నాయన కిచ్చినన్ దగుం
గాక మహేంద్రుఁడైనతనిఁ గాదని యన్యుల కిచ్చు టర్హమే
నాకనివాససౌఖ్యసుమనస్సరసీరుహలోచనాశిర
శ్శ్రీకరపాదపద్మ యయి చెన్నెసలారుచు నుండు టొప్పదే ౨౫౮

వ. అని యిట్లు వాయుదేవుం డమ్మునీంద్రు నొడంబడం బలికి యతని చేత ననుజ్ఞాతుండై నిజేచ్ఛం జనియెఁ దదనంతరంబ యమ్మునీంద్రుం డింద్రు నారాధించి తలంచిన నతండును జనుదెంచి పొడచూపి నిలిచి నన్నుఁ దలంచిన కారణంబేమియని యడిగిన నయ్యింద్రునకు నమ్మునీంద్రుం డిట్లనియె ౨౫౯

చ. అతులతపస్సమాధినియతాత్ములు నధ్వరకర్తలున్ దృఢ
వ్రతులును దానశూరులును వాసవునిన్ బొడగాననేర ర
ద్భుతము దలంచినంత ప్రథపుచ్చక నన్నుఁ గృతార్థుఁ జేయ వ
చ్చితి మునికోటిలోపలఁ బ్రసిద్ధుఁడ నైతిఁ ద్రిలోకనాయకా ౨౬౦

వ. అని మఱియు ననేకప్రకారంబులఁ బ్రస్తుతింపఁ బ్రసన్నముఖుండైన శతమఖున కతం డిట్లనియె ౨౬౧

సీ కలికిచూపులకాంతిఁ గలువతోరణములు పచరించినట్లున్న బాలఁజూడు
మెఱుఁగుఁజెక్కిళ్లను మించుటద్దంబులఁ జూపెడు నీకు నీసుదతిఁజూడు
గురుకుచంబులు పూర్ణకుంభంబులను బోలె నిలిపినట్లున్న యీ నెలఁతఁజూడు
చిఱునవ్వు వెన్నెల శీతలామృతమట్లు చిలుకుచున్న యీ చెలువఁజూడు
నమరవల్లభ నీకైన నమరుఁగాని । నర సురాసుర యక్ష కిన్నర వరులకు
నీడుగాదని నిలిపితి నీమృగాక్షిఁ। గోర్కి నిగుడంగ దీనిఁ జేకొందుఁగాక ౨౬౨

వ అని యిట్లు మహేంద్రునకు నన్నారీరత్నంబుపయింబ్రియంబు పుట్టంబల్కిన తపస్విం గనుంగొని దాని జన్మప్రకారంబును మునీంద్రునకుం గలిగినవాత్సల్యంబును నెఱింగినవాఁడై నవ్వుచు మునీంద్రునకు నింద్రుండిట్లనియె ౨౬౩

చ. సురుచిరరత్నసానువుల శుద్ధసువర్ణమహోన్నతాయత
స్ఫురదురుశృంగసంఘముల సూర్యసుధాకరతారకానిరం
తరపరివర్తనంబుల గదాధరపద్మభవాదిదేవతా
పరిచితమాళిభాగములఁ బ్రస్తుతికెక్కి వెలుంగు నెంతయున్ ౨౬౪

ఉ మేరుమహామహీధరము మీకునుమాకును బెద్దగావునన్
వారిరుహాక్షి నగ్గిరి కవశ్యమునిచ్చుట మేలు కాంతకుం
గోరిక వల్లభుండు ధనికుండును సత్వయుతుండును గాఁగ మే
లారసి కాంచనాద్రికిఁ బ్రియంబున నిమ్మని యింద్రుఁడేగినన్ ౨౬౫

వ అమ్మునీంద్రుండు తనమనంబున ౨౬౬

గీ పిలిచి యీఁబోవ నెవ్వారు దొలఁగనాడి। పడుచు నొల్లమి లోకంబుపాడి గాదె
భాస్కరానిలస్వర్గ్లోకపతులు దగిన । యొరవు చెప్పిరిగాని తారొల్లరైరి ౨౬౭

వ ఒల్లకున్న నేమి యగునని మహామేరువుం దలంచిన నమ్మహీధరంబును నత్యంత సుకుమారత్వంబును ధరియించి యాతని ముందటనిల్చినం గన్గొని యర్ఘ్యాసత్కారంబులఁ బరితుష్టుంజేసి మునీంద్రుం డిట్లనియె ౨౬౮ ,

సీ ఎవ్వరికి నీక నీకు నే నిత్తుననుచు । నింతగాఁ బెంచినాఁడ నీయిందువదన
నింపు సొంపార నీవు మాయింటనిపుడు । వియ్య మొందంగవలయు నుర్వీధరేంద్ర

వ అన నమ్మహీధరం బిట్లనియె ౨౭౦

గీ చూడ సూక్ష్మంబుగాని నాసొబగుమేను । ఘాతగొని పెక్కులాగలుగాఁగఁద్రవ్వఁ
గాన నాకంటె నధికమై ఘనతఁబేర్చు। వేషధారిణియైన యమ్మూషికంబు ౨౭౧

ఉ కావున నీకుమారికకుఁ గాంతుఁడు మూషకమైన నొప్పెఁగా
కీవగగాఁగ నల్పులకు నిచ్చుట నీకది బుద్ధిగాదు నన్
బోవఁగ నంపుమంచు మునిపుంగవు వీడ్కొని మేరువేగినన్
దేవసమానవిప్రునకు దీని నొసంగెదనంచు వేడ్కతోన్ ౨౭౨

క మునిపుణ్యాశ్రమభూములు। వనితం గొని తిరిగి తిరిగి వరియింపుఁడటం
చును విప్రవరుల నడిగినఁ। గనుఁగొని వారధికబోధకలితాత్మకులై ౨౨౩

గీ ఇంత చక్కని తరుణి మహీసురులకు। నమర నేర్చునె రాజులకైనఁ గాక
చెలువ నేమొల్ల మనఘు విచ్చేయుమనిన। నతఁడు గడులజ్జ నింటికి నరుగుదెంచి

క ఇది దాఁగన్యాత్వంబున। ముదిసినఁ గడుధర్మహాని మున్నిటిరూపం
బొదవంగ మూషికంబై। వదలక చరియించుఁ గాక వసుమతి నెందున్ ౨౨౪

క అని పలుక నపుడు మూషిక। తనువునఁ దన క్రోలనున్న దానిని ఖేదం
బున నొక పురుష మూషిక। మున కంటఁగఁ గట్టి రెంటి మునివరుఁ డనిపెన్

వ అట్లు గావున. ౨౨౫

తరల ఇన సమీరణ దేవతాధిప హేమశైలము లాదిగాఁ
దనకు సన్నిధి చేసె నేనియు దానిమూషికజన్మము
న్వినుము మాఱఁగ నేరదయ్యెను నీకు నట్టిద మాకులం
బున జనించుటనంగ నాతఁడు పొంకమింక నడంగినన్ ౨౨౬

వ అంతట నుపమర్దుండును జిరంజీవిఁ జేరంబిలిచి యభయంబిచ్చి వెఱవ కుండుమని
వీడ్కొల్పినఁ గొంతకాలంబుండి దుర్గస్థానమర్మంబు లెఱింగి యాచిరంజీవి యొక్క
నాఁడు దనలో నిట్లని తలంచె. ౨౨౭

క అరులకుఁగల సత్వంబును। దెరువులు నునికియును వారు ద్రిమ్మరుతావుల్
గిరిదుర్గము సాధించెడు। వెరవును నెఱింగితిని నాకు వేళగుఁ జెలుపన్ ౨౩౦.

గీ అని విచారించి గుహచుట్టు నరయఁ దొల్లి। యాలమందలయునికిపట్టగుటఁ జేసి
కుప్పలైయున్న యొరువెల్లఁ గొక్కరించి। చరణముల సన్నతెరువుల సరపిఁబఱచి

వ తిరిగి పెద్దవాకిటవచ్చి యులూకంబులఁ జూచునప్పు డవి రాత్రి దూరదేశంబులఁ
బరిభ్రమించి మేసివచ్చి యలసిసూర్యోదయ సమయంబున మేనెఱుంగక యుండొంటి
పయింబడి నిద్రింపఁ జూచి తలయూఁచి చిరంజీవి తనలో నిట్లనియె •౨౩౨

ఉ. నమ్మినవారిఁ జంపినను నాకు నధర్మముగాదు లెస్సగా
నమ్మక చంపరాదు రిపు నన్ను.నిజంబుగ నాత్మభృత్యుఁగా
నమ్మినదోష మెవ్విధమునం దగఁ బొందె విచార మేటికిన్
నమ్మిన నానిజేశునకు నాదు హితంబెఱిఁగింతు నెంతయున్ ౨౩౩

ఉ ఏపని చేయుమంచుఁ దనయేలిక సేవకుఁబంచెఁ బొందుగా
నాపని దీర్చివచ్చుటయ యాతనికిం దగుధర్మ మిట్టిచోఁ
బాపము పుణ్యమున్ విభునిపాలగు భృత్యుని కేమిగారణం
బేపున మేఘవర్ణునకు నీసమయం బెఱిఁగింపఁ బొందగున్ ౨౩౪

సీ. అని నిశ్చయింపుచు నతివేగమునఁ జని యేలికఁ గాంచి కేలెత్తి మ్రొక్కి
మనపగ సాధింప ననువైనకాలంబు తటిగాంచి వచ్చితిఁ ద్వరితముగను
వెనుక నత్తెఱఁగెల్ల విన్నవించెదఁ గాని మీరు వారన కెల్లవారిచేతఁ
గాష్ఠతృణంబులు గఱచితే నియమింపుమని తాను మండుచున్నట్టి కొఱవి
మెఱసి నేర్పున ముక్కునఁ గఱచిపట్టి । కడలఁ దృణకాష్ఠములు గొంచుఁ గాకకులము
మేఘవర్ణునివెనుక నమిత్రతతిని । గెలుచువేడుక నడుపీథిఁ జెలఁగిపఱవ ౨౦౫

క. ఘూకంబులున్న గుహకును । వాకటఁ గాష్ఠములఁ దృణము నడ్డిఁ గప్పింపన్
వేకవిసి చిరంజీవియుఁ । దాకొనఁ దనముక్కుకొఱవిఁ దగిలించివడిన్ ౨౦౬

వ. తనదు పక్షానిలంబునం జేసి యయ్యనలంబు నిగుడం జేసిన ౨౦౭.

శా. ధూమజ్వాలలతోడివహ్ని గుహలో దూఱంగ నయ్యండజ
స్తోమంబుల్ భయసంభ్రమంబు లడరం దూరంబుగాఁ బాఱఁ ద
త్సీమాసంభ్రమ లెందులేకునికి నారింబొంది యచ్చో నిజ
స్వామిం జేరి యచేతనంబులగుచుం జావంగవీక్షింపుచున్ ౨౦౮

వ. రక్షాత్ముం డుపకర్ణున కిట్లనియె ౨౦౯

క. తెగిచంపరాదు గాకముఁ । దగవని దుర్జ్ఞాతు లపుడు దలకొల్పఁగ నీ
దగుమంత్రులు నీవును నీ । పగిదిం బడవలసె నిట్టిపాపముగంటే ౨౧౦

క. హితుఁడైన మంత్రి పలుకులు । మతి ననుమానించివినని మానవపతి యీ
గతి దుర్దశలం బొందును । సుతసోదరబంధుమిత్రసుదతులతోడన్ ౨౧౧

వ. అనినవిని యుపమర్దుం డిట్లనియె ౨౧౨

గీ. విను మధర్మమైనపని ధర్మమనితోఁచుఁ । గాని తెరువు తెరువుగాఁ దలంచు
శత్రు మిత్రుఁగాను మిత్రు శత్రునిగాను । గాంచు నరుఁడు చేటుగాలమునను ౨౧౩

ఉ. కావున నాకుఁ బథ్యమగు కార్యముగాఁ గడునొత్తి యమ్మెయిన్
నీవు హితంబుచెప్ప విననేరక దుర్నయశీలినై చిరం
జీవిఁ బరిగ్రహించి జముఁజేర నుపాయముచేసికొంటి నే
దైవికమైన చేఁతకును దప్పు నుపాయము లొందఁగల్గునే ౨౧౪

మ. ఒకయక్షౌహిణితోడఁ బాండవబలం బున్న న్నిశామధ్యవే
ళను ద్రోణాత్మజుఁ డొక్కఁడుం గదిసి లీలన్ సంహరింపంగ ను
త్సుకతన్ మాన్పఁగఁ జాలెనే హరియు నచ్చోనుండి సర్వంబు దై
వికమంచున్ దెలియంగలేక విధిపై ద్వేషించినం దప్పునే ౨౧౫

గీ. అని యూరకుండు నంతట । ననలశిఖాసమితిచేత నన్నియు సమయం
గనుఁగొనుచు వాయసంబులు । పనివడి గుహఁజొచ్చి చూచి పరమప్రీతిన్ ౨౧౬

క అవి యుపమర్దను నంగము । లివి యారక్తాక్ష ముఖ్య హితమంత్రిసుహృ
న్నివహముల తనువు లనుచును। వివరించి యులూకసమితి వెడలి కడంకన్ ౨౯౮

గీ అపుడు మేఘవర్ణాది వాయసకులంబు। పౌరిఁ జిరంజీవిఁ బొగడుచుఁ బోయి నిజని
వాసమున నంచితోన్నత వైభవమున । మేఘవర్ణుండు కొలువున మెఱయుచుండె.

వ. చిరంజీవి నాలోకించి నీ విన్ని దినంబులు శాత్రవజనంబులు నమ్మునట్లుగా నెవ్విధం
బునం గొలిచి తిరిగితివనిన నతం డిట్లనియె ౨౯౯

గీ సకలదిక్కుల రాజుల శౌర్యమహిమ । గెలిచి తనుఁగొల్చు తమ్ములు గలుగునట్టి
పాండవాగ్రజుఁ డనువు గాకుండునట్టి । వేళ హీనుఁడై కొలువఁడె విరటునగర

సీ కాషాయ దండంబు గైకొని యమసూతి కంకుభట్టను నామకంబు దాల్చె
నడబాలతనమున నధముఁడై పావని వలలుండు నాఁగ నవ్వలన నిలిచె
నటవేషమున నింద్రనందనుఁ డొకయేఁడు పేడితనంబునఁ బెంపుదొఱఁగె
హయశిక్షకుండయి యాలగాపరియునై మాద్రేయులుండిరి మహిమదొలఁగి
కృష్ణ సౌభాగ్యరేఖ నుత్కృష్టయయ్యు । నిలిచె సైరంధ్రియను పేర నీచవృత్తి
బలపరాక్రమ వంతులౌ పతులఁగలిగి । బ్రతుకరావారు మగుడంగఁ బక్షినాథ

క ఏనును నవ్విధమునఁ గడు । హీనదశం బగరఁగొలిచి యీడేర్చితి నీ
దైన మహాకార్యమును । స్వాన్తమున నెపుడు నిలిపి మహితవిచారా ౩౦౨

వ అనిన మేఘవర్ణుండు చిరంజీవి కిట్లనియె ౩౦౩

క నీ వసిధారావ్రతమున । నావంతయు శంకలేక యహితులలోనన్
జీవచెడ కెట్లుమెలఁగితి। నావుడు నాతండు పక్షినాథున కనియెన్. ౩౦౪

సీ అవధరింపుం డులూకాధీశమంత్రులలోన రక్తాక్షుఁ డనూనవిభవ
సంపన్నుఁడును నయశాస్త్రవిదుండును సజ్జన ప్రియుఁడును సాధుహితుఁడు
విక్రమోదగ్రుండు నక్రూరచరితుండు నగుచు సర్వజనంబు పొగడుచుండ
బుద్ధిబలంబునఁ బూజ్యుండు నాకంటె నతఁ డుపమర్దుతో నర్థి నెపుడు
నన్నుఁ జంప బుద్ధులెన్ని యేనియుఁ జెప్ప । వినయమున నులూకవిభుఁడు వినక
మఱియుఁ దనకుఁ గలుగు మంత్రులతో నాడు। మతమునడుగ నొక్కమాటగాఁగ

క శరణాగతులం జంపెడు । పురుషుల నెప్పాటఁగానమును వినమును సు
స్థిరధర్మనిర్మలుఁడవై । పరమకృపం గావు వీనిఁ బక్షికులేంద్రా ౩౦౬

వ అనిన వారి వచనంబు లవలంబించి రక్తాక్షు పలుకు లనాదరంబుచేసి నన్నుఁ దో
డ్కొని పోయి కొలిపించుకొని యతం డింత దెచ్చుకొనియె నని యుపమర్దు
వృత్తాంతం బంతయుం జెప్పి చిరంజీవి వెండియు నిట్లనియె ౩౦౭.

క. పగవాని పక్షమున వాఁ । డగపడినం గాచెనేని నత్యాసన్నుం
డుగ మెలపఁదగదు మెలపినఁ । దెగు నుపమర్దుండు పోలె ధీరహితుండై ౩౦౮

గీ. అరులవద్దనుండి యరుదెంచి కొల్చిన । భటుఁడుఁ బాము నొక్క భంగి గాన
మోసపుచ్చి చెఱుచు నాసన్నుఁడౌ వాని । నమ్మినట్లయుండి నమ్మఁదగదు ౩౦౯

వ. అని చెప్పి మఱియును ౩౧౦

సీ. జలకమాడెడువేళ సరసాన్నపానంబు లింపైనయవి భుజియించుతఱిని
కామినీసంభోగకాలంబులెడ మృగయావినోదంబుల కరుగుపట్ల
విమతులపై దండు వెడలుచో నటపోయి విడియుచు నిద్రించు వేళలందు
నాస్థానమునఁ గొలువైయున్న యప్పుడు నారామకేళీవిహారములను
నృపుఁడు దేహంబు సంరక్ష నియతిఁ జేయఁ । దగును ధర్మార్థకామ సాధనము గాఁగ
మనుజనాయకుఁ డించుకేమఱియెనేని । చెడుట సహజంబు నయశాస్త్రసిద్ధమతము

సీ. దుర్మంత్రి నేలినతోడనే చెడు రాజు చెడు నపథ్యంబులు చేసి రోగి
కలిమికి గర్వించి కలవాఁడు చెడు వేగ లోలుఁడు చెడుఁ బరస్త్రీలవలన
బుద్ధి చాలకయుండు పురుషుచేఁ జెడుఁ గీర్తి నడపడి గొఱగామిఁ జెడును మైత్రి
చెడు ననాచారిచేఁ జెందిన కులమెల్ల నర్థలోభమునఁ బుణ్యంబు చెడును
వింతభంగి దుర్వ్యసనికి విద్య చెడును । జెడు సుఖంబు పరాధీన సేవకునకు
నాజ్ఞ పాలింపఁ గొఱగాని యధిపుఁడేలు । మండలంబెల్లఁ జెడు మాటమాత్రలోన

సీ. శుష్కకాష్ఠంబుల సోఁకున నగ్నియు నతిమూర్ఖువలనఁ గ్రోధానలంబుఁ
జపలునివలన దోషంబును మగువలవలనఁ గామోద్రేక వర్ధనంబు
దక్షునివలన నుదాత్తధనంబును దయగలవారిచే ధర్మములును
మహితాత్మువలనను మహితధైర్యంబును మనుజేంద్రువలన భూమండలంబు
నంతకంతకు నభివృద్ధి నందునట్లు । విశ్రుతోద్యోగ నిజధైర్య విక్రమముల
నతిసమర్థుఁడవగుట నీ వరులగెలిచి । యసమ జయలక్ష్మిఁ గొంటి వాయసకులేంద్ర

వ. అని మఱియును ౩౧౪

ఉ. మూపున మోసియైన రిపుమూర్తిఁ జెడం దఱివేచి యుండఁగా
నోపుట లెస్స బుద్ధియుతుఁ డోపికగల్గి చలంబువట్టి ము
న్నేపునఁ జేరి కృష్ణభుజగేంద్రుఁడు కప్పలమోచి యన్నిటిన్
రూపుచెడన్ వధించెనని రూఢిగ వింటిమిగాదె యేర్పడన్ ౩౧౫

వ. అనిన మేఘవర్ణుం డక్కథ వినవలతుం జెప్పుమనినఁ జిరంజీవి యిట్లనియె ౩౧౬

గీ. మందవిషుఁ డనుపేరిటఁ బొందుపడిన । యురగ మిట్టట్టు నాఁకటఁ దిరుగుచుండి
కాంచె మండూకగణసమాక్రాంతకలిత । జీవనంబగు నొక సరోవరంబు ౩౧౭

క. కని యక్కొలని సమీపం । బునకుఁ జేరఁగ నరిగి భోగివిభుఁడు గ్ర
క్కున జలపాదుం డనియెడు । ఘనభేకముఁ గాంచి దైన్యకంపితుఁ డగుచున్
వ. ఎలుంగు కుత్తుకందగుల హీనస్వరంబున నిట్లనియె ౩౧౯
క. నాకడుపుకొఱకు దైవం । బీకార్పణ్యంబు దెచ్చె నెవ్వరి నడుగం
బోకుండిటు గతికాలము । మీకిదె భృత్యుండ నగుచు మెలఁగఁగ వలసెన్ ౩౨౦
వ. అనుటయు నమ్మండూకాధీశ్వరుండగు జలపాదుండు మమ్ము నిప్పు డాశ్రయించు
టకుఁ గతంబేమియని యడిగిన నమ్మందవిషుం డిట్లనియె ౩౨౧
సీ. అర్ధరాత్రపువేళ నాఁకొని డస్సి నే నెరవునై యిట్టట్టు దిరుగుచుండ
నవనీసురాన్వయు నర్భకుఁ డొక్కరుం డాచమనార్థమై యరుగుదెంచి
కానక నామేను కడుపడిఁ ద్రొక్కిన నత్యుగ్రభంగి నే నతనిఁ గఱవ
విషమెక్కి మూర్ఛిల్లి వేగ నన్ బొడగాంచి పిన్నపాపనితండ్రి భీతిమిగుల
మంత్రవాదులఁ గొనివచ్చి మందులొసఁగి । యతని బ్రతికించుకొని నన్ను నాత్మఁ దలఁచి
యద్భుతోత్పన్న కోపారుణాక్షుఁ డగుచు । బాంధవులఁ జూచి యిట్లనె బ్రాహ్మణుండు
క. పసిపాపఁ డనక నాసుతుఁ । గసుమాళపుఁ జెడుగుఁ బురుగు కఱచెను దీనన్
ముసుఁగువడు పాపమున నది । దెసలం జరియించుఁ గాత దీనత తోడన్ ౩౨౩.
వ. అని యతం డంతయు నలుక వొడమిన వెండియు ౩౨౪
ఉ. కప్పల మోచిమోచి కడగానక వానిన కొల్చి యాఁకటన్
గప్పిన నెవ్వగన్ వనరఁగా నవిచూచి కృపాకటాక్షముల్
చొప్పడు గ్రాసమిచ్చి తమలో నొకఁడై చరియించు వానిఁగా
నెప్పుడు నాత్మలం దలఁప నీభుజగం బటులుండుఁగావుతన్ ౩౨౫
గీ. సుతుఁడు చచ్చెనేని సుతునితోడ నెకూడ । నరుగునట్లుగాఁగ నహి శపింతుఁ
జావఁడయ్యెఁ గానఁ జావని మనసట్టి । సుగ్గయై చరించు నొరుమాలి ౩౨౬
వ. అని యిట్లు ఘోరంబుగా శపియించిన నమ్మహీసురవరు నిష్ఠురాలాపంబులు నాకుఁ
గర్ణశూలంబులుగాఁ దత్సమీప వల్మీక గతుండనై యాకర్ణించి మదాత్మగతంబున
గీ. అశనిహతుఁడైన శూలవిద్ధాంగుఁడైనఁ । బడక యొకచోటఁ గొఱసప్పి బ్రతుకుఁగాని
విప్రశాపాగ్ని తోడరిన వికృతిఁ బొంద । కుండ బ్రతుకుజంతువులు లే వుర్విమీఁద
తరల. అను విచారము నామదిం గడునగ్గలంబుగఁ బర్వినన్
విను మహీసుర శాపభీతిని నీవదిక్కని చేరితిన్
గనికరంబున నన్నుఁ గైకొని గ్రాసమొక్కొక పూఁటగా
నను భరించిన నీకుఁ గీర్తివినాశ మెప్పుడుఁ గల్గునే ౩౨౯
వ. అని మఱియును 330

శా. మామీపెద్దలు బుద్ధిచాలమిఁ గడున్ మైత్రిన్ సుఖామోఘ వి
శ్రామంబుల్ నడపంగనొల్లక వృథా క్రౌర్యంబు నాటించి తా
రేమేలుం గనలేక పోయి రిదిదా నేకార్యమూహింపుమా
యేమున్ మీరునుఁ బాయకుండఁ దగుఁగా నెల్లప్పుడుం జూడఁగన్ ౩౩౧

ఉ. ఉండిన నూరకుండుదునె యొక్కఁడుఁ డీపనిచేయనోపఁ డీ
తండనుచుం దలంపకు నిధానమువంటి నినుం బ్రధానులన్
మండితనుస్తకాగ్రముల నాదగువీపున మోచి యాడెదన్
మండెడు దీపనానలము మాన్పఁగ భారము మీదిగాదొకో ౩౩౨

వ. అనినం బ్రమోదాయత్త చిత్తుండై జలపాదుం డలవు మిగులఁ బుటమెగసి ఫణిపతి శిరంబులపయిం బ్రవేశించి తత్ఫణామణి మరీచులఁ దన మొగంబు ప్రతిబింబంబు గానఁబడం జూచుచుండె నతని యమాత్యులును నయ్యురగంబు వెన్నెక్కి నిలిచి రివ్విధంబున మండూకంబుల మోచుకొని నానాగతి విశేషంబులఁ గొంత ప్రొద్దు పుచ్చి యలసినవాఁడుం బోలె మందవిషుండును మందగమనంబునం గదల నతనికి జలపాదుం డిట్లనియె ౩౩౩

క. వడిగా నడచిన మాకుం । గడువేడుక గాక మందగమనము మాకి
ప్పుడు హర్ష మొదవఁజేయదు । బడుగవుగా వద్దికతము బలహీనతకున్ ౩౩౪

వ. అనుటయు మందవిషుం డిట్లనియె ౩౩౫

గీ. మీరు పెట్టకకాని యాహారమిచట । నబ్బకుండుట తెలిసిన యదియకాదె
వెట్టి పనివానికైనను వేళతోడఁ । గడుపునకుఁ బెట్టి పనిగొంట గలదుగాదె ౩౩౬

వ. అని మఱియును ౩౩౭

క. ఈకొలఁది చూడ దేహము । నాకెమియు వశముగాదు నడవఁగనోపన్
మీకేను భృత్యభావము । గైకొనుటకుఁ బ్రాణరక్ష గావింపఁదగున్ ౩౩౮

వ. అనుటయు భేకకులాధీశ్వరుం డయ్యహికం గరుణించి నీకు ముదల వెట్టితి నిక్కొలని మండూకంబులలోన నీవలసిన వానితోడ నుదరపోషణంబు చేసికొని శీఘ్రంబ చనుదెంచి నాకు వాహన ప్రయోజనంబు దీర్పుమనిన మహాప్రసాదంబని యతనిఁ బ్రధానుల నచ్చట డించి మందవిషుండు జలమధ్యంబునకుం జని ౩౩౯

చ. వలసిన కప్పలం గడుపువాచఁగఁ బారణచేసి వచ్చి ని
చ్చలుఁ దన పూనువాహనపుఁ జందము కొండొక సేపుదీర్చి లో
పలి కుటిలత్వమేమియును బాహిరమై చననీక యన్నిటిం
బొలియఁగఁజేసినన్ మడుగు పాల్పెసఁగెన్ జలపాద శేషమై ౩౪౦

వ అంతట నొక్కనాఁడు మందవిషుండు జలపాద శేషంబైన సరోవరంబునఁ గ్రుమ్మర
మండూకంబులంగానక నాకింక నిచ్చట నిలువంబనిలేదు జలపాద భక్షణానంత
రంబునఁ జనియెదంగాక యని యెలుఁగెత్తి పలికిన నప్పలుకు లాకర్ణించి జల
పాదుండు నాకుం గీడుసేయందలంచితివే యనిన మందవిషుం డిట్లనియె ౩౮౧

క భూసుర శాపము నన్నుం। జేసిన దోసంబు నిన్నుఁ జెందిన పనికిం
గాసిలఁగ నేల రమ్మని। డాసిన జలపాదు రూపడంగ వధించెన్ ౩౮౨

వ వధియించి యాకృష్ణసర్పంబు నిజేచ్ఛం జనియెంగావున నేనును నవ్విధంబున శత్రుల
నాశ్రయించితినని పలికి వెండియు నిట్లనియె ౩౮౩

గీ అగ్నిశేషంబు ఋణశేష మహితశేష। మడఁపలేకున్న నవి వృద్ధి యగుడు నేచి
నిర్దహించును బొదలును నిగిడిచెఱచు। నెఱిఁగి నిశ్శేషముగ నడఁగించు టురవు

గీ అడవి నిర్దహింప ననలంబు తరుమూల। రక్షసేయ మొలచుఁ గ్రమ్మఱంగ
నట్లుగాక శత్రు నాబాలవృద్ధంబు। మొనసిచంపవలయు మొదలడంగ ౩౮౪

వ అని విచారించి పగతుర నిరవశేషంబుగా సంహరించిన భాగ్యవంతుండవని పలికి
చిరంజీవి యిట్లనియె ౩౮౫

సీ వ్యసనశీలుఁడుగాక వసుమతీనాథుండు సకలప్రజాను రంజనము వడసి
క్రోధలోభమదాది గుణములవర్జించి సత్యధర్మక్షమా శాలియగుచు
మొనసి యాత్మచ్ఛిద్రములు గాననీ కన్యమానవచ్ఛిద్రము ల్మది నెఱింగి
దేశకాలంబులు దెలిసి సప్తాంగ సంరక్షకుండై పరాక్రమము మెఱసి
యాత్మసంరక్ష మఱవ కహర్నిశంబు। ధార్మికుండని జగమెల్లఁ దన్నుఁబొగడ
నిగిడి సత్కీర్తి దిక్కుల నించెనేని। దేవతాంశము వాఁడని తెలియవలయు ౩౮౬

వ అని మఱియును ౩౮౭

క కడిఁదిపగరు గైదువుగొని। పొడిచినయెడనైన బ్రదుకు బుద్ధిని జెఱుపం
బడినయమిత్రుఁడు మఱి యె।న్నఁడుఁ దా బ్రతుకంగలేక నాశమునొందున్ ౩౮౯.

చ అలఘునిశాతహేతి నదరంటఁగఁ దాఁకనవైరి యాహవ
స్థలమున నోర్చుఁగాని బహుసైన్యములన్ బొలియింపలేఁడు ని
శ్చలనయతత్త్వసాధనము శాత్రవపుత్రకళత్రమిత్రమం
డలబలశౌర్యవైభవ విడంబములన్ హరియించు గ్రక్కునన్ ౩౯౦

వ అని మఱియును ౩౯౧.

క ఏపని యుద్యోగించిన। నాపని దైవానుకూలమైన ఫలించున్
రూపింపఁగ మానుషమని। చేపట్టి పెనంగనేని సిద్ధింప దిలన్ ౩౯౨

వ కావున దైవానుకూలతలేని పౌరుషవ్యాపారంబు నిరర్థకం బెట్లంటేని ౩౪౪.

సీ తాపసవేషంబు ధరియించె రాముఁడు బంధనప్రాప్తుఁడై బలి యడంగె
వనవాసగతులైరి వగఁ బాండుతనయులు యాదవు లన్యోన్యహతులఁ జనిరి
ఘోరదుర్దశనొంది కుందె నైషధరాజు శరతల్పగతుఁడయ్యె శాంతనవుఁడు
వామనరూపంబు వాసుదేవుఁడు దాల్చె దశకంఠుఁ డర్జునోద్ధతిక నొదిగె
సర్వమును దైవవశమున జరుగు జగము, గాన నేరక తాఁ గర్తగాఁ దలంచు
మూఢచిత్తుఁడు సుజ్ఞానమూర్తియైన। పురుషుఁ డిన్నియు నెఱిఁగి సుస్థిరతనుండు

వ అని మఱియును ౩౪౫

చ. శ్రుతమునఁ జేసి బుద్ధి మతిశూన్యఘనవ్యసనంబుచేత మూ
ర్ఖతయు మదాలసత్వమునఁ గాంతయుఁ జంద్రునిచేత రాత్రియుఁ
వితతసమాధిచే ధృతి పవిత్రజలంబులచేత నేలు నూ
ర్జితనయమార్గవర్తనముచే నృపతిత్వ మలంకృతంబగుఁ ౩౪౬

వ అని యిట్లు చిరంజీవి చెప్పిన హితోపదేశంబునకుఁ బగసాధించిన సాహసంబునకుఁ
బ్రియంబంది మేఘవర్ణుం డతని కర్థరాజ్యంబిచ్చి తానును సామ్రాజ్యంబునం బూ
జ్యుండై సుఖంబుండెనని చెప్పుటయు ౩౪౭

ఉ హారపటీరహీర రజతాద్రి తుషారధరాధరేంద్ర మం
దార మరాళరాజహరనారదపారదకుంద చంద్రికా
క్షీరమృణాలశంఖసురసింధురఫేన ఫణీశకాశ క
ర్పూర సమానకీర్తి వరభూషణ సజ్జన లోకపోషణా ౩౪౮

క ఉభయదళరుద్ర లక్ష్మీ। శుభమందిర సతతదానశోభిత సమ్య
గ్విభవసురాధిప విలస। త్ప్రభవా హేమాద్రిధీర బసువకుమారా ౩౪౯

మత్తకోకిల వాసవప్రతిమానవైభవ వైరిరాజభయంకరా
వాసుదేవపదాబ్జషట్పద వాంఛితార్థిసురాంఘ్రిపా
భాసురప్రమదా మనోభవ భానువంశసముద్భవా
ప్రాసతోమరకుంతముద్గరపట్టసాయుధసాధనా ౩౫౦.

గద్య ఇది మైత్రావరుణగోత్ర పవిత్ర బ్రహ్మనామాత్య పుత్ర సుకవి
జనవిధేయ నారాయణనామధేయప్రణీతంబైన పంచతంత్రం
బను మహాకావ్యంబునందు సంధివిగ్రహం
బనునది తృతీయాశ్వాసము

# పంచతంత్రము.

## లబ్ధనాశము

క. శ్రీసమధికగుణమందిర । వాసవ విభవాభిరామ వర్ధితదానా
భ్యాసకరకమల నిర్మల । భాసురసత్కీర్తిహార బసువకుమారా ౧

వ. అవధరింపుము సుదర్శనక్షితీశనందనులు విష్ణుశర్మకుం బ్రణామం బాచరించి లబ్ధనాశంబను చతుర్థ తంత్రంబెఱింగింపుమనిన నతండిట్లనియె ౨

క. చెందినయర్థం బితరుల । యందపుమాటలకు విడుచు నతిమూఢుఁ డిలన్
డెందంబుగలసి కపితోఁ । బొందైయొక మొసలి మోసపోయినభంగిన్ ౩

వ. అనినఁ దత్కథాక్రమం బెట్టిదని నృపకుమారులడిగిన నతండిట్లనియె ౪

సీ. రంగదుత్తుంగతరంగసంఘంబులు సరసాభినయ కరాబ్జములు గాఁగ
బహువిధప్రచలన పాఠీనపఙ్క్తులు ధవళవిలోల నేత్రములు గాఁగ
సురుచిరస్నిగ్ధపాండుర ఫేనపటలంబు చారుతరాట్టహాసంబు గాఁగ
లాలితభూరిబాలప్రవాళంబులు విరిసిన ఘనజటాభరము గాఁగ
ఘుమఘుమధ్వని వాద్యఘోషములు గాఁగఁ । జండతాండవాడంబర శంభుమూర్తిఁ
బోలునని తన్ను జనములు పొగడునట్టి । వర్ణనకునెక్కియొప్పు మహార్ణవంబు ౫

ఉ. ఆలవణాంబురాశిదరి నర్జునతాలతమాలసాలహిం
తాలరసాల భూరుహవితానము సొంపువహింప నచ్చటన్
వేలతరంబులైన కపివీరులతో బలివర్ధనాముఁ డి
చ్ఛాలఘువర్తనంబుల నజస్రముఁ గ్రుమ్మరుచుండు నత్తఱిన్ ౬.

వ. మఱియును దత్సమీపంబున నొండొక యూథనాథుండైన కపీశ్వరుండు బలివర్ధను నుద్దేశించి ౭

ఉ. ఈముదిమర్కటంబునకు నేటికి నీకపిరాజ్యమంచు ను
ద్దామపటుప్రతాపబలగర్వమునన్ వెడలంగఁదోలినన్

ఁసి యొక్కరుఁడు సిగ్గెసఁగన్ బలివర్ధుఁడేగె నా
ఁవిహారముల్ విడిచి రాజసవృత్తిఁ దొలంగి యయ్యెడన్ ౮.

చనిచని యొక్క నదీతీరంబున మధుగర్భంబను నౌదుంబరంబు ఫలభరితంబైనదాని నాలోకించి బలివర్ధనుండు దనమనంబున ౯.

క కామితఫలముల నొసఁగం। గా ముందటఁ గల్పకంబు గానంబడిన
ట్లామేడి కడుఫలించెను। నాముందటి భాగ్యవాసనకు దృష్టముగాన్ ౧౦

వ అని తలంచి డాయంబోయి ౧౧

క తరువెక్కి దీర్ఘశాఖలఁ। బరిపక్వఫలంబులరసి భక్షించుతఱిన్
గరమునకుఁదప్పి యొకఫల। మరుదుగఁబడె నీటిలో మహాధ్వనితోడన్. ౧౨

క ఆచప్పుడు తనచెవులకు। నేచినకౌతుకముఁ బెనుప నెడనెడఫలముల్
వైచుచును సహజచాపల। మైచను మర్కటము చప్పు డాలించుతఱిన్ ౧౩

వ క్రకచ నామధేయంబగు శింశుమారం బప్పేడిక్రింది జలంబులలోనఁ గ్రుమ్మరుచుండి మత్స్యమీపంబున నెన్నండును నిట్టి యపూర్వధ్వని విన్నదిలేదని తలయెత్తి చూచి నప్పు డౌదుంబరతరుశాఖా సమారూఢశాఖామృగకర విముక్తఫలపతనం బమ్మహాగ్రాహంబు దెలిసి తాను నమ్మధురఫలంబు లుపయోగించి యావృద్ధవానరంబుతోడఁ జెలిమిచేసి తన్మిత్రత్వానందంబున నమ్మధుర ఫలాస్వాదనలాభంబున నచ్చోటుగదలం జాలక కొన్ని దినంబులు మఱచియున్న మొసలిందలంచుకొని యమ్మొసలిభార్య దన సఖిం బిలిచి దానితో నిట్లనియె ౧౪

ఉ ఇంతకుమున్ను నాదు హృదయేశ్వరుఁ డెయ్యెడకైన నేగినన్
సంతస మొప్పవచ్చు నిమిషంబున నిన్నిదినంబులయ్యెఁ దాఁ
గాంతలఁ జేరఁడేమిటికిఁ జిక్కెనొ కాక పరాంగనారతి
భ్రాంతి నిజాలయంబునకు రాకచటం బ్రియమంది నిల్చెనో ౧౫

క తెలియంగవలయుఁ బొమ్మని। పలికిన నదిపోయివచ్చి ప్రాణసఖిక నే
ర్పలవడఁగఁ జెప్పఁదొడఁగెన్। గలవియు లేనివియుఁ గూర్చి కలఁకంబొందన్

సీ నెలఁత నీవిభుఁ జూడ నీవు నన్నంపినఁ జయ్యన నేను బ్రచ్ఛన్న వృత్తిఁ
గదిసి చూచితినొక్క కపిభామ రూపలావణ్యవిలాసభావములఁ బెద్ద
మధుగర్భమను నుదుంబరముపై నుండఁగఁ బొడఁగని దానితోఁ బొందుచేసి
యాపొందు మక్కువ నంతకంతకుఁ బెంప నీయింటి తెరువును నిన్నుమఱచెఁ
బేర్పుమతిఁ బూరుషులు నవప్రియులుగాన। వారి మాన్పంగ నేరికి వశముగాదు
చెలియ నీమీఁదిభక్తిమైఁ జెప్పవలసెఁ। గాక వివరింప నాకేమి కారణంబు ౧౬.

## పరశురామపంతుల - లింగమూర్తి.

ఈకవి సీతారామాంజనేయ మనెడు మూఁడాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు, రామమంత్రికిని తిమ్మాంబకును బుత్రుఁడు, మహాదేవయోగి శిష్యుఁడు ఈగ్రంథము ప్రథమాశ్వాసము తారకయోగమునుగూర్చియు, ద్వితీయాశ్వాసము సాంఖ్యయోగమునుగూర్చియు, తృతీయాశ్వాసము రాజయోగమనఁ బడెడి యమనస్కయోగమును గూర్చియు, తెలుపును ఈసీతారామాంజనేయ సంవాదము బహుజనులచేఁ జదువఁబడెడు జనప్రియమైన పుస్తకముగానున్నది కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగానున్నది ఈకవి తనపాండిత్య ప్రకటనమునకయి యిట్టి వేదాంతగ్రంథమునందు సహితమేకాక్షరద్వ్యక్షర పద్యములనుజొప్పించియున్నాఁడు ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది సీతారామాంజనేయ సంవాదమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను —

ఉ. ప్రాపుగ రామనామము నిరంతరమున్ భజియించువారికిం
బాపములేదటంచుఁ బెనుపాముసు బట్టఁగవచ్చు నగ్నిసం
దీపితలోహఖండము నలిత్వరితంబుగ మ్రింగవచ్చు బ
ల్కోపము పెంచు పెద్దపులికోఱలు దీయఁగవచ్చు నిద్ధరన్ — ఆ ౧

ఉ. నమ్మ మనమ్ములో ననుదినమ్ము వెలుంగు చిదాత్మసత్ప్రభా
వమ్ము నిజమ్ము చేసు నిధనమ్మును సంజననమ్ము రూప వ
ర్ణమ్ములఁ గర్తృకార్యకరణమ్ములు వర్ణగుణాశ్రమాభిమా
నమ్ములు నాకులేవనుచు నమ్మగు నావచనమ్ము నెమ్మదిన్ — ఆ ౨

శా. గానంబు న్నటనంబుఁ దాళగతులం గావించుచున్ జారువి
ద్యానైపుణ్యముఁ జూపుచున్ శిరముమీఁదంగల్గు పెందొంతరన్
బూనం గైకొను నాట్యశీలునిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
న్నానార్థానుభవజ్ఞుఁడయ్యు బుధుఁ డానందాత్ముఁ గాంచున్నదిన్ — ఆ ౩

## పరశురామపంతుల - రామమూర్తి

ఈకవి శుకచరిత్రమనెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు, సీతారామాంజనేయ సంవాదమును రచియించిన లింగమూర్తి పుత్రుఁడును శిష్యుఁడును, ఈతనితల్లి లింగాంబ కవి తనతండ్రినిగూర్చియుఁ దన్నుగూర్చియు నిట్లుచెప్పికొనియున్నాఁడు—

సీ. ఆత్మభూతుఁడుగాని యాత్మభూతుఁడుగాఁడు నిగమాగమాంతార్థ నియతిదోఁపఁ
బురుషోత్తముఁడుగాని పురుషోత్తముఁడుగాఁడు సజ్జనానుగ్రహ సరణి మెఱయ
మృత్యుంజయుఁడుగాని మృత్యుంజయుఁడుగాఁడు సర్వప్రపంచోప శమన మమర
నమృతసిద్ధుఁడుగాని యమృతసిద్ధుఁడుగాఁడు ఘనరసనిధిసమంథనము దనర
ననుచుఁ దా వ్యతిరేకాన్వయ ప్రసిద్ధి । నలరి ప్రత్యక్షముగ నజుం డచ్యుతుండు
నభవుఁ డమరేంద్రుఁ డైయొప్పె నవని నతఁడె।లింగమూర్తియు నాగురులింగమూర్తి
గీ. అమ్మహాలింగమూర్తి లింగాంబికా కు। మారుఁడఁ దదీయ సేవానుమతుఁడఁ బరశు
రామపంతుల కులకంజరాజికర్య। మాకృతినిబొల్చు రామనామకుఁడ నేను

ఇతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయినట్టు తోఁచుచున్నది. ఇతఁడు రచియించినది వేదాంతగ్రంథ మయినను కవిత్వము మృదువయి హృదయరంజకముగా నున్నది. ఈకవిచరిత్రములోని కొన్ని పద్యములను గవితాధోరణిని జూపుటకయి యిం దుదాహరించుచున్నాను —

ఉ. కాయవనంబునన్ ధనువుగా భృకటిం గుటిచేసి నారిగా
నాయువు గూర్చి చూపులను వాఁడిశరంబులఁ బూని షణ్ముఖిన్
హాయనిసృష్టి మాటుగొని మానసముఖ్యమృగంబులన్ సుఖో
పాయముగా వధించు మృగయారతు లుండుదు రప్పురంబునన్ — ఆ ౧
మ. [illegible] యీపనభూమి కెల్లఫలము వాలాయంబుగా నప్సరో
లలనారత్నము లేగి యూఘ్ఘుకులపాలింగల్గు సేమంతికా
లల నాతీరసాలజాలముల నేలా డోలలం గేళి లీ
లల నాటల్గొని యాడు చుండుదురు బాలా కంటిరే యిచ్చటన్ — ఆ ౨
ఉ. ఏచెలిమై ద్రిప్పిన హృదింద్రియబద్ధు లహర్నిశంబు పూ
ర్వాశుభవాభిలాషనిచయంబులకే చను వానిమల్పి నా
నానిగమాంతశాస్త్రవచనశ్రవణాదుల నిల్పు తత్సమా
ధానమె మన్మనఃపదనిధానముగాఁ గొని యభ్యసించెదన్ — ఆ ౩
ఉ. యోగజనాశ్రితానిలనియోగము సాధకలక్ష్యలక్షణో
ద్యోగము దేవతల్వినియోగము సంతతముక్తికామినీ
భోగము నిత్యసత్త్వగుణభాగము దృష్టపరాత్మజీవసం
యోగము నొందఁజేయు భవయోగవియోగము రాజయోగమున్ — ఆ ౪
మ. జగంగాంచితి భేదవాదపటిమల్ చెండాడితిన్ శక్తి వా
దని సంగించితి నాగమాంతమతయుక్తుల్ నిల్పి మెప్పింప న

గ్గని మోదించినముక్తికాంతను మహాకల్యాణ యుక్తంబుగా
నెనయుం హర్షించ నతండు దానిఁ గొని యే నేలెంచితి స్వేదుకన్ — ఆ ౫

## వేగినాటి - కొండనార్యుఁడు.

ఈకవి వివేకసింధువనెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచించెను. ఇతఁడు వేగినాటి నియోగిబ్రాహ్మణుఁడు, శ్రీవత్సగోత్రుఁడు. మొట్టమొదట నీవివేకసింధువును నాంధ్రవచనకావ్యముగా రచియించిన ముకుందయోగిని కవి యీక్రింది పద్యమున స్తుతించియున్నాఁడు—

మ. వినుతింపన్ భవరోగవైద్యమగు నీవేదాంత శాస్త్రంబు పా
వనమై యుండఁ బ్రవీణతన్ వచనకావ్యం బొప్పఁగాఁ జెసె స
జ్జనులం బ్రోచిన పుణ్యమూర్తి విమలస్వాంతుండు విజ్ఞాన శా
సనుఁడైనట్టి ముకుందమానికి నమస్కారంబు గావించెదన్

ఈకవియు నూఱేండ్ల క్రిందట నుండియుండవచ్చును. శుకచరిత్రమునందు వలెనే యీ వివేకసింధువునందును వ్యాకరణ విరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచున్నను, మొత్తముమీఁద కవిత్వము మృదువయి శ్రావ్యముగా నున్నది. కవనరీతి తేటపడుటకయి వివేకసింధువునుండి కొన్ని పద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి—

చ. కడువడిఁ గర్మమార్గమను కారడవింబడి విభ్రమించుచున్
జడమతి నింద్రియార్థఫలసంచితతిక్తకషాయసారముల్
దడఁబడఁ గ్రోలి దుర్వ్యసనదాహమునన్ వెగడొంది స్రుక్కి మీ
యడుగులు గాంచితిన్ నను గృపామృత మానఁగనిచ్చి ప్రోవవే. — ఆ ౧

మ. వడిగాఁ దీసి ధనుర్ధరుండు విడువన్ బాణంబు నెందాఁక న
వ్వడిగల్గున్ శరమంతదాఁక నడుచున్ వమ్మైనయచ్చోటనే
పడుఁ బ్రారబ్ధపుఁ గర్మవేగమున నాపర్యంతమున్ దేహముల్
పడ వావేగము తూలినం బడును జూ భగ్నంబులై మేదినిన్ — ఆ ౨

మ. సమతన్ మేఘుఁడు వారిధారలు మహిన్ సంప్రీతి వర్షింపఁ బ
ల్లములై యుండినచోట్ల నీరు నిలుచున్ లక్షింపఁగా నందుపై
దుముకున్నీరము నిల్వ దట్లగుట నెందుం బాత్రమూహించి యు
త్తమునందుం దగ బ్రహ్మవిద్య నిలుపన్ ధర్మంబు చింతింపఁగన్ — ఆ ౩

మ. తనువుల్ స్వప్నమనోరథంబుల క్రియన్ దంభోపలంభంబులై
యనయుంబుం బొడచూపుఁ బోవు నివి కర్మాధీన సంప్రాప్తముల్

ఎనయన్నాకును వీనితోఁదగులు లేదెల్లప్పుడున్ నేఘనుం
డను నిత్యుండ నిరామయుండ విమలుండ౯ సాక్షిచైతన్యుఁడన్ — ఆ ౪

ఉ అప్పుడు పుట్టినట్టి శిశువంగును జవ్వనియై మిటారియై
యొప్పులకుప్పయైన వికచోత్పల లోచనయందు వార్ధకం
బుప్పతిలంగ నున్న ముదియవ్వలియందును నిర్వికారుఁడై
చెప్పెడిదేమి యెందు సమచిత్తుఁడు షండుఁడ యెంచిచూడఁగ౯ — ఆ ౫

## పినుమచ్చ - బుచ్చిరాజు.

ఈకవి పరతత్త్వప్రకాశికయనెడి యెనిమిదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచియించెను ఇతఁడు క్షత్రియుఁడు, ధనంజయ గోత్రుఁడు, వేంకటపతిరాజ కుమారుఁడు ఈకవి తాను కర్లపాలెము గ్రామనివాసుఁడయినట్టును, సూర్యవంశపు రాజయినట్టును వ్రాసికొనియున్నాఁడు భాగవతములోని కపిల దేవహూతి సంవాదమాధారముగా నీగ్రంథము పెంచి వ్రాయఁబడినది ఇతఁ డేకాలమునందుండెనో నిశ్చయముగాఁ దెలియదుగాని నూఱుసంవత్సరముల లోపలివాఁడని తోఁచుచున్నది అక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగములు పెక్కులున్నను, కవిత్వము చక్కఁగానే యున్నదని చెప్పవచ్చును పరతత్త్వ ప్రకాశికలోని రెండుపద్యము లిందుఁ క్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి —

ఉ. కోరి భజింపఁగాఁ దగిన కోవిదు నాత్మవివేకశీలసం
చారు వికారదూరు శ్రుతిశాస్త్రపరిష్కృతనిశ్చయార్థస
త్సారమనంతబిందువిలసన్మధుపానవికాసభాసురు౯
ధారుణి సర్వసంశయవిదారుని ధీరుని సద్గురూత్తమున్ — ఆ౩

చ మనసు సుషుప్తి నొక్క వడి మానుగ గ్రమ్మినఁ జేయుకార్యముల్
కనఁబడ వేమియు౯ మనసు గ్రమ్మఱమేల్కని యాతఁడాతఁడున్
మనమను మంటఁ గాఁ గల సమస్తముఁ దోఁచు మనోవినాశమై
తనరినఁ జిత్తమింద్రియసదాగతులున్ లయమౌను దానితోన్ — ఆ౭

## వాసుదేవయోగి.

ఈకవి జీవప్రబోధమనెడు నాలుగాశ్వాసముల వేదాంతగ్రంథమును రచి

యించెను. యోగశాస్త్రము లను పేర రచియింపఁబడిన వేదాంతగ్రంథములలో ననేకములకంటె నిందలి కవిత్వము సులక్షణమయి హృదయంగమముగా నున్నది. కవి యే కాలపువాఁడో తెలియదుగాని నూఱుసంవత్సరముల పయివాఁడని తోఁచుచున్నది. జీవప్రబోధములోని రెండుపద్యముల నిందుదాహరించు చున్నాను —

చ. అనవిని జీవుఁడిట్లనుఁ బ్రయత్నముఁ బ్రాప్యపదంబు లేక తా
నన యము ఖండమై జగములందును గారణ కార్యరూపతం
బెనఁగొనియున్న యాత్మ కొకపిండపదంబుఁ బ్రయత్నసాధనం
బును నన గల్గునే యనుచు బుద్ధికిఁదోఁచెడి దీనిఁ జెప్పవే --౫౩

ఉ. అంధతమఃప్రకృత్యనుగతాత్ముల శుద్ధశరీరశుద్ధిచే
బంధవిముక్తి గోరి కరిభంగిని నీటమునుంగ దేహదు
ర్గంధము వాయుఁగాక భవకర్మనిబంధవిముక్తి కల్గునే
బంధురరాగరోషములఁ బాసిన శుద్ధతఁ గాక జీవుఁడా -౫౮

## కోటమరాజు - నాగయ.

ఈకవి యధ్యాత్మ రామాయణమును పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడాలువేల నియోగిబ్రాహ్మణుఁడు, కాశ్యపగోత్రుఁడు, భాస్కర మంత్రికిని శాయాంబకును బుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములో నిప్పటి నలువది సంవత్సరముల క్రిందట నుండిన వాఁడు. కాణాదము పెద్దనకవి కృతమైన యధ్యాత్మ రామాయణము వలె కవిత్వ మంతప్రౌఢముగా నుండకపోయినను మొత్తముమీఁద హృద్యమయి నిర్దుష్టమయియున్నది. అధ్యాత్మ రామాయణములోని కొన్ని పద్యము లిందుఁ జూపఁబడుచున్నవి—

ఉ. ధరణీదేవ భవత్తపోమహిమ చోద్యంబయ్యె నిన్మెచ్చితిన్
వరమేలి చ్ఛేద హైహయుం దునిమి గర్వగ్రస్తులౌ రాజులన్
ధరణిం జేరడఁగించి కశ్యపునకుం ధాత్రీతలం బిచ్చి శాం
తిరుచిం దాల్చు మదంశనొంది పితృహ్యాత్తాపంబు వారింపఁగన్ --బాలకాం

ఉ. రామ త్రిలోకవిశ్రుతు విరాధు నెఱుంగవె మద్భయంబునన్
వేమఱు మౌను లీవనమువీడి పలాయితులైరి నీవు మా
సేమము గోరదేని యిట సీతనుడించి నిరాయుధుండవై
భూమి నదృశ్యవైఖరిని బొమ్ము రయమ్మునఁ దమ్ముతోడుతన్ —ఆరణ్యకాం

ఉ ఏ నెఱిఁగించి నంతటనె యిమ్ముకరాలయ మెంత దాటి లం
కానగరంబుఁ దుత్తుమురుగా నొనరింపఁగఁ జాలుఁ గాంస్యక
జ్యానినద ప్రముక్త శరజాలములన్ రఘుపత్తముండు నీ
పైని మనంబు పెట్టి యొకపందువు దెమ్ముఁ డారగింపఁగన్ —సుందరకాం

మ మునివప్యాల్ విజయోస్తుతే యనఁగ సమ్మోదంబుతో నేగి య
న్న నియోగించినభంగి నా లకణునిం జక్కాఁడి నిర్భీతిమై
జనులెల్లన్ వసియించు పట్టణము లిచ్చుంజెసి తద్రాజ్య పా
లన నైపుణ్యముతోడ నింపెఁగెఁ గళ్యాణీ భవానీసలీ —ఉత్తరకాం

## అల్లమరాజు - రామకృష్ణకవి.

ఈకవి కవిచకోరచంద్రోదయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు, రంగనాథామాత్య పుత్రుఁడు, హరితసగోత్రుఁడు తనగ్రంథమును ద్రాక్షారమ భీమేశ్వరుని కంకితముచేయుటచేత నే కవి గోదావరీ మండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది తన్నుఁగూర్చి భీమేశ్వరుఁ డిట్లన్నట్టు కవి తనకవిచకోరచంద్రోదయమునందుఁ జెప్పుకొనియున్నాఁడు —

సీ అమరఁగ వైనతేయవిజయంబును సత్యభామావిలాసంబు భాసురముగ
గౌతమీమాహాత్మ్య కథయును ద్రౌపదీపరిణయ మలసుశోభావివాహ
మసమాన హనుమదాఖ్యానంబును సుకవిజనమనోరంజనం బనెడుకావ్య
మవనిలో రచియించినట్టి ప్రౌఢవు నీవుగావున నీవాక్యకలిత లలిత
మాధురిమఁ గ్రోలుచుండెడి నామానసంబు। తనివిదీఱదు నాభక్తుఁ డనుచునిన్ను
నెన్నుటలుగాదు కాని నీకన్నధరణిఁ। గలరె కవితాసుధాధార లొలుకఁ బలుక

పయిపద్యమునుబట్టి కవి వైనతేయవిజయము, సత్యభామావిలాసము, గౌతమీమాహాత్మ్యము, ద్రౌపదీ పరిణయము, సుశోభా వివాహము, హనుమదాఖ్యానము, సుకవిజన మనోరంజనము, అను కావ్యములను గూడ రచియించినట్లు తెలియ వచ్చుచున్నది ఈతని కవిత్వము సలక్షణమయి ప్రౌఢమయి హృదయాహ్లాద కరముగా నున్నది ఇతఁ డఱువది సంవత్సరముల క్రిందట నుండినవాఁడు కవి యీచకోర చంద్రోదయమును శాలివాహనశకము ౧౭౭౪ వ సంవత్సరమునకు సరియైన మన్మథాబ్దమునం దనఁగా క్రీస్తుశకము ౧౮౫౨వ సంవత్సరమునందు రచియించినట్లు గ్రంథాంతమున వ్రాసికొనియున్నాఁడు ఈకావ్యమునందలివి కొన్ని పద్యము లిందుదాహరింపఁ బడు చున్నవి —

ఉ. భారము నొప్పు పుష్పఫలభారవినమ్రమహీజరాజశో
భారమణీయసానుచరభవ్యనభశ్చరభామినీవిపం
చీరవమాఘుకీకలితజృంభితగానఘుమంఘుమార్భటీ
పూరితనూత్నరత్నయుతభూరిదరిం గనియెన్ మహాగిరిన్ —ఆ ౧

ఉ. మారుని మీఱుపీనిసుకుమారము మారమణీ సహోదరున్
గూరిమి నోముమోము తళుకుల్వలుకుల్ నెఱజాణ వైఖరిన్
గేరు నయారె నిర్జరులఁ గిన్నరులు న్నరులెన్న వీనియొ
య్యారమె చూడనింపగు జయంతు జయింతు నటన్నరీతులన్ —ఆ ౨

## కాకరపర్తి - కృష్ణకవి.

ఈకవి శశిరేఖాపరిణయము, ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము, అనుకావ్యములను జేసెను ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు, తిరుపతి పాత్రకవికిని సీతమాంబకును తనూజుఁడు ఈపాత్రకవి సత్యభామాకృష్ణసంవాదాది గ్రంథములను రచియించి శ్రీ మహారాజా గొడే నారాయణగజపతి రాయనింగారి పూర్వుఁడైన జగ్గారాయనింగారివలన నగ్రహారాదులను బడసెనఁట ఈకృష్ణకవి విశాఖపట్టణ మండలములోనివాఁడు ప్రపౌత్రుఁ డిప్పుడు జీవించియుండుటచే నితఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు ఈయన కవిత్వము దోషరహితమయి హృదయంగమముగానున్నది కవికృతపుస్తకద్వయము నుండియు రెండేసిపద్యముల నుదాహరించుచున్నాను —

ముఖలింగక్షేత్రమాహాత్మ్యము

చ. అరుదుగ సర్వలోకనిచయం బతివేలఘనాంధకారభీ
కరవిపదబ్ధిలోఁ బడ నకారణవైరమునన్ వసూజ్జ్వల
త్తరణి ముఖప్రచారములు తప్పఁగఁజేయుచు నన్నిదిక్కులన్
బెరిఁగెను వింధ్యభూధరము పీతమహాంబునిధీ తపోనిధీ —అ ౧

ఉ. ఈవగ వైభవాతిశయ మెన్నఁగ శక్యమె ధాతకైన జాం
బూనదరౌప్యరత్నముఖభూరిమనోహరవస్తువిస్ఫుర
త్సానుచరన్మరుద్దనుజచారణకిన్నరసిద్ధసాధ్యసం
తానసమృద్ధి నొప్పువిదితంబగుమేరునగంబుకైవడిన్.—ఆ ౩

శశిరేఖా పరిణయము

ఉ. మానుల నెట్లు ప్రోచితివొ మానసవీథిఁ దలంపఁ బాపముల్
మానకధార్తరాష్ట్రుఁ డవమానమునుం డగఁజేయుచుండెఁ గృ

ష్ణా నను గావవే యనెడు నాపలు కిప్పుడొకించుకైన నీ
వీనుల సోఁకకుండు టిదెవింత జనార్దన కంసమర్దనా —ఆ ౧

చ అనవిని వానితోడ విజయాత్మజుఁ డిట్లనియెన్ దురాత్మ యీ
వనమును గుత్తగొంటెవిర వచ్చినవారి నెఱుంగ కీవు పా
ప్మనుటకు నీవె యీజగతియందును విక్రమశాలివా వదం
బున నిటువల్కఁగాఁ దగదు పొమ్మిపు డూరక వైరమేటికిన్ —ఆ

పయిపుస్తకముగాక కోనపల్లి నివాసుఁడగు వేంకటరంగకవి రచితమైన దొకటియు, అప్పప్పయను భట్టురాజ రచితమైన దొకటియు, శశిరేఖాపరిణయ మనుపేర రెండాశ్వాసిక ప్రబంధములు ముద్రింపఁబడియున్నవి వానినుండియు రెండేసి పద్యముల నిందుదాహరించెదను —

వేంకటరంగకృత శశిరేఖాపరిణయము

శా శుద్ధాంతంబున భైరవార్చనకళాశుద్ధిన్ జరాసంధుఁడు
ద్యద్ధైర్యంబున నిల్వ మొక్కొ నృపుఁ గ్రోధావేశసంభూతస
ద్బుద్ధిం బట్టి కరుక్కురుక్కనఁగఁ దోర్దోశ్శక్తి ముంద్రించి శ
శ్వద్ధాత్రిం బలియిచ్చు మందె విలసద్బాహాబలోదగ్రుఁడై —ఆ ౧

ఉ అంతటికంటె ముందుగనె హాయిగ మజ్జన భోజనంబు లిం
దంపెనొనర్చి సాత్యకి సహాయముగా వసుదేవదేవకీ
నందను లవ్విధంబు దళనాయకకోటి కెఱుంగఁ జేసి బల్
దుందుభి కాహళాది పటుతూర్యరవంబులు బోరుకల్గఁగన్. —ఆ, 3

అప్పప్పకృత శశిరేఖా పరిణయము

ఉ అన్నలుమాటలాడు సమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్నయశాలియైన ముసలాయుధుఁ గన్గొని నీవుఱందియున్
నన్నిటఁ బంపుచుండి పరిణామము వేఁడె ధనత్కుమారియా
కన్నియ మత్సుతాగ్రగణికిఁ గాకుణికోత్తము పెండ్లిచేయవే —ఆ ౧

ఉ పోయన ధార్తరాష్ట్రులను భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరిని మిక్కిలిన్ భయముఁ జెందఁగఁ జేసిన నీపరాక్రమఁ
బౌర నుతింప వ్యాళపతికైనను శక్యముగాదటంచు నా
మారుతి పుత్రునింబొగడి మక్కువతోడఁ గిరీటి యంతటన్ —ఆ ౪